శనివారం 25-2-2023


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 161


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



బోపన్న జోడీకి టైటిల్
ఖతర్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో విజేతగా బోపన్న-ఎబ్డెన్ జోడీ - 13లో


ఆరో రోజూ ఆగని అమ్మకాలు
సెన్సెక్స్ నష్టం 142 పాయింట్లు 17,500 దిగువకు నిఫ్టీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


రుణ భారంతో తలకిందులు
మోయలేని రుణ భారం దెబ్బకు వర్ధమాన దేశాల ఆర్థిక పరిస్థితి తలకిందులవుతోందని ప్రధాని మోదీ ఆందోళన వెలిబుచ్చారు.
వివరాలు 6లో ▸


'సీడబ్ల్యూసీ'పై ఖర్గేకు అధికారం
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులందరినీ నామినేట్ చేసే అధికారాన్ని అధ్యక్షుడు ఖర్గేకు కట్టబెట్టాలని ఏఐసీసీ నిర్ణయించింది.
వివరాలు 6లో ▸


అది ప్రభుత్వ విధానపర నిర్ణయం
పీరియడ్ సమయంలో మహిళలకు సెలవు మంజూరుపై ప్రభుత్వాలు విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని సుప్రీం పేర్కొంది.
వివరాలు 6లో ▸


చిన్న పార్టీల చుట్టూ...
27న మేఘాలయ, నాగాలాండ్‌లలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో జాతీయ, ప్రాంతీయ పార్టీల బలాబలాలపై కథనం.
వివరాలు 6లో ▸

ఈనాడుపై ఆగని నిరసన జ్వాల

రామోజీ తప్పు ఒప్పుకున్నా... చంద్రబాబుది మాత్రం అదే తీరు

- సవాళ్లు చేసి గన్నవరానికి వెళ్లి మరీ ఘర్షణకు పాల్పడ్డ పట్టాభి
- పోలీసులు అరెస్టు చేయటంతో కొట్టకపోయినా.. నానా యాగీ
- పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలతో రెచ్చగొట్టిన 'ఈనాడు'
- అంతా దుమ్మెత్తి పోయటంతో తప్పయిపోయిందని అంగీకారం
- కానీ... శుక్రవారం గన్నవరం వెళ్లి చంద్రబాబు నాయుడి శివాలు
- పట్టాభిని కొడతారా.. ఇప్పుడు రండంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ఒక అబద్ధాన్ని నిజం చెయ్యటానికి బాబు, ఎల్లో మీడియా తంటాలు
- అబద్ధమని తేలాక కూడా బాబు ఇలా చేయటంపై సర్వత్రా విస్మయం
- రెండ్రోజులుగా 'ఈనాడు' ప్రతుల్ని తగలబెడుతున్న జనం
- శుక్రవారం సైతం రాష్ట్రంలో కొనసాగిన ఆగ్రహ జ్వాలలు


శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 'ఈనాడు' ప్రతులను తగులబెడుతున్న ప్రజలు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: 'వంశీ సంగతి నేనే స్వయంగా తేలుస్తా.. ఏమనుకుంటున్నాడో నేనంటే ఏమిటో చూపిస్తా' అని మరీ సవాలు చేసి.. గన్నవరం వెళ్లి రచ్చ చేసి.. ఎమ్మెల్యే వంశీ వర్గీయులను రెచ్చగొట్టింది టీడీపీ నేత పట్టాభి. ఇది పద్ధతి కాదని చెప్పబోయిన వంశీ అనుచరులపై బరితెగించి దాడులకు పాల్పడిందే కాక.. గొడవ నివారించడానికి వచ్చిన పోలీసులపైకీ రాళ్లు రువ్వింది పట్టాభి అండ్ కో. ఆ దాడిలో సీఐ కనకారావు గాయపడ్డాక.. పట్టాభి, మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాతి నుంచి ఎల్లో మీడియా విష ప్రచారం శ్రుతిమించి సాగింది. పట్టాభిని పోలీసులు ఇష్టానుసారం కొట్టారంటూ దుష్ప్రచారం చేశారు.'ఈనాడు' మరో అడుగు ముందుకు వేసి.. పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలతో ఓ తప్పుడు కథనాన్ని పతాక శీర్షికన ప్రచురించింది. అవి 2021లోని ఫొటోలని జనం సోషల్ మీడియా ద్వారా బయటపెట్టారు. దీంతో తేలు కుట్టిన దొంగలా ఎక్కడో లోపలి పేజీలో

మిగతా 2వ పేజీలో ▶


గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

సీఎం జగన్ నాయకత్వంలో అగ్రగామిగా ఏపీ

ప్రజలను ఉద్దేశించి నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తొలి ప్రసంగం

సాక్షి, అమరావతి: యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ ఆధారిత అభివృద్ధి, వృద్ధిరేటు పెరుగుదల రానున్న రోజుల్లోనూ ఇలాగే కొనసాగుతాయని ఆశిస్తున్నానన్నారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ విధానంలో రూ.1.82 లక్షల కోట్లను పారదర్శకంగా పంపిణీ చేసిందని తనకు తెలిసిందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు ద్వారా పరిపాలనను వికేంద్రీకరించారని ప్రశంసించారు. ప్రభుత్వ సేవలు, పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళ్లి ప్రభుత్వం వినూత్న సంస్కరణలను తెచ్చిందని అభినందించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్ సమీప భవిష్యత్‌లోనే అన్ని వృద్ధి సూచీల్లో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధిస్తుందని ఆకాంక్షించారు. ఈ మేరకు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి దూరదర్శన్ సప్తగిరి చానల్ ద్వారా జస్టిస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

ఏపీది గొప్ప సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం

గొప్ప సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం ఏపీకి ఉంది. గవర్నర్‌గా సేవ చేసే అవకాశం దక్కినందుకు గర్వంగా, గౌరవంగా భావిస్తున్నా. నా సొంత రాష్ట్రం కర్ణాటక.. ఏపీతో ఎన్నో అంశాల్లో అవినాభావ సంబంధం

మిగతా 2వ పేజీలో ▶

విద్యుత్ కొరత రాకూడదు

అధికారులు అన్ని విధాలుగా సిద్ధం కావాలి

- బొగ్గు నిల్వలపై జాగ్రత్త వహించాలి
- రైతులకు కనెక్షన్ల మంజూరులో జాప్యం జరగకూడదు
- ఇంధన శాఖపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- ఈనెల 2వ వారం నుంచే పెరిగిన డిమాండ్.. అందుకు తగ్గట్టుగా సమాయత్తం అవుతామన్న అధికారులు
- మార్చి, ఏప్రిల్‌లో సగటున రోజుకు 240–250 మిలియన్ యూనిట్లు అంచనా
- ఇప్పటికే పవర్ ఎక్స్ఛేంజ్‌లో ముందస్తుగా బుకింగ్
- జగనన్న కాలనీల్లో ఇప్పటికే 2.18 లక్షలకుపైగా ఇళ్లకు కనెక్షన్లు



సాక్షి, అమరావతి: వేసవిలో విద్యుత్ కొరత రాకూడదని, డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను సమకూర్చుకోవడానికి అన్ని విధాలుగా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్, రైతులకు విద్యుత్ కనెక్షన్లు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తదితర అంశాలపై శుక్రవారం ఆయన తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఇంధన శాఖతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి, వేసవి డిమాండ్ అంచనాలను ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో ▶

సీబీఐ దర్యాప్తుపై సందేహాలు

సీబీఐ విచారణ అనంతరం మీడియాతో కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి

- నిజ నిర్ధారణ లక్ష్యంగా దర్యాప్తు సాగడం లేదనిపిస్తోంది
- వ్యక్తి టార్గెట్‌గా వెళ్తున్నారన్న భావన కలుగుతోంది
- సరైన దిశలో విచారణ సాగాలంటున్నానే తప్ప అనుమానించడం లేదు.. మీడియా బాధ్యతగా వ్యవహరించాలి
- సీబీఐ దర్యాప్తులో ఏడాది క్రితం టీడీపీ నేతల ఆరోపణలు
- గూగుల్ టేకవుటా లేక టీడీపీ టేకవుటా అనేది కాలమే నిర్ణయిస్తుంది


మీడియాతో మాట్లాడుతున్న అవినాష్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ.. నిజాన్ని వెలికితీసే కోణంలో కాకుండా, వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని సాగుతోందన్న భావన కలుగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సీబీఐ విచారణ సరైన దిశలో వెళ్లాలని చెబుతున్నానే తప్ప అనుమానించడం లేదని స్పష్టం చేశారు. మీడియా సైతం ఈ విషయంలో నిజాలను నిజాలుగా చూపాలని కోరారు. తనకు తెలిసిన అన్ని నిజాలను పొందుపరుస్తూ సీబీఐ అధికారులకు వినతిపత్రం ఇచ్చానని, అందులోని అంశాలపైనా విచారణ జరగాలని కోరినట్టు తెలిపారు. అబద్ధాన్ని నిజంగా.. నిజాన్ని అబద్ధంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కోఠిలోని సీబీఐ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యారు. అనంతరం సాయంత్రం బయటికి వచ్చాక మీడియాతో మాట్లాడారు. జనవరి 28న విచారణకు కొనసాగింపుగా శుక్రవారం రెండోసారి సీబీఐ అధికారుల విచారణకు హాజరైనట్లు తెలిపారు. గతంలో విచారణప్పుడు మరోమారు పిలుస్తామని చెప్పారని, ఈసారి మాత్రం మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదన్నారు. ఎంపీ ఇంకా ఏమన్నారంటే..

మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

మీడియా బాధ్యతగా వార్తలు ప్రసారం చేయాలని మనవి చేస్తున్నా. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. మళ్లీ అదే చెబుతున్నా. నేను విజయమ్మ గారి దగ్గరికి వెళ్లి వస్తే.. బెదిరించి వచ్చానని

మిగతా 3వ పేజీలో ▶




'ఎమ్మెల్సీ'లోనూ వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవాలు

- 9 స్థానిక సంస్థల నియోజక వర్గాల్లో ఐదింట్లో ఏకగ్రీవం
- వైఎస్సార్, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తూర్పు గోదావరి ఏకగ్రీవం
- 27న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికారికంగా ప్రకటన
- మిగిలిన నాలుగింటిలోనూ స్వతంత్రులే ప్రత్యర్థులు
- కడపలో స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలిపి బోల్తా పడ్డ టీడీపీ

10లో

రాష్ట్రంలో కొత్తగా 3,000 ఆలయాలు



- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కదానికి రూ.10 లక్షల వ్యయం
- ఇప్పటికే పురోగతిలో 936 ఆలయాల నిర్మాణ పనులు
- కొత్తగా 1,568 ఆలయాల నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆమోదం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి

5లో

ఈడబ్ల్యూఎస్ వారికి మరో ఐదేళ్లు

- ప్రభుత్వ ఉద్యోగాల్లో వయోపరిమితి పెంపు
- ఏపీ రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు రూల్స్‌ను సవరిస్తూ ఉత్తర్వులు

- వివరాలు 10లో

న్యూస్‌రీల్

ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం



సుదీర్ఘ తీరప్రాంతం, సుశిక్షితులైన మానవ వనరుల లభ్యత, వ్యాపారాలకు ప్రభుత్వ తోడ్పాటు తదితర సానుకూల అంశాలతో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యామ్నాయం మరేదీ లేదని మంత్రులు బుగ్గన, అమర్‌నాథ్ తెలిపారు.
వివరాలు 3 ▸

విశాఖలో బీఈఎల్ 'ఎస్‌డీసీ'



కేంద్ర ప్రభుత్వ నవరత్న కంపెనీ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) విశాఖలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. రక్షణతోపాటు వివిధ రంగాలకు సంబంధించి సురక్షితమైన ఐటీ సేవలను అందించడమే లక్ష్యంగా విశాఖలోని ఈ ఎస్‌డీసీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది.
వివరాలు 3 ▸

ఔషధాల రక్షణ కీలకం



ఫార్మా పరిశ్రమలు కేవలం ఔషధ ఉత్పత్తులపైనే కాకుండా... వాటి రక్షణ, నిల్వలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూకీ హెగిన్స్ చెప్పారు. ఆమె విశాఖలో 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.
వివరాలు 5 ▸

గృహ సారథులను ఎదుర్కొనేందుకే..



వైఎస్సార్‌సీపీ తీసుకొచ్చిన గృహ సారథుల వ్యవస్థను ఎదుర్కొనేందుకే కుటుంబ సాధికార సారథుల పేరిట తాము కొత్త వ్యవస్థను తెచ్చామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టం చేశారు. కుటుంబ సాధికార సారథి ఓట్ల విషయంలో సీరియస్‌గా ఉంటూ ఒక్క దొంగ ఓటు కూడా పడనివ్వకూడదన్నారు.
వివరాలు 3 ▸

ఇదేం జోకర్


'సారుకు' పెళ్లి కావట్లేదని మథనపడే విషయాన్ని కూడా చేర్చితే బావుంటుందేమో సార్!



ఏపీలో గ్రీష్మ తాపం.. హీట్‌వేవ్స్ ప్రతాపం

- రాష్ట్రంలో దశాబ్ద కాలంగా పెరుగుతున్న వడగాల్పుల రోజుల సంఖ్య
- దేశంలో అధిక వడగాల్పులు నమోదైన రెండో రాష్ట్రంగా ఏపీ
- ఎక్కువ హీట్‌వేవ్ రోజులతో మొదటి స్థానంలో రాజస్థాన్
- కడప, కర్నూలు, మచిలీపట్నం, విశాఖల్లో పెరుగుతున్న వడగాల్పులు
- కాకినాడ, కళింగపట్నంలలో తగ్గుదల

10లో

ఘనంగా తిరుపతి పుట్టినరోజు వేడుకలు

తిరుపతి నగరం 893వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ, మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన ఆధ్యాత్మికయాత్ర వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భజన మండళ్ల కళాప్రదర్శనల నడుమ శోభాయమానంగా సాగింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన చెక్క భజనలు, కోలాటాలు, కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కనులపండువగా సాగిన యాత్ర గోవిందనామ స్మరణతో తిరుపతి పులకించిపోయింది.


తిరుపతి నగరంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న ప్రజానీకం

5లో

క్లుప్తంగా...

సీఎంతో టీవీఎస్ మోటార్ కంపెనీ ఎండీ భేటీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో టీవీఎస్ మోటార్ కంపెనీ ఎండీ సుదర్శన్ వేణు మర్యాదపూర్వకంగా కలిశారు.
- సాక్షి, అమరావతి

టూరిజం డెస్టినేషన్ హబ్‌గా ఏపీ

- ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- ఏపీ టూరిజం కాఫీ టేబుల్ బుక్స్ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- విశాఖలో ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నేపథ్యంలో ప్రత్యేక పుస్తకాల ప్రచురణ

సాక్షి, అమరావతి: రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని టూరిజం డెస్టినేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దేలా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏపీ టూరిజం కాఫీ టేబుల్ బుక్స్‌ను ఆవిష్కరించారు. బెస్ట్ టూరిజం పాలసీ అవార్డును కైవసం చేసుకున్న ఏపీ ప్రభుత్వ టూరిజం శాఖ పాలసీని ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన వారిని అభినందించారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 నేపథ్యంలో ఏపీ టూరిజం, హ్యాండీక్రాఫ్ట్స్ టెంపుల్స్, బీచ్‌లు, సోల్స్ స్పేస్, ఏ టూ జెడ్ టేబుల్ గైడ్ తదితర ప్రత్యేక పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించింది. ఇంగ్లిష్, జర్మన్, స్పానిష్, చైనీస్ భాషల్లో రూపొందించిన ఈ పుస్తకాలను ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లు, వివిధ దేశాల రాయబార కార్యాలయాలు, టూరిజం సెంటర్స్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఏపీ ప్రత్యేకతలతో పాటు రాష్ట్రంలో టూరిజం, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం గురించి ఈ పుస్తకాలలో ప్రత్యేక కథనాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ డాక్టర్ రజత్ భార్గవ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ ఆర్.కరికాల్ వలవెన్, సమాచార శాఖ కమిషనర్ తుమ్మ విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బెండపూడి విద్యార్థులపై అసత్యప్రచారం తగదు

- నేను అడిగిన ప్రశ్నలకు ఆంగ్లంలో చక్కగా సమాధానం చెప్పారు: సీఆర్‌ఐఎస్పీ స్టేట్ లీడ్ అధికారిణి ఉషాకుమారి

సాక్షి, అమరావతి: బెండపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆంగ్ల భాష పరిజ్ఞానంపై ఒక పత్రిక అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదని రిటైర్డ్ ఐఏఎస్, సీఆర్‌ఐఎస్పీ స్టేట్ లీడ్ అధికారిణి ఉషాకుమారి స్పష్టం చేశారు. బెండపూడి 'బడాయే..' అమెరికన్ ఇంగ్లిష్ బాగోతం బట్టబయలు... అంటూ ఒక పత్రికలో గురువారం వచ్చిన కథనాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఉషాకుమారి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మీలో ఇంగ్లిష్ స్కిల్స్ పెంచడానికి ప్రత్యేక తరగతులు, అదనపు ఫ్యాకల్టీ ఏమైనా కావాలా' అని మాత్రమే తాను ప్రశ్నించగా, అందుకు విద్యార్థులు చక్కగా సమాధానం చెప్పినట్లు ఉషాకుమారి వివరించారు. ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను తాను మందలించినట్లు కూడా ఆ పత్రికలో అవాస్తవాలు రాయడం బాధాకరమన్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మారుమూల గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థులు సైతం ఇంగ్లిష్‌లో మాట్లాడే ప్రయత్నం జరుగుతున్నందుకు సీఆర్‌ఐఎస్పీ స్టేట్ లీడ్ అధికారిణిగా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, బోధనా సిబ్బందితో మాట్లాడుతూ ఇంగ్లిష్ బోధనలో వారికి ఇంకా ఏమైనా వనరులు లేదా సాంకేతిక సహకారం అవసరమైతే సీఆర్‌ఐఎస్పీ సహకరిస్తుందని చెప్పానని ఆమె వివరించారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన కార్యక్రమాలకు సీఆర్‌ఐఎస్పీ సంస్థ ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తుందని ఉషాకుమారి తెలిపారు.

ఇంటివద్దే జీవన్ ప్రమాణ్ సేవలు

- లైఫ్ సర్టిఫికెట్ ఇంటివద్దే సమర్పించే అవకాశం
- పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు ఎంతో మేలు
- ఐపీపీబీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

సాక్షి, అమరావతి: ఈ ఏడాది నుంచి పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్‌ను ఇంటివద్దనే సమర్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఇంటివద్ద నుంచే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను అందించే ప్రక్రియను అందుబాటులోకి తీసుకొస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి ఉత్తర్వులు జారీచేశారు. 2023 నుంచి జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో రెండు విధాలుగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిజిటల్‌గా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేవారు ఐపీపీబీ డోర్‌స్టెప్ సర్వీసు, మీ సేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నుంచి జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఒకదాన్ని ఎంచుకోవచ్చని, లేకపోతే నేరుగా ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి కనిపించడం ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని తెలిపారు. దీనిపై పెన్షనర్లకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమం నిర్వహించాలని ట్రెజరీ డైరెక్టర్‌కు ఆదేశాలను జారీచేశారు.

రైతు బిడ్డకు ఏడాదికి రూ.44 లక్షల ప్యాకేజీ

- అమెజాన్ భారీ ఆఫర్



ఉన్నగిరి లావణ్య

త్రిపురాంతకం: సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఓ యువతి అమెజాన్‌లో భారీ ప్యాకేజీతో కొలువు సాధించింది. ఏడాదికి రూ.44 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికైంది. ఈ మేరకు శుక్రవారం ఆమెకు అమెజాన్ నుంచి కాల్ లెటర్ అందింది. వివరాల్లోకెళ్తే.. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం మేడపి గ్రామానికి చెందిన ఉన్నగిరి కక్కయ్య, లక్ష్మీకాంతం దంపతుల కుమార్తె లావణ్య గుంటూరు వీవీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఐటీ ఫైనలియర్ చదువుతోంది. ఈ క్రమంలో ఇటీవల కళాశాలలో అమెజాన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో సత్తా చాటింది. ఏడాదికి రూ.44 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం పొందింది. చిన్ననాటి నుంచి చదువులో ముందుంటున్న లావణ్య పదోతరగతిలో 9.6 గ్రేడ్, ఇంటర్మీడియెట్‌లో 90 శాతానికి పైగా మార్కులు సాధించింది. తమ కుమార్తెకు అమెజాన్‌లో కొలువు దక్కడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు లావణ్యను అభినందనలతో ముంచెత్తారు.



నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో సీఎం వైఎస్ జగన్, రాష్ట్ర మంత్రులు



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన ఏపీ, కర్ణాటక హైకోర్టులకు చెందిన పలువురు ప్రస్తుత, రిటైర్డ్ న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు తదితరులు



గవర్నర్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్, హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సతీమణి, సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతి



గవర్నర్‌ను కలిసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సీఎం జగన్ నాయకత్వంలో అగ్రగామిగా ఏపీ

▶ మొదటి పేజీ తరువాయి

కలిగి ఉంది. భౌగోళికంగా పక్కపక్కనే ఉండటంతోపాటు రెండు రాష్ట్రాలు ప్రధానంగా వ్యవసాయాధారితమైనవి. తెలుగు భాష పట్ల అవ్యాజ్యమైన మక్కువ కలిగిన శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భోజుడుగా వాసికెక్కారు. ఎంతో మంది తెలుగు ప్రముఖులను ఆయన తన సామ్రాజ్యంలో కీలక స్థానాల్లో నిలిపారు. అంతేకాకుండా తన ఆస్థానంలో కవులుగా స్థానం కల్పించారు.

స్వాతంత్య్రోద్యమంలో ఏపీ కీలక భూమిక..

మహాత్మాగాంధీ పిలుపును అందుకుని స్వాతంత్య్రోద్యమంలో ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించింది. చీరాల-పేరాల ఉద్యమం, అల్లూరి సీతారామరాజు నిర్వహించిన రంపా తిరుగుబాటు ఏపీలో కీలక ఘట్టాలు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో తెలుగు ప్రజల చిరకాల డిమాండ్ అయిన ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. ఘనమైన సాంస్కృతిక, సంప్రదాయ వారసత్వ సంపద కలిగిన ప్రముఖ దేవాలయాలకు నిలయంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటకులు, భక్తులకు అద్భుతమైన అనుభూతిని కలిగిస్తోంది.

అపార ఖనిజ సంపదకు నిలయం

బొగ్గు, లైమ్‌స్టోన్, బాక్సైట్ తదితర అపార ఖనిజాలకు ఏపీ నిలయం. గోదావరి, కృష్ణా, పెన్నా పరీవాహక ప్రదేశాలతో, సారవంతమైన భూములతో పటిష్ట సాగునీటి వ్యవస్థను కలిగి ఉంది. వరి ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ అగ్ర రాష్ట్రంగా గుర్తింపు పొందింది. దేశ తూర్పుతీరంలో అత్యధికంగా 974 కి.మీ.తీరరేఖను కలిగి ఉంది. మూడు కేంద్రీయ, 4 డీమ్డ్, 5 ప్రైవేటు, 25 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, 20 అటానమస్ విద్యా సంస్థలతో ఏపీ ఎడ్యుకేషన్ హబ్‌గా గుర్తింపు పొందింది. కాగా రాష్ట్రం గురించి మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలను ఉటంకిస్తూ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తన ప్రసంగాన్ని ముగించారు.

గవర్నర్‌గా జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీ స్వీకార ప్రమాణం

హాజరైన సీఎం వైఎస్ జగన్, పలువురు ప్రముఖులు.. అనంతరం తేనీటి విందు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గవర్నర్‌గా జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. అంతకు ముందు గవర్నర్‌గా ఎస్ అబ్దుల్ నజీర్‌ను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి చదివి వినిపించారు. పదవీ స్వీకార ప్రమాణం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అభినందనలు తెలిపి సత్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతోపాటు రాష్ట్ర మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు గవర్నర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టు, కర్ణాటక హైకోర్టులకు చెందిన పలువురు ప్రస్తుత, రిటైర్డ్ న్యాయమూర్తులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్, సమీరా నజీర్ దంపతులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి రెడ్డి దంపతులు ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులతో తేనీటి విందులో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రతిపక్ష నేత చంద్రబాబు తేనీటి విందులో పాల్గొనకుండా వెళ్లిపోవడం గమనార్హం. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు గవర్నర్‌తో కలిసి గ్రూప్ ఫొటో తీయించుకున్నారు.

విద్యుత్ కొరత రాకూడదు



ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు సీఎంకు వివరించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ఫిబ్రవరి 2వ వారం నుంచే విద్యుత్ డిమాండ్ పెరిగిందని చెప్పారు. మార్చిలో సగటున రోజుకు 240 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్‌లో 250 మిలియన్ యూనిట్లు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే పవర్ ఎక్స్ఛేంజ్ (బహిరంగ మార్కెట్)లో విద్యుత్‌ను షార్ట్ టర్మ్ టెండర్ల ద్వారా ముందస్తుగా బుక్ చేసుకున్నామని చెప్పారు. బొగ్గు నిల్వల విషయంలో కూడా అధికారులు తగిన జాగ్రత్త వహించాలని, థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత రాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వేసవిలో విద్యుత్ కొరత కారణంగా కరెంటు కోతలనే సమస్య ఉత్పన్నం కాకూడదని స్పష్టం చేశారు.

అదే నెలలో విద్యుత్ కనెక్షన్

రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అందించే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ఈ సమావేశంలో సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి 1.06 లక్షల కనెక్షన్లు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మంజూరు చేశామని సీఎంకు అధికారులు వెల్లడించారు. మార్చి నాటికి మరో 20 వేల కనెక్షన్లపైగా మంజూరు చేస్తున్నామని చెప్పారు. రైతులకు కనెక్షన్ల మంజూరులో ఎలాంటి జాప్యం జరగకూడదన్న సీఎం.. ఇకపై ఏ నెలలో దరఖాస్తు చేసుకుంటే అదే నెలలో సర్వీసు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేస్తామని అధికారులు చెప్పారు.

సరఫరాలో నాణ్యత

విద్యుత్ సరఫరా నాణ్యతను పెంచాలన్న సీఎం ఆదేశాల మేరకు అనేక చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 100 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తవుతోందని తెలిపారు. మార్చి ఆఖరు నాటికి వీటిని పూర్తి చేస్తామని తెలిపారు. పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న ఇళ్లకు వెంటనే కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 2.18 లక్షలకుపైగా ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చామని, ఇళ్లు పూర్తవుతున్న కొద్దీ వాటికి శరవేగంగా కనెక్షన్లు ఇస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ట్రాన్స్‌కో జేఎండీలు ఐ.పృథ్వీతేజ్, బి.మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దన రెడ్డి, నెడ్‌క్యాప్ వీసీఎండీ ఎస్.రమణారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ఈనాడు'పై ఆగని నిరసన జ్వాల



గుంటూరు నగరంలోని లాడ్జిసెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నేతలు

▶ మొదటి పేజీ తరువాయి

'సవరణ' వేయడం ద్వారా ఈనాడు తన తప్పు ఒప్పుకోక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. అవి పాత ఫొటోలేనని, సాంకేతిక కారణాల వల్ల అవి పొరపాటున ప్రచురితమయ్యాయని లెంపలేసుకుంది. ఈనాడు రెండు నాల్కల ధోరణిపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల వారిలో చర్చ మొదలైంది. 'రామోజీరావు నేతృత్వంలోని ఈనాడు మరీ ఇంత దిగజారిందా.. చంద్రబాబు కోసం తన పరువు తీసుకోవడానికి సైతం సిద్ధపడటం ఏ పాత్రికేయ ప్రమాణాలకు నిదర్శనం..' అని జోరుగా చర్చించుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, ప్రజా సంఘాలు ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఇంత జరిగాక కూడా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తన తీరు మార్చుకోలేదు. తగుదునమ్మా అంటూ శుక్రవారం గన్నవరం వెళ్లారు. పట్టాభిని కొడతారా.. అంటూ నిలదీశారు. పట్టాభిని పోలీసులు కొట్టలేదని తెలిసినా.. అబద్ధాన్ని నిజం చేయాలని పదే పదే ప్రస్తావిస్తూ పరితపించిపోయారు. ఇప్పుడు రండి చూసుకుందాం.. అంటూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. పోలీసులపై కూడా నోరు పారేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఎల్లో ఈనాడు, మిగతా మీడియా మరోసారి పెద్ద ఎత్తున అవాస్తవాలకు పెద్దపీట వేస్తూ ప్రచారం చేస్తోంది. నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్న తీరును ప్రజలు గమనిస్తూ నిప్పులు చెరుగుతున్నారు. ఈ క్రమంలో 'ఈనాడు' పత్రిక ప్రతుల దహనం కార్యక్రమం శుక్రవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగింది.

పాత్రికేయ వృత్తికే అవమానం

ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు' పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో పాత్రికేయ వృత్తికే అవమానం కలిగేలా దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం కూడా నిరసన ఎగసిపడింది. అది చంద్రబాబు కరపత్రిక అని ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాల నేతలు నినదించారు. అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ఎదుట ఈనాడు ప్రతులను దహనం చేశారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేసి సమాజంలో జర్నలిజం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన పత్రిక ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం తగదన్నారు. గోరంట్ల, రాప్తాడు, పెనుకొండలో కూడా నిరసన ప్రదర్శన నిర్వహించారు. చిత్తూరు జిల్లా సదుం, శ్రీరంగరాజపురం, ప్రకాశం జిల్లా దర్శి, గిద్దలూరు, నెల్లూరు జిల్లా కావలి, ఆత్మకూరులో 'ఈనాడు' ప్రతులను దహనం చేశారు. గుంటూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన విద్యార్థి నేతలు అనంతరం అక్కడి నుంచి శంకర్‌విలాస్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాచర్ల, చిలుకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండలో ఈనాడు ప్రతులు, రామోజీ చిత్రపటాలను దహనం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, మైలవరంలో రామోజీ దిష్టి బొమ్మను దహనం చేశారు.

అసత్య కథనాలు రాస్తే సహించేది లేదు

ఉన్నతాశయంతో పని చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు చేస్తున్న కుట్రలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఏలూరులో ప్రజలు మండిపడ్డారు. ఏలూరు, గాలాయగూడెం, నూజివీడు, భీమడోలు, భీమవరంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. కాకినాడలో రామోజీ దిష్టిబొమ్మను ఊరేగించారు. కిర్లంపూడి మండలం జగపతినగరంలో ప్రధాన రహదారిపై కాకినాడ ఎంపీ వంగా గీత, తదితర నేతల ఆధ్వర్యాన ఈనాడు ప్రతులను దహనం చేశారు. రామోజీరావు బహిరంగ క్షమాపణ చెప్పాలని పిఠాపురంలో పలువురు డిమాండ్ చేశారు. తుని, కోటనందూరు, ఒంటిమామిడి జంక్షన్, పెద్దాపురం, సామర్లకోటలో నిరసన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం, అయినవిల్లి మండలం పోతుకుర్రులో ఈనాడు ప్రతులను దహనం చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని పాతపట్నం, హిరమండలం, నరసన్నపేట, పలాస తదితర ప్రాంతాల్లో ఈనాడుపై ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. విజయనగరంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బొబ్బిలి, కురుపాం, విశాఖ నగరంలో పలుచోట్ల ఈనాడు పత్రిక ప్రతులను తగులబెట్టారు.



విశాఖలో 'ఈనాడు'ప్రతులను తగలబెడుతున్న ప్రజలు



అనంతపురంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న ప్రజా సంఘాలు



కృష్ణాజిల్లా గుడివాడలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న స్థానికులు



విజయనగరంలోని పూల్‌బాగ్ రోడ్డులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు



ప్రకాశం జిల్లా దర్శిలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న స్థానికులు



శ్రీకాకుళంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం



తిరుపతి జిల్లా సదుంలో ఈనాడు పత్రిక ప్రతులను తగలబెడుతున్న ప్రజలు, నేతలు



కాకినాడ జిల్లా పెద్దాపురం మునిసిపల్ సెంటర్లో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా...

అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే ఇకపై.. కాసు బ్రహ్మానంద రెడ్డి ఎక్స్‌ప్రెస్ వే

ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం




కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేగా నామకరణం చేసిన అద్దంకి-నార్కెట్‌పల్లి హైవే

దాచేపల్లి: పల్నాడు ప్రాంతానికి చెందిన రాజకీయ యోధుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత కాసు బ్రహ్మానందరెడ్డి పేరు చిరస్మరణీయంగా నిలిచేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బ్రహ్మానందరెడ్డి చేసిన సేవలు, ఆయన చేసిన అభివృద్ధిని గుర్తించిన ప్రభుత్వం హైదరాబాద్-విజయవాడ హైవే, విజయవాడ-చెన్నై హైవేలను కలుపుతూ పల్నాడు ప్రాంతంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికి కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేగా నామకరణం చేస్తూ గురువారం ఉత్తర్వులిచ్చింది. సుమారుగా 200 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారికి కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేగా నామకరణం చేయడంపై పల్నాడు ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారికి తన తాత పేరు పెట్టడంపై గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఈ హైవే నిర్మాణాన్ని చేపట్టారు.

పాదయాత్రను అడ్డుకుంటే దండయాత్ర చేస్తా

- పవన్, జూనియర్ ఎన్టీఆర్‌లకు రెడ్ కార్పెట్ వేసి సిద్ధంగా ఉంచాం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్



తిరుపతి తుడా: అడ్డుకోకుండా తనకు సహకరిస్తే పాదయాత్ర చేస్తానని.. లేకపోతే వైఎస్సార్‌సీపీపై దండయాత్ర చేస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హెచ్చరించారు. పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే టీడీపీ లక్ష్యమని తెలిపారు. ఆయన యువగళం పాదయాత్రను శుక్రవారం నిర్వహించలేదు. దీంతో తిరుపతిలోని సంకల్ప ఆస్పత్రి రోడ్డు సమీపంలోనే రోజంతా గడిపారు. ఈ సందర్భంగా పలువురితో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడిన లోకేశ్ తాను ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు మొబైల్, టీవీ కంపెనీలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తీసుకువచ్చానన్నారు. సీఎం వైఎస్ జగన్ ఈ జిల్లాకు ఏ కంపెనీ తీసుకొచ్చారో చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్‌ను తాను 2014లోనే మొదటిసారి చూశానన్నారు. రాష్ట్రంలో మార్పుతోపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని పవన్ ఆకాంక్షించారని చెప్పారు. పవన్ కల్యాణ్, జూనియర్ ఎన్టీఆర్ వంటి వాళ్లకు తాము రెడ్ కార్పెట్ వేసి సిద్ధంగా ఉంచామన్నారు. సమాజంలో మార్పు, గుడ్ గవర్నెన్స్ తీసుకురావడానికి వాళ్లను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. విద్యా దీవెన, వసతి దీవెన దరిద్రమైన పథకాలని విమర్శించారు.

జర్నలిజం విలువలకు 'ఈనాడు' పాతర

- పాత ఫొటోలతో తప్పుడు వార్త ప్రచురించడం జర్నలిజాన్ని దిగజార్చడమే
- ఏపీడబ్ల్యూజేఎఫ్ మండిపాటు

సాక్షి, అమరావతి: మీడియా విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిందని అనేక వర్గాలు ఘోషిస్తోన్న తరుణంలో ఈనాడు దినపత్రిక పతాక శీర్షికలో పాత చిత్రాలతో కూడిన తప్పుడు వార్త ప్రచురించడం జర్నలిజం ప్రమాణాలను మరింత దిగజార్చడమేనని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) మండిపడింది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈనాడు' ఇలాంటి పనులకు పాల్పడడం శోచనీయమన్నారు. ఇది జర్నలిజం వృత్తి ప్రమాణాలను దిగజార్చడం మాత్రమే కాదని.. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడమేనని పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం, స్వీయ ప్రయోజనాలకు మాత్రమే ప్రాధాన్యం కల్పించడం ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విరుద్ధమన్నారు. జర్నలిజం విలువలకు తిలోదకాలిస్తున్న ఇలాంటి వైఖరి కారణంగా రోజురోజుకు మీడియా పట్ల నమ్మకం సడలిపోతోందని ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగునాట మీడియా తమ వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా తమకు అక్కరలేని రంగులు పులుముకుందన్నారు. జర్నలిస్టులను రాజకీయ పార్టీల కార్యకర్తల స్థాయికి చేర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా రాజకీయ పార్టీల వార్తా కథనాలు, వ్యాఖ్యలు అనుకూల, వ్యతిరేక ధోరణుల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. వార్తల్లో వాస్తవాలను మాత్రమే ఇవ్వాల్సిన 'ఈనాడు' వార్తను వక్రీకరించి ప్రచురించడం జర్నలిజం విలువలకు పాతర వేయడమేనన్నారు. ఇది ఒక రాజకీయ పక్షాన్ని రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు పెచ్చు మీరడానికి మీడియా కారణం కాకూడదని తెలిపారు.

విశాఖలో బీఈఎల్ 'ఎస్‌డీసీ'

- 150 మంది ఐటీ ఇంజనీర్లతో కేంద్రం ప్రారంభం
- స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలియజేసిన బీఈఎల్
- అన్ని రకాల ఐటీ సేవలు అందిస్తామని వెల్లడి



విశాఖలో ఎస్‌డీసీని ప్రారంభిస్తున్న వినయ్‌కుమార్ తదితరులు

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ నవరత్న కంపెనీ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్(ఎస్‌డీసీ)ను ప్రారంభించింది. రక్షణతోపాటు వివిధ రంగాలకు సంబంధించి సురక్షితమైన ఐటీ సేవలను అందించడమే లక్ష్యంగా విశాఖలోని రామ్‌నగర్ ప్రాంతంలో ఈ ఎస్‌డీసీని ఏర్పాటు చేసినట్లు బీఈఎల్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. 150 మంది ఇంజనీర్లు పని చేసేవిధంగా ఏర్పాటు చేసిన ఎస్‌డీసీ కేంద్రాన్ని ఇటీవల బీఈఎల్ డైరెక్టర్ (బెంగళూరు కాంప్లెక్స్) కె.వినయ్‌కుమార్ ప్రారంభించినట్లు వెల్లడించింది. బెంగళూరులోని స్ట్రాటజిక్ బిజినెస్ యూనిట్ (ఎస్‌బీయూ)ను విస్తరిస్తూ విశాఖలో ఎస్‌డీసీని ఏర్పాటు చేసినట్లు వివరించింది. బీఈఎల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ డివిజన్ ఇప్పటికే అతి కీలకమైన రక్షణ, ఎయిర్‌స్పేస్, ఈ-గవర్నెన్స్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వంటి రంగాల్లో అనేక ప్రాజెక్టులను విజయవంతంగా అమలుచేసింది. అత్యంత కీలకమైన విభాగాల్లో సురక్షితమైన ఐటీ సేవలను అందించే లక్ష్యంతో విశాఖలో ఎస్‌డీసీ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇక్కడ నుంచి డీఆర్‌డీవోతో కలిపి నేవీకి సంబంధించిన అన్ని రకాల ఐటీ ఆధారిత ప్రాజెక్టులను చేపట్టనుంది. వీటితోపాటు స్మార్ట్ సిటీ, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ రంగాల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌ను అందించనున్నట్లు పేర్కొంది. ఆహ్లాదకరమైన, అత్యంత సురక్షిత వాతావరణంలో ఉద్యోగులు పనిచేసే విధంగా ఎస్‌డీసీ ఏర్పాటు చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఐటీ రంగంలో దిగ్గజ సంస్థలు ఇన్ఫోసిస్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, రాండ్‌స్టాడ్ వంటి ప్రతిష్టాత్మకమైన ఐటీ కంపెనీలను ఆకర్షించిన విశాఖ... తాజాగా మరో నవరత్న కంపెనీ బీఈఎల్ కూడా తమ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో రాష్ట్ర విద్యార్థులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

- పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ప్రభుత్వం ముందుంది
- సగటున 12 రోజుల్లోనే అనుమతులు
- పరిశ్రమల కోసం 48వేల ఎకరాలు సిద్ధం
- హైదరాబాద్‌లో జీఐఎస్ రోడ్‌షోలో మంత్రులు రాజేంద్రనాథ్, అమర్‌నాథ్
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సుదీర్ఘ తీరప్రాంతం, పుష్కలమైన వనరులు, సుశిక్షితులైన మానవ వనరుల లభ్యత, వ్యాపారాలకు ప్రభుత్వ తోడ్పాటు తదితర సానుకూల అంశాలతో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యామ్నాయం మరేదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సత్వరం అనుమతులు మంజూరు చేస్తూ వ్యాపారాలు, పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ప్రభుత్వం ముందుందని చెప్పారు. విశాఖ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్) 2023కు సంబంధించి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. సుస్థిర అభివృద్ధి సాధిస్తూ ముందుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమలకు అవసరమైన సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని మంత్రి బుగ్గన వివరించారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు నైపుణ్యాల్లో శిక్షణకు కూడా పెద్ద పీట వేస్తోందన్నారు. ఐటీ, బల్క్ డ్రగ్ పార్క్, పీసీపీఐఆర్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెరైన్, వ్యవసాయం, పునరుత్పాదకశక్తి వంటి రంగాలలో పెట్టుబడులకు ఏపీ అనుకూలమన్నారు.

అనుమతుల సమయాన్ని కుదించాం

రాష్ట్రంలో పరిశ్రమల కోసం 48వేల ఎకరాలకు పైగా స్థలం సిద్ధంగా ఉందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలకు స్థలం కాకుండా సగటున 12 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. కొత్తగా తేబోయే పాలసీలో 21 రోజుల్లో స్థలాన్ని కూడా కేటాయించాలని భావిస్తున్నట్లు వివరించారు. 974 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం, 534 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు, 6 సెజ్‌లు, 3 ఐటీ సెజ్‌లు, 3 పారిశ్రామిక కారిడార్లు, రెండంకెల వృద్ధి రేటుతో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు పూర్తి అనుకూలమని పేర్కొన్నారు. వైజాగ్ ఐటీ గమ్యస్థానంగా మారుతోందని తెలిపారు. పరిశ్రమలకు నీటి సరఫరాకు గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో వేలకొద్దీ చిన్న, మధ్య తరహా సంస్థలు ఏర్పాటవుతున్నాయని ఏపీటీపీసీ చైర్మన్ కె.రవిచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో బాక్సైట్, మాంగనీస్ తదితర 48 రకాల ఖనిజాల లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ఏపీలో అవకాశాలను తెలియజేసేందుకు, పారిశ్రామిక భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు జీఐఎస్ తోడ్పడుతుందని తెలంగాణ సీఐఐ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి చెప్పారు.

పారిశ్రామికవేత్తల హర్షం

ప్రస్తుతం రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న పారిశ్రామికవర్గాలు ప్రభుత్వ సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎండీ డీవీఎస్ నారాయణ రాజు తెలిపారు. ఏపీలోని తమ ప్లాంటులో నీరు, విద్యుత్ కొరత లేదని చెప్పారు. విద్యుత్, ఇంధనం కూడా మిగతా రాష్ట్రాలతో పోలిస్తే చౌకగా లభిస్తున్నాయన్నారు. స్విచ్‌గేర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డైరెక్టర్ ఒ.జగన్నాథ్ మాట్లాడుతూ తమ సంస్థ ఇప్పటికే చిత్తూరు ఇండస్ట్రియల్ పార్క్‌లో కార్యకలాపాలు సాగిస్తోందని, మరో రూ.150 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సబ్సిడీలు అందిస్తోందని, పరిశ్రమల నిర్వహణ సులభతరం చేసిందని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, నైపుణ్యాల శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, ఏపీ మారిటైం బోర్డు సీఈవో షన్ మోహన్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ దర్యాప్తుపై సందేహాలు

▶ మొదటి పేజీ తరువాయి

చర్చలు పెట్టి, ప్రచారం చేస్తున్నారు. అది ఎంత వరకు సబబు? నేను దుబాయ్‌కి వెళ్లిపోయానని వక్రీకరించే వార్తలు వేస్తున్నారు.


- తెల్లవారుజామున 3 గంటలకు ఫోన్లు చేశానని వక్రీకరించే వార్తలు వేయడమే కాకుండా దానిపై గంటల తరబడి, రోజులపాటు చర్చలు పెడుతున్నారు. విచారణ జరుగుతున్నప్పుడు మీడియా బాధ్యతగా మెలగాలి. మీడియానే ట్రయల్ పూర్తి చేసి..దోషులెవరో, నిర్దోషులెవరో మీడియానే నిర్ణయిస్తోంది. ఇది విచారణపై ఎంత ప్రభావం పడుతుందో ఒకసారి మీరే ఆలోచించండి. ఒక అబద్ధాన్ని సున్నా నుంచి వందకు పెంచే ప్రయత్నం జరుగుతోంది. అదేవిధంగా ఒక నిజాన్ని వంద నుంచి సున్నా చేసే ప్రయత్నం జరుగుతోంది.
- ముందు నుంచి కూడా ఫ్యాక్ట్ టార్గెట్‌గా కంటే పర్సన్ టార్గెట్‌గా విచారణ జరగడం సరికాదు. గూగుల్ టేకౌట్ అన్నది నిజమైన గూగుల్ టేకౌటా.. టీడీపీ టేకౌటా అన్నది భవిష్యత్తులో కాలమే నిర్ణయిస్తుంది. ఎందుకు ఈ మాట అంటున్నానంటే.. సీబీఐ సమర్పించిన కౌంటర్‌లోని విషయాలన్నీ ఏడాది క్రితం టీడీపీ వాళ్లు చేసిన విమర్శలే. అందువల్ల ఎవరికైనా సందేహాలు రావడం సహజం. ఈ పరిస్థితిలో విచారణ సరైన కోణంలో వెళ్లాలని చెబుతున్నాను తప్ప.. నేను అనుమానించడం లేదు.

ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా

- వివేకం సార్ చనిపోయిన రోజు నేను మార్చురీ దగ్గర మీడియాతో మాట్లాడాను. మళ్లీ రెండు రోజుల తర్వాత కూడా మీడియాతో మాట్లాడాను. ఆ రోజు ఏం మాట్లాడానో.. ఈ రోజూ అదే మాట్లాడుతున్నా. సీబీఐ వాళ్లకు అదే చెబుతున్నా. ఎవరెన్నిసార్లు అడిగినా అదే చెబుతా. ఎందుకంటే నాకు తెలిసిన నిజం అదే కాబట్టి.
- ఆ రోజు ఆ విషయం గురించి మీడియాతో మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి నేనే. అందుకే నేను ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా. సీబీఐ వారి ప్రశ్నలకు నాకు తెలిసిన సమాధానాలు చెప్పాను.
- వివేకం సార్ చనిపోయిన రోజు సీన్ ఆఫ్ క్రైంకి నేను వెళ్లేటప్పటికే అక్కడ ఒక లెటర్ ఉంది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టారు. ఆ లెటర్‌లో అది హత్య అని స్పష్టంగా ఉంది. అందులో అనేక అంశాలు ఉన్నాయి. ఆ విషయాల గురించి నేను చెప్పడం కంటే భవిష్యత్తులో అవన్నీ బయటికి వస్తాయి.
- ఇంతకు ముందు అడిగినట్టే అడ్వొకేట్ సమక్షంలో ప్రశ్నించాలని, అన్ని విషయాలు ఆడియో.. వీడియో రికార్డింగ్ చేయాలని ఇప్పుడు కూడా కోరాం. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్‌కు కూడా లెటర్ పెట్టాం. కానీ అది జరగలేదు. అయితే ఒక ల్యాప్‌టాప్‌ను మాత్రం నా ముందు ఉంచారు. అది ఎందుకోసం అన్నది నాకు తెలియదు.

ఈనాడుపై చట్టపరమైన చర్యలు

- రామోజీపై నేరపూరిత నష్ట పరిహారం దావా వేస్తాం: మంత్రి జోగి రమేష్




సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టపై బురద చల్లుతూ ప్రచురించిన తప్పుడు కథనాలపై గడువులోగా బహిరంగ క్షమాపణలు కోరనందున 'ఈనాడు' యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి జోగి రమేష్ ప్రకటించారు. డెడ్‌లైన్ ముగిసినందున రామోజీరావుపై నేరపూరిత నష్ట పరిహారం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని తెలిపారు. గన్నవరం ఘటనలో పట్టాభికి సంబంధించి తప్పుడు ఫొటోలు, తప్పుడు వార్తలతో కథనాలు ప్రచురించిన ఈనాడును స్వచ్ఛందంగా బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్న వికృత జర్నలిజం ప్రజల ఆగ్రహ జ్వాలల్లో మాడి మసి అవుతోందన్నారు. వికృత జర్నలిజాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

గడప గడపకూ వచ్చే ధైర్యముందా?

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విఫలమైందని విమర్శలు చేస్తున్న చంద్రబాబుకు ఇంటింటికీ వెళ్లే ధైర్యం ఉందా? సీఎం జగన్ 32 పథకాలతో ప్రజల మన్ననలు పొందారు. అందుకే మేం ధైర్యంగా గడప గడపకూ వెళ్తున్నాం. సామాజిక న్యాయాన్ని సీఎం జగన్ చేతల్లో చూపారు. గన్నవరంలో తొడలు కొడుతున్న చంద్రబాబు బీసీల సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అసెంబ్లీ సమావేశాల్లో సామాజిక న్యాయంపై చర్చిద్దామా? ఏ ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందో చర్చించే ధైర్యం ఉందా? బీసీలను చంద్రబాబు బానిసలుగా వాడుకుంటే సీఎం జగన్ బలవంతుల్ని చేశారు. చేపలు పట్టుకునే కులంలో జన్మించిన నా అన్నలను రాజ్యసభలో కూర్చోబెట్టారు. కల్లు గీసుకునే నా బీసీ సోదరులను రాజ్యసభ మెట్లెక్కించారు. రాళ్లు కొట్టుకునే నా వడ్డెరలను శాసనమండలిలో కూర్చోబెట్టారు. నీలాంటి పిరికిపంద కొట్టుకోడానికి లగ్నం పెట్టడం ఏమిటి చంద్రబాబూ? నేను స్వయంగా నీ ఇంటికి వచ్చా. నీ ఇంటి దగ్గరకు వచ్చి వినతిపత్రం ఇద్దామంటే పారిపోయిన పిరికిపందవు నువ్వు. టీడీపీకి, చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు 2019లోనే లగ్నం పెట్టి దహనం చేసేశారు. లోకేశ్ చిటికెలు, ఈలలు వేయడం ఏమిటి? సీఎం జగన్‌ను నేరుగా చూస్తే లోకేశ్‌కి ప్యాంటు తడిచిపోతుంది.

పక్కదారి పట్టించేందుకే కుట్రపూరిత కథనాలు

- వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు: సజ్జల
- బీజేపీలోకి పంపిన కోవర్టుల ద్వారా వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న బాబు
- సీబీఐ ప్రకటనల వెనుక రాజకీయ ప్రమేయం



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో విచారణను పక్కదారి పట్టించేందుకే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి పేర్లను కుట్రపూరితంగా ప్రస్తావిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ కుట్రల వెనుక ఉన్న మాస్టర్ మైండ్ చంద్రబాబేనని స్పష్టం చేశారు. బీజేపీలో కోవర్టులుగా ఉన్న తన మనుషుల ద్వారా వ్యవస్థలను చంద్రబాబు మేనేజ్ చేస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ మేరకు ఎల్లో మీడియాలో కథనాలను ప్రచురిస్తున్నారని చెప్పారు. రామోజీరావు లాంటి కుట్రదారులు, పరాన్న జీవులంతా చంద్రబాబుతో చేతులు కలిపి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సీఎం జగన్‌పై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.

వివేకా బావమరిది నుంచి ఫోన్ కాల్..

వైఎస్ వివేకా హత్య జరిగిన సమయంలో అధికారంలో ఉన్నది చంద్రబాబే. ఈ కేసులో స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మొత్తం చంద్రబాబుదే. చంద్రబాబు ఓ కట్టుకథను తయారు చేసి ఎల్లో మీడియా ద్వారా విడుదల చేస్తారు. గతంలో దివంగత వైఎస్సార్‌పై కూడా చంద్రబాబు ఫ్యాక్షన్ ముద్ర వేశారు. వివేకా హత్య కేసులో సిట్ రిపోర్టులు బయటకు వస్తే వాస్తవాలు వెల్లడవుతాయి. ఈ ఘటనతో ఎంపీ అవినాష్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు. ఈ కేసులో నాటి మంత్రి ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవికి సంబంధం ఉన్నట్లు ఆధారాలున్నాయి. వివేకా బావమరిది శివప్రకాష్‌రెడ్డి ఫోన్ చేస్తేనే వైఎస్ అవినాష్‌రెడ్డి హత్యా స్థలానికి వెళ్లారు. శివశంకరరెడ్డి కూడా తప్పు చేయలేదని మేం భావిస్తున్నాం. వైఎస్ వివేకా అజాత శత్రువు. కానీ ఆయన చుట్టూ నేరప్రవృత్తి కలిగిన మనుషులున్నారు. వివేకా కుటుంబంలోనూ విభేదాలున్నాయి.

కల్పిత వాంగ్మూలాలతో వ్యక్తిత్వ హననం.

సీఎం జగన్ కుటుంబానికి వివేకాతో అవినాభావ సంబంధం ఉంది. వైఎస్ విజయమ్మపై వివేకా పోటీ చేసినప్పటికీ ఆ తర్వాత ఆయన వైఎస్సార్‌సీపీలోకి వస్తానంటే వైఎస్ జగన్ సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి వచ్చినప్పటి నుంచి అవినాష్‌రెడ్డికి ఒక తండ్రిలా వివేకా సలహాలు ఇచ్చేవారు. వివేకా హత్య కేసులో టీడీపీ, చంద్రబాబు కుట్రలకు అనుగుణంగా సీబీఐలో కింది స్థాయి అధికారులు పనిచేస్తున్నారు. నిష్పక్షపాతంగా పనిచేయకపోగా కల్పిత వాంగ్మూలాలను సృష్టించి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. సీబీఐ లీకుల వెనుక రాజకీయ ప్రమేయముంది.

గుండెపోటుతో చనిపోయారని చెప్పింది శివప్రకాష్‌రెడ్డే

- సంఘటన జరిగిన తర్వాత అక్కడ దొరికిన లేఖ అనుమానాస్పదంగా ఉందని శివప్రకాష్‌రెడ్డి (వైఎస్ వివేకా బావమరిది) ఎందుకు చెప్పలేదు?
- శివప్రకాష్‌రెడ్డి తనకు ఫోన్ చేసి గుండెపోటుతో బావ చనిపోయారని చెప్పినట్లు ఆదినారాయణరెడ్డి గతంలో వెల్లడించారు.
- వివేకా మరణాన్ని మొత్తం బ్రేక్ చేసింది ఆంధ్రజ్యోతి పత్రికే. రెండో వివాహం వల్ల కూడా హత్యకు అవకాశాలు ఎందుకు ఉండకూడదన్న అనుమానాలను వ్యక్తం చేస్తూ ఆ పత్రిక కథనాన్ని రాసింది. ఆ కేసులో చంద్రబాబు ఎక్కడ ఇరుక్కుంటారోనని ఆంధ్రజ్యోతి అలా రాసింది. కుటుంబ సభ్యులంతా కలసి వివేకా చెక్ పవర్ తీసేశారని కూడా అందులో పేర్కొంది.

3న కాఫీ గింజల బహిరంగ వేలం

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): విశాఖ చింతపల్లి ట్రైబల్ కాఫీ ప్రొడ్యూసర్స్ మ్యాక్స్ ఆధ్వర్యంలో కాఫీ గింజల బహిరంగ వేలాన్ని మార్చి 3న నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పాడేరులోని కలెక్టరేట్ ఆవరణలో జరిగే వేలంలో ఆసక్తి గలవారు ఎంట్రీ ఫీజు రూ.5,000 చెల్లించి పాల్గొనవచ్చన్నారు. చింతపల్లి మ్యాక్స్ ఆధ్వర్యంలో 135.25మెట్రిక్ టన్నుల కాఫీ పార్చ్‌మెంట్ గింజలు, 17.60 మెట్రిక్ టన్నుల కాఫీ ఫ్లోట్ చెర్రీ గింజలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వివరాలకు 7569118491, 9440803572 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీడీపీ నేత పట్టాభి కస్టడీ పిటిషన్ రిటర్న్

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరంలో సీఐ పి.కనకరావును కులం పేరుతో దూషించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడిన కేసులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ నేత పట్టాభిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు వేసిన పిటిషన్‌ను స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శుక్రవారం రిటర్న్ చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మరిన్ని వివరాలు సేకరించేందుకు పట్టాభిని ఐదురోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు గురువారం కోర్టులో పిటిషన్ వేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో కస్టడీ అంశం తమ పరిధిలో లేదని పేర్కొంటూ జడ్జి శిరీష పిటిషన్‌ను రిటర్న్ చేశారు. విజయవాడలోని అట్రాసిటీ కేసుల ప్రత్యేక కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేయాలని పోలీసులకు సూచించారు. గొన్నూరు సీమయ్య చేసిన ఫిర్యాదుపై నమోదైన ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసులో నిందితుడైన పట్టాభిని కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు వేసిన పీటీ వారెంట్‌పై కోర్టు నిర్ణయం వెలువరించాల్సి ఉంది.

గృహ సారథులను ఎదుర్కొనేందుకే..

- సాధికార సారథులను తీసుకొస్తున్నాం : చంద్రబాబు
- మేం వచ్చాక పోలీసుల మక్కెలిరగతీస్తే ఎవరికి చెప్పుకుంటారు?

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/గన్నవరం: వైఎస్సార్‌సీపీ తీసుకొచ్చిన గృహ సారథుల వ్యవస్థను ఎదుర్కొనేందుకే కుటుంబ సాధికార సారథుల పేరిట తాము కొత్త వ్యవస్థను తెచ్చామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన గన్నవరంలో పర్యటించారు. ఏలూరు శివారు చొదిమెళ్లలో టీడీపీ జోన్ 2 సమీక్ష సమావేశానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. కుటుంబ సాధికార సారథి ఓట్ల విషయంలో సీరియస్‌గా ఉంటూ ఒక్క దొంగ ఓటు కూడా పడనివ్వకూడదన్నారు. వలంటీర్లకు తాను వ్యతిరేకం కాదని, ప్రజల పన్నులను జీతాలుగా తీసుకుంటున్నవారు వైఎస్సార్‌సీపీ కోసం పనిచేయకూడదన్నారు. ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్నారు. మళ్లీ గెలిస్తేనే అసెంబ్లీకి వస్తానని సవాల్ చేశానని, ఈ విషయాన్ని కార్యకర్తలు గుర్తుంచుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు మళ్లీ న్యాయం చేస్తామన్నారు. మూడేళ్లలో జగన్ కట్టింది ఐదే ఇళ్లని, టిడ్కో ఇళ్లు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. 'కావాలంటే లగ్నం పెడతాం.. పోలీసులను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్ని వేల మంది వస్తారో రండి.. మేం కూడా వస్తాం' అంటూ గన్నవరం పర్యటనలో చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కార్యాలయాన్ని, కార్లు, బైక్‌లను పరిశీలించాక మీడియాతో మాట్లాడారు. పోలీసులు పనికిమాలిన వేషాలు వేస్తున్నారంటూ దూషణలకు దిగారు. మీకు కూడా శిక్ష పడుతుందంటూ హెచ్చరించారు. క్రిస్టియన్ సీఐతో తమ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించడం, దానిని ఎస్పీ సమర్థిస్తూ ప్రెస్ స్టేట్‌మెంట్ ఇవ్వడం సరికాదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గన్నవరం ఘటనపై ఒక ఎంక్వయిరీ కమిటీని వేసి పోలీసుల మక్కెలు ఇరగతీస్తే ఎవరికి చెప్పుకుంటారని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ పశువుల డాక్టర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించిన వారినే కొట్టించారని వ్యాఖ్యానించారు. మా టైం వచ్చినప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు.

అడవిలోనా.. బీచ్‌లోనా?

- చంద్రబాబుకు కొడాలి నాని సవాల్
- నల్లమల లేదంటే బందర్ వెళ్దాం
- తేల్చుకుందాం.. వచ్చెయ్
- ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుంది



సాక్షి, అమరావతి: 'ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్.. నీ ప్రతిపక్ష హోదాతోపాటు జడ్ కేటగిరీ సెక్యూరిటీ కూడా వదులుకో.. నేనూ, వంశీ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తాం. నల్లమల అడవికో, బందరు బీచ్‌కో వెళ్లి కొట్టుకుందాం..' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు మాజీ మంత్రి కొడాలి నాని (శ్రీవెంకటేశ్వరరావు) ప్రతి సవాల్ విసిరారు. 'మన పోరాటంలో మేం చచ్చిపోతే నిన్ను జైల్లో పెడతారు.. నువ్వు చస్తే మమ్మల్ని జైల్లో వేస్తారు. ఈ రాష్ట్రానికి పట్టిన నీ దరిద్రం పోతుంది' అని చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కొడాలి నాని మీడియాతో మాట్లాడారు.


- రెండు గ్లాసులు, ఒక కంప్యూటర్ పగిలిన కార్యక్రమాన్ని చూసేందుకు గన్నవరం వెళ్లిన చంద్రబాబు పిచ్చి పట్టినట్లుగా సీఎం జగన్‌ను నోటికొచ్చినట్లు దూషిస్తున్నారు. ఆయన అరుపులు విని పిచ్చాసుపత్రి నుంచి తప్పించుకుని వచ్చారని గన్నవరం ప్రజలంతా భయభ్రాంతులకు గురయ్యారు. చంద్రబాబును పిచ్చాసుపత్రిలో చేర్చాలి. లేదంటే రామ్మూర్తినాయుడిని కట్టేసినట్లుగా చంద్రబాబును కుటుంబ సభ్యులే బంధించాలి.
- బ్రెయిన్‌లెస్ కిడ్ లోకేశ్.. పిల్లోడు, రాజకీయాలు తెలియనోడు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నాడని జనం అనుకుంటారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకునే చంద్రబాబు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారంటే లోకేశ్ ఆయన్ను కొరికి ఉంటారేమోననే అనుమానం కలుగుతోంది. దీర్ఘాలు తీస్తూ సినిమా డైలాగులు చెబుతున్న చంద్రబాబు ఖాళీగా ఉండలేక అఖండ, వీరసింహారెడ్డి సినిమాలు ఏమైనా చూశారా? ఆయన పిచ్చి మాటలు నమ్మి కేసుల్లో ఇరుక్కుని చివరకు జైలు పాలవుతున్నారు.
- ఎమ్మెల్యే వంశీని పశువుల డాక్టర్ అని ఎద్దేవా చేస్తున్న చంద్రబాబు మూగ జీవాల పాల ఉత్పత్తులతో వ్యాపారం చేసి కోట్లు కూడబెడుతుండటం నిజం కాదా? ఆయన దిక్కుమాలిన రాజకీయం నాకు, వంశీకి చాలా బాగా తెలుసు. మాతో పెట్టుకోవద్దు. పట్టాభిని గన్నవరం పంపిందే చంద్రబాబు. అక్కడ ఏ పార్టీ వారికీ గాయాలు కాలేదు. ఘర్షణ కట్టడి చేయడానికి వెళ్లిన పోలీసులకు మాత్రమే గాయాలయ్యాయి. టీడీపీ మూకల దాడిలో సీఐ తల పగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే చంద్రబాబు పోలీసుల తాట తీస్తానంటూ బెదిరిస్తున్నారు. సీఐ, డీజీపీ క్రిస్టియన్ అంటూ మతాల పేరిట రెచ్చగొట్టే యత్నాలను ప్రజలు గమనించాలి.

అందుకు టెలిఫోన్ ఆపరేటర్ చాలు..

గూగుల్ టేకవుట్ ఏమిటి? ఒక లొకేషన్ నుంచి ఎంతమంది ఫోన్లలో మాట్లాడారో చెప్పేందుకు సీబీఐ ఎందుకు? ఒక టెలిఫోన్ ఆపరేటర్‌కు అప్పగిస్తే ఎప్పుడో తేల్చేసే వారు. ఎవరి ఫోన్ ఎవరికి వెళ్లిందో చెప్పేదాన్ని సీబీఐ ఎంక్వైరీ అనరు. దాన్ని టీవోఐ (టెలిఫోన్ ఆపరేటర్ ఎంక్వైరీ) అని నేను భావిస్తున్నా.

ఎల్లో మీడియాది అసత్య ప్రచారం

- 2019 మార్చి 14న నేను, సునీల్ యాదవ్ కలిసే ఉన్నాం
- వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంట్లో సునీల్ యాదవ్ ఉన్నారన్నది అవాస్తవం
- సీబీఐ అధికారులు ఎవరికోసమో తప్పు చేస్తున్నారు
- అసలు తప్పు చేసిన వారిని వదిలేస్తున్నారు
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తే నిజాలు బయటకు వస్తాయి
- మీడియాతో భరత్ యాదవ్



పులివెందుల రూరల్ : 2019 మార్చి 14వ తేదీ రాత్రి సునీల్ యాదవ్ వైఎస్ భాస్కర్‌రెడ్డి ఇంట్లో ఉన్నాడండూ ఎల్లో మీడియా చేస్తున్నది అసత్య ప్రచారమని వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ విచారించిన స్థానిక విలేకరి భరత్ యాదవ్ చెప్పారు. ఆ రోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు తాను, సునీల్ యాదవ్ పులివెందులలో కడప రోడ్డు సమీపంలోని నందిక ఆసుపత్రి దగ్గర ఉన్నామని స్పష్టంచేశారు. తనను సీబీఐ అధికారులు విచారించిన సందర్భంలో ఈ విషయాన్ని వారికి స్పష్టంగా చెప్పానని తెలిపారు. సీబీఐ అధికారులు వైఎస్ వివేకా హత్య కేసులో ఎందుకు ఇంతలా అవాస్తవాలు వెలుగులోకి తెస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడుగా ఉన్న సునీల్ యాదవ్ తనకు బంధువని చెప్పారు. ఆయన వివాహాన్ని బంధువుల అమ్మాయితో తానే జరిపించానన్నారు. చిన్న స్థలం పంచాయితీ విషయంలో సునీల్ యాదవ్ వివేకానందరెడ్డి దగ్గర ఉండటంవల్ల తాను కూడా ఆయనకు దగ్గరయ్యానన్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ అధికారులు తననూ విచారించారని, వారు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పానని అన్నారు. సీఐ ర్యాంకు అధికారిణి ఆ విషయాలను అన్ని కోణాల్లో పరిశీలించి నిర్ధారించారన్నారు. వాస్తవాలు దాచి సీబీఐ అధికారులు ఎవరి కోసమో ఏదో తప్పు చేస్తున్నారని అన్నారు. అసలు తప్పు చేసిన వారిని వదిలేస్తున్నారని చెప్పారు. ఒకే కోణంలో కాకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. తాను పేర్లతో సహా సీబీఐ డైరెక్టర్లకు లేఖ రాశానని, అందులో నిజాలు లేవా అని ప్రశ్నించారు. వారికి అవసరం వచ్చినప్పుడు తన దగ్గర నుంచి సమాధానాలు తీసుకుని కేసును ముందుకు తీసుకెళుతున్నారని, తనను మాత్రం మైనస్ చేసి చూపిస్తున్నారన్నారు. తాను ఎవరికీ అమ్ముడుపోలేదని, తనను ఎవరూ పోషించలేదని చెప్పారు. సీబీఐపై ప్రజలకు గౌరవం ఉందని, దానిని వారు కాపాడుకోవాలన్నారు.

దేశ కాల పాత్రలను చూసి, తిరిగి ఉపకారం చేయనివారికి కూడా దానం చేయడం కర్తవ్యం అనే భావంతో చేసేది సాత్త్విక దానం.
– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, ఫిబ్రవరి, 25

'మేడిన్ ఇండియా' బంగా!

భారత్ మూలాలున్నవారు ప్రపంచ యవనికపై తళుక్కున మెరవటం 'అలవాటైపోయిన' వర్తమానంలో కూడా ప్రపంచ బ్యాంకు అధ్యక్ష పదవికి ఇక్కడే పుట్టి పెరిగి పెద్ద చదువులు చదివిన అజయ్ బంగాను అమెరికా ప్రతిపాదించిందంటే అందరూ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ భారతీయ మూలాలున్నవారే. కుదిరితే రిపబ్లికన్ పార్టీ తరఫున దేశాధ్యక్ష స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న వివేక్ రామస్వామి సైతం ఇక్కడివారే. ఇక కోకా కోలా మొదలు అనేకానేక బహుళజాతి సంస్థలకు చాన్నాళ్లనుంచి భారతీయ సంతతికి చెందినవారు సారథ్యం వహించారు, వహిస్తున్నారు. మునుపటంత కాకపోయినా ఇప్పటికీ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులనూ, వాటి తలరాతలనూ నిర్దేశించటంలో ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వర్ధమాన దేశానికి చెందిన ఒక వ్యక్తి అలాంటి సంస్థలకు నేతృత్వం వహించటమంటే సాధారణం కాదు. ఆ రెండు సంస్థలూ ఆవిర్భవించిన నాటినుంచీ వాటిపై వస్తున్న ప్రధాన విమర్శ– ఎప్పుడూ సంపన్న దేశాల నుంచీ, ప్రధానంగా అమెరికా నుంచీ మాత్రమే వాటి సారథులను ఎన్నుకుంటున్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం తీవ్రంగా దెబ్బతిన్న అంత ర్జాతీయ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దటం కోసం బ్రెటెన్‌వుడ్స్ సదస్సు జరగ్గా, అందులో కుదిరిన ఒప్పందం పర్యవసానంగా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్‌లు ఉనికిలోకొచ్చాయి. ప్రపంచ బ్యాంకుకు ఆది నుంచీ అమెరికా పౌరులే అధ్యక్షులు. అలాగే ఐఎంఎఫ్ ఉపాధ్యక్ష పదవి కూడా ఆ దేశానిదే. ఐఎంఎఫ్ అధ్యక్ష పదవి మాత్రం యూరోపియన్ దేశాలకు చెందినవారిది. నిజానికి ఇప్పుడు అమెరికా ఎంపిక చేసిన బంగా ఇక్కడివారే అయినా, ప్రస్తుతం పూర్తి స్థాయి అమెరికా పౌరుడు. సుపరిపాలన... సంప్రదింపులు... పాలుపంచుకోవటం అనేవి ప్రపంచబ్యాంకు మూల సూత్రాలు. కానీ ఆ మూడింటిని రుణం కోసం వచ్చే వర్ధమాన దేశాధినేతలకు ప్రవచించటం తప్ప సంస్థ పాటించదన్న విమర్శ చాన్నాళ్లుగా ఉంది. అందులో 189 సభ్యదేశాలుంటాయి. సంపన్న దేశాలైన అమెరికా, యూరోప్ దేశాల పెట్టుబడులు అధికం గనుక, బ్యాంకులోని ప్రధాన భాగస్వామ్య ఆర్థిక సంస్థలన్నీ ఆ దేశాలకు సంబంధించినవే గనుక బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు ఆ దేశాలకే సొంతం. అయితే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్న డిమాండ్ మొదటినుంచీ ఉంది. గతంలో అమెరికా నిర్ణయించినవారిలో కొందరికి ఆర్థికరంగ నేపథ్యమే లేదన్న విమర్శలు కూడా వచ్చాయి.

పర్యావరణ పరిరక్షణ ఎజెండాలోకొచ్చిన వర్తమానంలో ప్రపంచ బ్యాంకు దానిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలనీ, రుణాలిచ్చే క్రమంలో అదొక షరతుగా ఉండాలనీ కొన్నేళ్లుగా ఉద్యమ కారులు కోరుతున్నారు. ఇంకా ఏడాది పదవీకాలం ఉండగానే రాబోయే జూన్‌లో పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్న డేవిడ్ మల్‌పాస్ అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నామినీ. పర్యావరణంతో సహా ప్రపంచాన్ని వేధిస్తున్న కీలక అంశాల విషయంలో ట్రంప్ అభిప్రాయాలే ఆయనవి కూడా. నిరుడు సెప్టెంబర్‌లో ఒక సదస్సు సందర్భంగా శిలాజ ఇంధనాలవల్ల భూగోళానికి జరిగే ప్రమాదంపై ప్రశ్నించినప్పుడు 'నేను శాస్త్రవేత్తను కాదు' అని జవాబిచ్చి అందరి ఆగ్రహానికీ గురయ్యారు. నిజానికి అంతక్రితమే ప్రపంచ బ్యాంకుపై ఆర్థికరంగ నిపుణులకు ఆశలు పోయాయి. పేరులో తప్ప నిజంగా ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించే, దాన్ని నడిపించే లక్షణాలు బ్యాంకుకు సన్నగిల్లాయని వారి అభిప్రాయం. దాని నిబంధనలు, అదిచ్చే రుణాలకుండే షరతులు కఠినమైనవి. రుణ మంజూరులో అలవిమాలిన జాప్యం. ఇప్పుడు ధైర్యంగా సత్వర నిర్ణయాలు తీసుకునే కెనడాకు చెందిన సీడీపీక్యూ, ఎన్‌డీబీ(గతంలో బ్రిక్స్ బ్యాంక్), ఎన్ఐఐఎఫ్, అమెరికాకు చెందిన ఐడీఎఫ్‌సీ వంటివి రంగంలోకొచ్చాయి. అయితే ఫలానా ప్రాజెక్టుకు లేదా సంస్థకూ ప్రపంచ బ్యాంకు అప్పిచ్చిం దంటే అది భారీ ప్రాజెక్టు, అన్నివిధాలా మేలైందని అభిప్రాయపడేవారు చాలామందే ఉంటారు.

అయితే బంగాయే స్వయంగా చెప్పుకున్నట్టు ఆయన నూరుశాతం 'మేడిన్ ఇండియా'వాడు. ప్రపంచ మార్కెట్లను శాసించే అమెరికాకు చెందిన 'వాల్ స్ట్రీట్'నుంచి నేరుగా వస్తున్నవాడు. ఈసారి మహిళను ప్రోత్సహించదల్చుకున్నామని ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ల బోర్డు ప్రకటించిన కొన్ని గంటలకే బంగా ఎంపికను ప్రకటించటం అందరినీ ఒకింత ఆశ్చర్యపోయేలా చేసింది. అయితే అందుకు కారణం ఉంది. బ్యాంకు పేదరిక నిర్మూలన లక్ష్యం నుంచి పర్యావరణ పరిరక్షణ వైపు పోవటం బ్యాంకులోని వర్ధమాన దేశాలకు నచ్చటం లేదు. ఇందువల్ల తమ అభివృద్ధి ప్రాజెక్టులు ఇబ్బందుల్లో పడతాయన్నది వాటి అభిప్రాయం. భారత్‌కు చెందిన బంగా ఈ విషయంలో అందరినీ ఒప్పిస్తారనీ, ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడుల సమీకరణలో విజయం సాధిస్తారనీ అమెరికా విశ్వసిస్తోంది. భారత్ మార్కెట్ ఆవిర్భవించి విస్తరిస్తున్న తొలి దశలో దాన్ని చాలా దగ్గరగా చూసిన అనుభవం బంగాకు ఉన్నదని ఆ దేశం భావన. దాదాపు దశాబ్దకాలం నుంచి మాస్టర్‌కార్డ్ సారథిగా ఆ సంస్థ విస్తరణలో, దాని రెవెన్యూ పెంపులో బంగా పాత్ర ప్రధానమైనది. అదీగాక 2021లో గ్లాస్గోలో జరిగిన కాప్–26 సదస్సు సందర్భంగా కర్బన ఉద్గారాల తగ్గింపునకు కృషి చేయాలంటూ ప్రపంచ దేశాలనుద్దేశించి బహిరంగ లేఖ రాసిన డజను మంది సీఈఓల్లో ఆయనొకరు. ఇక పర్యావరణ పరిరక్షణపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించదల్చుకున్న ప్రపంచ బ్యాంకుకు బంగాను మించిన అర్హుడు మరొకరుండరని అమెరికా భావించటంలో ఆశ్చర్యమేముంది?

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.షష్ఠి తె.5.02 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి సప్తమి, **నక్షత్రం:** అశ్వని ఉ.8.08 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.5.48 నుండి 7.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.25 నుండి 7.58 వరకు, **అమృతఘడియలు:** రా.3.31 నుండి 5.06 వరకు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : మ.1.30 నుండి 3.00 వరకు

దేశ 'కనెక్టింగ్ ఫ్యాక్టర్' హిందుత్వం

పేరు ప్రఖ్యాతులు కావాలని ఆరెస్సెస్ పాటుపడదనీ, సమాజాన్ని సాధికారత దిశగా నడిపించడానికి కావాల్సిన శక్తియుక్తులను అందించడానికి వీలుగా వ్యక్తులను కలిపి పనిచేయించడమే ఆరెస్సెస్ లక్ష్యమనీ ఆ సంస్థ ప్రచార్ ప్రముఖ్ (మీడియా రిలేషన్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) సునీల్ అంబేకర్ అన్నారు. ఆయన ఇంగ్లీషులో రాసిన 'ద ఆరెస్సెస్: రోడ్‌మ్యాప్స్ ఫర్ ద 21 సెంచరీ' పుస్తకానికి తెలుగు అనువాదం 'ఆరెస్సెస్ ప్రణాళిక 21వ శతాబ్దం కోసం' ఆవిష్కరణకు ఇటీవల విజయవాడ వచ్చిన సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇవీ:

ఇంటర్వ్యూ



సునీల్ అంబేకర్

ఈ పుస్తకం రాయాలన్న ఆలోచన ఎందుకొచ్చింది?

ఈ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలని దేశంలో చాలామంది ఆకాంక్ష. యువతలో అది ఇంకా బలీయంగా ఉంది. నేను విశ్వవిద్యాలయాలు, ప్రముఖ విద్యాసంస్థలను సందర్శిస్తున్న సమయంలో దేశాభివృద్ధి గురించి యువత ప్రశ్నించేది. కాలక్రమంలో ప్రశ్న అడిగే తీరులో మార్పును గమనించాను. దేశ ప్రగతికి సంబంధించి యువత నుంచి ప్రతికూల ప్రశ్నలు కాకుండా సానుకూల ప్రశ్నలు రావడం మొదలైంది. దేశాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు ఎలా తీసుకెళ్లాలి? అని విభిన్న కోణాల నుంచి వస్తున్న ప్రశ్నలకు జవాబులు చెప్పేవాడిని. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో సమాజంలో అందరి భాగస్వామ్యం ఉండాలి. ఈ యజ్ఞంలో భాగమైన సంఘ కార్యంలో(ఆరెస్సెస్ కార్యక్రమాల్లో) అందరికీ భాగస్వామ్యం ఉండాలని ఆరెస్సెస్ భావిస్తోంది. ఆరెస్సెస్‌ను మరింత బాగా అర్థం చేసుకోవడానికీ, సంఘ పరిచయం లేని వ్యక్తులు కూడా ఆరెస్సెస్ తీరును అవగతం చేసుకోవడానికీ పుస్తకం రాయాలన్న ప్రతిపాదన నా వద్దకు వచ్చింది. దానికి అంగీకరించాను.

ఈ పుస్తకంలో ప్రధానంగా చర్చించిన అంశాలు ఏమిటి?

1. దేశం అభివృద్ధి చెందాలని సామాన్యులు కూడా బలంగా ఆకాంక్షిస్తున్నారు. బాధ్యత తీసుకోవడానికి వారు సిద్ధంగా ఉన్నారు. సంఘం(ఆరెస్సెస్) విస్తరణకు సామాన్యుల త్యాగాలు, వారి విజయ గాథలే మూలాధారం. ఈ విషయాన్ని ప్రధానంగా చెప్ప దలుచుకున్నాను. సంఘ కార్యంలో అందరి భాగస్వామ్యాన్ని అభిలషిస్తున్నాం. 2. ఈ దేశ సంస్కృతి, వారసత్వం, హిందుత్వం... మనం గర్వించాల్సిన అంశాలే తప్ప, న్యూనత చెందాల్సిన అంశాలు కాదు. సర్వమానవ హితానికి అవి అత్యంత రమణీయమైన అంశాలు. అయితే ఈ విషయాల పట్ల కొంత మందికి అనుమానాలు, అపోహలు ఉన్నాయి. వాటిని దూరం చెయ్యాలి. 3. ప్రజలంతా దేశాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. వర్తమానంలో దేశానికి ఉన్న శక్తి ఆధారంగా భవిష్యత్‌ను నిర్మించుకోవాలి. 4. హిందుత్వం అంటే అందరినీ కలిపేది. అందరి బాగు కోరుకోవడమే హిందుత్వం. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను కలిపి ఉంచే 'కనెక్టింగ్ ఫ్యాక్టర్' హిందుత్వం. ఇది అందరూ అర్థం చేసుకోవాలి. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలు, సవాళ్లకు సమాధానం బయటి నుంచి లభించదు. మనకు మనమే పరిష్కారాలను అన్వేషించాలి. స్వాతంత్ర్య పోరాటం కూడా కేవలం ఆంగ్లేయులను వెళ్లగొట్టడం కోసమే కాకుండా, స్వపాలన, స్వదేశీ, స్వభాష... ఇలా 'స్వ'(సొంత) సాధన లక్ష్యంగా సాగింది. ఇప్పుడు కూడా 'స్వ' ఆధారంగా మన ప్రణాళికలు ఉండాలి. ప్రతి నిర్ణయం స్వావలంబన సాధించే దిశగా ఉండాలి. సమాజంలోని ప్రతి ఒక్కరిని అందులో భాగస్వాములను చేయాలి. సంఘం (ఆరెస్సెస్) చెప్పేది ఇదే.



ఈ పుస్తకం ఎవరిని ఉద్దేశించి రాశారు? స్వయం సేవకులకా, స్వయం సేవకులు కావాలనుకుంటున్న వారికా? అందరికీనా?

అందరికీ ఉద్దేశించింది. ఆరెస్సెస్‌ను అర్థం చేసుకోవాలనుకొనే వారికి ఉపయుక్తం. స్వయం సేవక్‌లే కాదు, అందరూ చదవాలి. పుస్తకం చదివిన తర్వాత ఎలాంటి ఫీల్ కలిగినా ఫర్వాలేదు. ఆరెస్సెస్‌ను వ్యతిరేకించేవారైనా పుస్తకం చదవాలి.

2025 నాటికి ఆరెస్సెస్ ఏర్పాటై వందేళ్లు పూర్తవుతుంది. ఇప్పటికీ ఆరెస్సెస్ పనితీరు, అంతర్గత వ్యవహారాల గురించి ప్రజలకు పెద్దగా తెలియదు. వందేళ్ల తర్వాత అయినా ఆరెస్సెస్ అంతర్గత వ్యవహారాలు సామాన్యులకు తెలిసేలా పారదర్శకంగా పనిచేస్తుందా?

ఆరెస్సెస్ ఏర్పాటయిన తొలి రోజు నుంచి తెరిచిన పుస్తకమే. సంఘం యాజమాన్య హక్కులు ఎవరి(వ్యక్తుల) సొంతం కాదు. ఆరెస్సెస్ యాజమాన్యం ప్రజలదే. ప్రజల భాషలో చెప్పాలంటే పబ్లిక్ కంపెనీ. భారతమాత కోసం పనిచేస్తున్నామనే భావనతో ప్రతి స్వయం సేవక్ పనిచేస్తారు. సమాజాన్ని సాధికారత దిశగా నడిపించడమే 'సంఘ' లక్ష్యం. ఆరెస్సెస్‌ను బలోపేతం చేయడం కాదు... సమాజాన్ని, దేశాన్ని సాధికారత దిశగా నడిపించడమే లక్ష్యంగా ఆరెస్సెస్ పనిచేస్తుంది. అందుకే ఎవరైనా ఆరెస్సెస్‌లో పనిచేయడానికి 'ఫిట్' అవుతారు. మంచి కోసం ప్రజలతో కలిసి పనిచేస్తాడు స్వయం సేవక్. సమాజానికి ఉపయోగపడే ఏ పని చేద్దామన్న ఆసక్తి ఉన్నా, ఏ రంగంలో చేయాలనుకున్నా ఆరెస్సెస్ తోడుగా నిలుస్తుంది. ఆరెస్సెస్ ప్రయాణం తెరిచిన పుస్తకమే... అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ!

ఇక మీద ఆరెస్సెస్ విస్తరణ మీద దృష్టి పెడతారా? సిద్ధాంతాన్ని బలోపేతం చేయడం మీద దృష్టి పెడతారా?

పేరు, ప్రఖ్యాతుల కోసం 'ఆరెస్సెస్' పని చేయడం లేదు. సిద్ధాంతం ఆధారంగా పనిచేసుకుంటూ ముందడుగు వేస్తుంటుంది. వ్యక్తులు, వ్యవస్థలను 'నెట్‌వర్కింగ్' చేయడమే సంఘం పని. సామాన్యులను సాధికారత దిశగా నడిపించడానికి నెట్‌వర్కింగ్ చేస్తుంది. మరింత ఎక్కువ మందిని కలిపి పనిచేయించడం ద్వారా సాధికారత సాధించడమే తప్ప... అది ఆరెస్సెస్ విస్తరణ కాదు. రెండో అంశం, సిద్ధాంతం గురించి అడిగారు... ఆరెస్సెస్ సిద్ధాంతం చాలా సింపుల్. అందరూ గర్వపడే విధంగా దేశాన్ని తయారు చేయడం, హిందుత్వాన్ని చూసి గర్వపడటం, ప్రపంచ మానవాళి సంక్షేమాన్ని కోరుకోవడం... ఇది కేవలం ఆరెస్సెస్ లైన్ మాత్రమే కాదు... వేల సంవత్సరాలుగా ఈ దేశ అంతరాత్మ ఇదే. దేశానికి సేవ సేయడమే ఆరెస్సెస్ సిద్ధాంతం.

యాంటీ–నేషనల్స్ అని పదాన్ని ఆరెస్సెస్ ఈ మధ్య ఎక్కువగా ఉపయోగిస్తోంది. మీ దృష్టిలో దీని నిర్వచనం ఏమిటి? స్వయం సేవక్‌లు నడిపే ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారు 'యాంటీ–నేషనల్స్' అనా?

ఎంతమాత్రం కాదు. ప్రభుత్వాలను విమర్శించడం, వ్యతిరేకించడం ప్రజాస్వామ్యంలో భాగం. పార్లమెంట్‌లోనే విమర్శిస్తున్నారు కదా! వారిని యాంటీ–నేషనల్స్ అని ఎవరూ అనడం లేదు. ఆ పదంలోనే దాని అర్థం ఉంది, దేశానికి వ్యతిరేకం అని. దేశ హితాన్ని కాంక్షించని వారంతా యాంటీ–నేషనల్స్. ఇది ఆరెస్సెస్ సృష్టించిన పదం కాదు.

చరిత్రను చూసే దృష్టికోణం మారాలంటున్నారు కదా! ఎందుకు మారాలి?

దేశాన్ని చాలా శతాబ్దాల పాటు విదేశీయులు పాలించారు. వారి ఆలోచనలకు అనుగుణంగా చరిత్ర తయారయింది. వారి ప్రయోజనాల పరిరక్షణకు వీలుగా చరిత్రను రూపొందించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, మహాపురుషులు, రుషులు, సమర్థ పాలకుల చరిత్ర మరుగున పడిపోయింది. మన వారసత్వాన్ని గర్వంగా చెప్పుకొనే పరిస్థితి లేకుండా చేశారు. ఒక కుటుంబ చరిత్ర, ఒక వంశ పాలన చరిత్ర కాదు. ఈ దేశ నిర్మాణంలో గ్రామీణులు, కొండకోనల్లో నివసించేవారు, పేదలు, ధనికులు, పాలకులు... అందరి పాత్రా ఉంది. దాన్ని విస్మరించారు. ఆర్యులు వెలుపలి నుంచి వచ్చారనే సిద్ధాంతం తప్పని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడా చెప్పారు. విదేశీ దృష్టి కోణం మారాలి. మన దేశం దృష్టి కోణం నుంచి చరిత్రను చూడాలి. సరికొత్త కోణంలో చరిత్రను ఆవిష్కరించి ప్రజల ముందు ఉంచాలి.

– ఎం. విశ్వనాథ రెడ్డి
సాక్షి ప్రధాన ప్రతినిధి, అమరావతి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎనిమిది గంటల ఫార్ములా



మీ జీవితాన్ని చక్కగా సమన్వయం చేసుకోవడానికి రోజును 8+8+8 గంటలుగా విభజించుకోండి. 8 గంటలు నిజాయితీగా శ్రమించడం కోసం, 8 గంటలు మంచి నిద్ర కోసం. మరో 8 గంటల్ని మూడు రకాలుగా విభజించుకోవాలి. కుటుంబం, స్నేహితులు; ఆరోగ్యం, హాబీ; సేవ, విశ్వాసం.

– ఐప్ సింఘాల్, ఐపీఎస్ అధికారి

గౌరవంగా పంపడానికి...



నేను చెవులకు రింగులు ఎందుకు ధరిస్తానంటే– నిజం చెప్పాలంటే, నేనొక కొత్త ప్రదేశంలో చనిపోయినప్పుడు ఇవి సరిగ్గా ఒక శవపేటికను కొనడానికి సరిపోతాయి. అందుకోసమే నావికులు ధరించేవాళ్లు, నేనూ అందుకే ధరిస్తున్నాను.

– మోర్గాన్ ఫ్రీమాన్, హాలీవుడ్ నటుడు

ఈ పిల్లలున్నారే...



రైల్లో ఓ చిన్న పిల్లాడు నాతో: 'నా పేరేంటో చెప్పనా?' నేను: 'చెప్పు'. పిల్లాడు: 'ఆర్చిబోకే మలీ'. వాళ్లమ్మ: 'కమల్!' పిల్లాడు: 'ష్‌ష్!'

– మిరండా కీలింగ్, లండన్ రచయిత్రి

వద్దంటే వద్దు



మా భారతీయ సిక్కులకు ఖాలిస్తాన్ అక్కర్లేదు. ఏ విదేశీయుడూ తన కోరికలను మా మీద బలవంతంగా రుద్దకూడదు. ఏ విదేశీయుడూ మమ్మల్ని అపఖ్యాతి పాలు చేయకూడదు. ఖాలిస్తాన్‌కు మద్దతు ఇవ్వకూడదు.

– అమృతా భిండర్, కాలమిస్ట్

యథా ప్రజా...



ఇండియాలో జరిగిన ఒక గ్లోబల్ సర్వేకు జవాబిచ్చిన వారిలో 54 శాతం మంది రష్యా–ఉక్రెయిన్ ఘర్షణ ఆగిపోవాలని కోరుకున్నారు; ఒకవేళ అవసరమైతే ఉక్రెయిన్ తన భూభాగాన్ని రష్యాకు కోల్పోయినా సరే. ఆఖరికి రష్యాలో కూడా కేవలం 44 శాతం మంది మాత్రమే ఈ రకంగా స్పందించారు. నేను ఆశ్చర్యపోలేదు. అందుకే మన నాయకులు నిశ్శబ్దంగా లదాఖ్‌లోని ప్రాంతాన్ని చైనాకు అప్పగించారు.

– అజయ్ శుక్లా, కాలమిస్ట్

యుద్ధం హాబీనా?



నిజం చెప్పాలంటే, జనాలు తాము ఉక్రెయిన్ యుద్ధం మీద 'ఆసక్తి కోల్పోయాం' అని చెప్పడం విని విసిగిపోయాను; అదేదో హాబీ, కొత్త బొమ్మలాగా. అసౌకర్యంగా ఉన్నా సరే, ప్రత్యేకించి అసౌకర్యంగా ఉన్నప్పుడే ప్రపంచ పరిణామాలు, సమకాలీన సంఘటనల మీద శ్రద్ధ పెట్టనివారి పట్ల చరిత్ర దయగా ఉండదు.

– రిచర్డ్ ఎంజెల్, జర్నలిస్ట్

అదే పెద్దది



ఒక రెగ్యులర్ జాబ్ ఉండటంలోని లాభాలు: క్యాబిన్, ఠంచనుగా జీతం, కారు భత్యం, పని చేయడానికి ఒక టీమ్. ఫ్రీలాన్స్‌గా ఉండటంలోని లాభాలు: కొన్నిసార్లు, ఉన్నట్టుండి మధ్యలో అనిపిస్తుంది, నీకు ఇప్పుడు కాసేపు కునుకు తీయాలని అనిపిస్తే నిన్ను ఆపేవారు ఎవరూ లేరని!

– నయోమీ దత్తా, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

అరుదైన జబ్బులపై నిర్లక్ష్యమేల?

సమాజం ఎన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజారోగ్య రంగంలో పెను సవాళ్లు ఎదుర్కోక తప్పటం లేదు. ముఖ్యంగా వైద్య రంగంలో అభివృద్ధి సాధిస్తున్నా అంతు చిక్కని జబ్బులు, అరుదైన జబ్బులు తామరతంపరగా పెరిగిపోతూనే ఉన్నాయి. అరుదైన జబ్బులకు చాలా మటుకు జన్యుపరమైన అంశాలే కారణం. మిగతా జబ్బులకు దారితీస్తున్న కారణాలేమిటో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో కూడా ఇతమిత్థంగా అంతుపట్టడం లేదని అభివృద్ధి చెందిన దేశాలు కూడా వాపోతున్నాయి.



ఇటీవలి నివేదిక ప్రకారం, అరుదైన జబ్బులతో బాధపడే రోగులు కచ్చితమైన రోగ నిర్ధారణ పొందడానికి సగటున... అమెరికాలో 7.6 ఏళ్లు, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 5.6 ఏళ్లు పడుతోంది. ఇక మనలాంటి దేశాల్లో పరిస్థితి ఊహించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఇప్పటి వరకు గుర్తించిన అరుదైన వ్యాధుల సంఖ్య 7,000కు పైగానే ఉండవచ్చని అంచనా. ప్రతి ఏటా ఈ జాబితాకు మరో 200 కొత్త జబ్బులు జత కూడుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మంది అరుదైన, అంతు చిక్కని వ్యాధులతో క్షణమొక యుగంగా జీవిస్తున్నారు. భారత్‌లో 8 శాతం (9 కోట్ల మంది) జనాభా అరుదైన జబ్బులతో బాధపడుతుండొచ్చని అంచనా. ఈ వ్యాధుల్లో 70 శాతం బాల్యంలోనే ప్రారంభమవుతాయని నిపుణులు చెబుతున్నారు.

ఇటువంటి వ్యాధులు చాలా వరకు తీవ్రమైనవి, దీర్ఘ కాలికమైనవి కూడా. అంతేకాక ప్రాణాంతక పరిస్థితుల్లోకి రోగులను నెడుతూ ఉంటాయి. ప్రతి 1000 మందిలో ఒకరికి లేదా అంతకంటే తక్కువ సంఖ్యలో ప్రజలను పీడించే జీవితకాల వ్యాధి లేదా రుగ్మతను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అరుదైన వ్యాధిగా నిర్వచించింది.

మన దేశంలో ఈ వ్యాధులపై చైతన్యం చాలా తక్కువగా ఉందని వైద్య నిపుణులే వాపోతున్నారు. భారత ప్రభుత్వ ఆరోగ్య–కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2017లో ఈ వ్యాధులపై తొలి జాతీయ విధానాన్ని ప్రకటించింది. అయితే, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలు రావటంతో 2021 మార్చిలో సమగ్ర అరుదైన వ్యాధుల జాతీయ విధానానికి రూపకల్పన చేసింది.

సంఖ్యా పరంగా చూస్తే ఎక్కువ మందికి సోకే జబ్బులపైనే పరిశోధనలు జరుగుతున్నాయి. అక్కడొకరు ఇక్కడొకరు చొప్పున కొద్ది మందికి మాత్రమే పరిమితమైన అరుదైన జబ్బులపై ప్రైవేటు ఔషధ కంపెనీలు పరిశోధనలు చేయటం లేదు. పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చే పరిస్థితి ఉండదన్న భావనతోనే ఇలా జరుగుతోంది. ప్రభుత్వ రంగంలో పరిశోధనల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఈ నిరాదరణను తెలిపేందుకే అరుదైన జబ్బుల మందులను ఆర్ఫన్ డ్రగ్స్ (అనాథ ఔషధాలు) అంటారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఔషధ పరిశ్రమలో 400 వరకు అరుదైన జబ్బులకు వాడే ఔషధాలు ఉత్పత్తవుతూ, నూటికి నూరు శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని విశ్వసనీయ సమాచారం. ఈ జబ్బులకు వాడే ఔషధాలపై 7 ఏళ్ల పాటు ఎక్స్‌క్లూజివ్ హక్కులను ఇస్తూ అమెరికా ప్రభుత్వం పరిశోధనలను ప్రోత్సహిస్తుండటం విశేషం.

ఆశా వర్కర్ల ద్వారా ఐఓఆర్‌డీ సర్వే


డా॥ ముత్యాల రామయ్య

ఖమ్మం జిల్లా పండితాపురంలో పుట్టిన డా॥ ముత్యాల రామయ్య 50 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లి యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పరిమెంటల్ అండ్ క్లినికల్ ఫార్మకాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అరుదైన జబ్బులపై ఆసక్తితో 17 ఏళ్ల క్రితం 2005లో లాభాపేక్ష లేని సంస్థగా ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ (ఐఓఆర్‌డీ)ని మిత్రులతో కలసి నెలకొల్పి పరిశోధనలు చేస్తున్నారు. రోగులను గుర్తించటం కోసం ఆశా వర్కర్ల సాయంతో కామేపల్లి, తల్లాడ, ఖమ్మం రూరల్ మండలాల్లో ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. ఇప్పటికి 70 మంది అరుదైన రోగుల వివరాలు తెలిశాయన్నారు. ఈ సర్వే పూర్తి చేసుకొని మార్చిలో బెర్లిన్‌లో జరిగే అంతర్జాతీయ సమావేశంలో చర్చించాలని ఆయన ఆశిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరిలో అరుదైన వ్యాధులపై చైతన్య మాసోత్సవాలూ, ఫిబ్రవరి ఆఖరి రోజును అరుదైన వ్యాధుల దినోత్సవంగానూ జరుపుతున్నారు. ఈ నెల 26 ఆదివారం ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో తెలంగాణ ప్రభుత్వం, ఐఓఆర్‌డీ తదితర సంస్థలు కలసి సైకిల్ యాత్ర, పాదయాత్ర నిర్వహించనున్నాయి.

పరిశోధనలను ప్రోత్సహించడంతో పాటు.. సాధారణ ప్రజలకు, రోగులకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్యులకు అరుదైన జబ్బుల గురించి అవగాహన కల్పించడం ముఖ్యం. ముందస్తు, కచ్చితమైన రోగ నిర్ధారణ కోసం వైద్యులకు శిక్షణ ఇవ్వటం, రోగనిర్ధారణ పద్ధతులను ప్రామాణీకరించడం, కొత్త రోగనిర్ధారణ, చికిత్సా సాధనాలను తక్షణమే అభివృద్ధి చేయడం అవసరం. మన దేశంలో వైద్యం రాష్ట్ర సబ్జెక్ట్. కాబట్టి, రాష్ట్రాలు కేంద్రంతో కలసి అరుదైన జబ్బుల నివారణ, చికిత్స, పరిశోధనలపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ జబ్బుల పాలైన వారి పట్ల పాలకులు మరింత ఆదరణ చూపాలి.

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్ట్

మనసుకు పోషణ

ఇంటికి, ఒంటికి, ఇంకా మనసుకు కూడా చక్కని పోషణ అవసరం. పండుగలు, పర్వ దినాలు వచ్చినప్పుడు... ముందుగా చేసే పని ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసుకోవటం, ఇంటిని అందంగా అలంకరించుకోవటం. దుమ్ము, ధూళి, మురికి వంటివి అన్నీ పోయి ఇల్లు, పరిసరాలు బాగుపడటంతోనే సగం పండుగ కళ వచ్చేస్తుంది. ఇంట్లోని దైవ మందిరాన్ని శుభ్రం చేసుకుని పువ్వులతో, ధూప, దీపాలతో అలంకరిస్తే మందిరానికి నిండు కళ వచ్చేస్తుంది. అయితే పండుగలకో, అతిథులొస్తున్నారనో మాత్రం శుభ్రం చేసుకుంటే సరిపోతుందా? ఇంటిని ప్రతి నిత్యం శుభ్రం చేయవలసిందే! అప్పుడే ఇల్లు చూడముచ్చటగా ఉంటుంది. అదే ఇంటికి పోషణ అంటే! ఇల్లు శుచిగా ఉంటే మనసూ బాగుంటుంది.


జ్యోతిర్మయం

ఒంటికి అంటే శరీరానికి పోషణ అవసరం. మంచి ఆరోగ్యం కోసం... శరీరానికి శుభ్రత, మంచి పోషకాహారంతో పోషణ ఇవ్వాలి. దేహం స్వస్థతగా లేకపోతే ఏ పనీ చేయలేము. శరీరమే అన్ని పనులకూ, లక్ష్య సాధనకూ ఆధారం. దానిని జాగ్రత్తగా కాపాడుకోవలసిన బాధ్యత మనదే! శరీరాన్ని ఎంత బాగా చూసుకుంటే అంత బాగా పని చేయగలుగుతాము. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అన్నాడు మహాకవి కాళిదాసు.

మనసుకు కూడా పోషణ అవసరం. మనసు చెడు ఆలోచనలు చేయకుండా, చెడ్డ పనులకు ప్రేరేపించకుండా, మనిషి పతనం కాకుండా ఉండటానికి మనసుకు ఎప్పుడూ సత్సాంగత్యం, మంచి ఆలోచనలనే పోషణ ఇవ్వాలి. మనసు అటూ, ఇటూ పారిపోకుండా దైవ చింతన, సద్గ్రంథ పఠనం... అనే పోషణ నిరంతరం ఇవ్వాలి. నిర్మలమైన, నిస్వార్థమైన భక్తి మనసును దైవ సన్నిధికి చేరుస్తుంది. దైవ సంబంధ ఆలోచనలు మనిషిలో విశాల దృక్పథాన్ని పెంచుతాయి. మనసు ఆహ్లాదంగా ఉంటే శరీరమూ బాగుంటుంది. మానసిక అనారోగ్యం శరీరంపై ప్రభావం చూపుతుంది. అందుకే, మనసుకు పోషణ ఉండాలి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

నేడు శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల

తిరుమల: శ్రీవాణి టికెట్లకు సంబంధించిన మార్చి, ఏప్రిల్, మే నెలల ఆన్‌లైన్ కోటాను శనివారం మధ్యాహ్నం 12 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేయనుంది. ఆన్‌లైన్‌లో రోజుకు 500 టికెట్లు చొప్పున భక్తులకు అందుబాటులో ఉంటాయి. భక్తులు ఈ విషయాన్ని గమనించి శ్రీవాణి టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఎంతో మేలు

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్


వృద్ధుడితో మాట్లాడుతున్న జె.నివాస్

మద్దిపాడు: గ్రామానికే వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం వల్ల గర్భిణులు, వృద్ధులు, పేద రోగులకు భరోసా కలుగుతుందని తెలిపారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలచనకోటలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులు మాట్లాడుతూ గతంలో తామంతా ప్రతి నెల 9వ తేదీన ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నెలకు రెండుసార్లు గ్రామానికే డాక్టర్లు వచ్చి పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వడం సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. అనంతరం ఆయన ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి అక్కడ విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనం నాణ్యతను పరిశీలించారు. అక్కడి నుంచి మద్దిపాడు పీహెచ్‌సీకి వెళ్లి అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో 172 రకాల మందులు అందుబాటులో ఉంచాలని, 60 రకాల పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. ఉద్యోగులు అందరూ కచ్చితంగా ముఖ ఆధారిత హాజరు వేయాలని స్పష్టంచేశారు. డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మాధవీలత, డాక్టర్‌లు మానస, ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ఎప్పటికీ నమ్మరు

- 880వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారం కోసం చంద్రబాబు ఎల్లో మీడియాతో కలిసి అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూసినా.. ఆయనను ఎప్పటికీ నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 880వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని బాబు చేసిన దందాలు అంతా ఇంతా కాదని, అటు రైతులను, ఇటు 29 గ్రామాల ప్రజలను రోడ్ల పాలు చేసిన బాబుకు ఈ ప్రాంతంలో మరోసారి భంగపాటు తప్పదన్నారు. ఐదేళ్లు అధికారమిచ్చి రాజధానిని నిర్మించమని ప్రజలు కోరితే.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని రూ.3.50 లక్షల కోట్లు దోపిడీ చేసిన బాబు అరాచకాలపై సీబీఐ విచారణ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి పేరుతో కొనసాగిన పెట్టుబడి దారుల ఉద్యమం పూర్తిగా చతికిలపడటంతో బాబు తన పుత్రుడు లోకేశ్, దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్‌ను ప్రజల్లోకి తిప్పి రాజకీయ లబ్ధి పొందాలని కుట్రలు పన్నుతున్నాడన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోను మోసగించిన సైబర్ నేరగాడికి రిమాండ్

అనకాపల్లి టౌన్: అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ సైబర్ నేరగాడి ఉచ్చులో చిక్కి మోసపోయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ దాడి మోహనరావు తెలిపిన మేరకు.. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌కు చెందిన వ్యక్తి జనవరి 10న జిల్లా కలెక్టర్ ఫొటోతో ఆర్డీవోకి ఒక మెసేజ్ పంపాడు. తనకు రూ.50 వేలు పంపాలని, త్వరలోనే తిరిగిచ్చేస్తానని ఆ మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో ఆర్డీవో వెంటనే రూ.50 వేలు పంపించారు. తర్వాత కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిసిన సందర్భంలో నగదు పంపిన విషయంపై ఆర్డీవో ఆరా తీయగా.. తానెలాంటి మెసేజ్ పంపించలేదంటూ కలెక్టర్ సమాధానమిచ్చారు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన ఆర్డీవో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉత్తరాఖండ్ పోలీసుల సాయంతో సైబర్ నేరగాడిని అదుపులోకి తీసుకుని, స్థానిక న్యాయ సముదాయంలో శుక్రవారం హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

108 సిబ్బంది సాయంతో సుఖ ప్రసవం

వై.రామవరం: పురిటి నొప్పులతో పరిస్థితి విషమంగా ఉన్న నిండుగర్భిణికి తక్షణ సేవలందించి ప్రాణాపాయ పరిస్థితులనుంచి 108 సిబ్బంది కాపాడారు. కొయ్యూరు మండలం నక్కలమెట్ట గ్రామానికి చెందిన కిలో లక్ష్మి (21)కి శుక్రవారం పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఆశా వర్కరు 108కు సమాచారం అందించారు. నక్కమెట్ట గ్రామం పక్కనున్న మరో మండల కేంద్రం వై.రామవరానికి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. రహదారి సౌకర్యం లేక గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో 108 వాహనం నిలిచిపోయింది. సిబ్బంది కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తుల సాయంతో గర్భిణిని డోలీలో 108 వద్దకు తీసుకొస్తుండగా పురిటి నొప్పులు మరింత ఎక్కువై పరిస్థితి విషమంగా మారింది. వెంటనే ఆమెను మార్గమధ్యలో చెట్టుచాటుకు తీసుకువెళ్లి ఈఎంటీ పి.శ్రీనివాసరావు, పైలెట్ రాఘవులు ప్రసవం చేశారు. ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. అక్కడి నుంచి తల్లీబిడ్డలను వేర్వేరు డోలీల్లో 108 వాహనం వద్దకు తీసుకెళ్లి, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

నా కుమారుడు తప్పు చేయలేదు

- ఢిల్లీ లిక్కర్ స్కాంలో పాత్ర లేదు మాగుంట రాఘవరెడ్డిపై
- అక్రమంగా కేసు బనాయించారు ఒంగోలు ఎంపీ మాగుంట



ఒంగోలు సబర్బన్: ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి తన కుమారుడు రాఘవరెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని, సీబీఐ అక్రమంగా అరెస్ట్ చేసిందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కాంతో తన కుమారుడికి సంబంధం లేదన్నారు. ఎలాంటి పాత్ర లేకపోయినా తన కుమారుడిపై అక్రమంగా కేసు బనాయించి అరెస్ట్ చేశారని వాపోయారు. తన బిడ్డ ఎలాంటి తప్పు చేయలేదని గతంలో కూడా పలుమార్లు చెప్పానన్నారు. తన కుమారుడు తప్పు చేయలేదన్న నమ్మకం, విశ్వాసం ఉన్నట్లు చెప్పారు. తాను కోర్టులో కలిసినప్పుడు మాగుంట కుటుంబాన్నిగానీ, పెదనాన్న సుబ్బరామిరెడ్డినిగానీ అప్రతిష్ట పాలుచేయలేదని, మీకు తలవంపులు తెచ్చే ఎలాంటి తప్పు చేయలేదని తనకు చెప్పారని తెలిపారు. 'మా నాన్న మాగుంట రాఘవరెడ్డి 70 సంవత్సరాల కిందట మద్యం వ్యాపారం ప్రారంభించారు. దాదాపు 10 రాష్ట్రాల్లో ఈ వ్యాపారం చేస్తున్నాం. ఏ రాష్ట్రంలో కూడా ఎలాంటి తప్పులు చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండానే వ్యాపారాలు చేస్తూ వస్తున్నాం. మా అన్న సుబ్బరామిరెడ్డి కూడా సక్రమ మార్గంలోనే వ్యాపారాలు చేస్తూ ప్రకాశం జిల్లా రాజకీయాల్లోకి ప్రవేశించారు. నాకు కూడా వ్యాపారాల్లో 50 సంవత్సరాల అనుభవం ఉంది. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకోసం తాను ధైర్యంగా ఉన్నానని నా కుమారుడు చెప్పాడు. నన్ను ధైర్యంగా ఉండమని కూడా ధైర్యాన్నిచ్చాడు. ఇలాంటి కొడుకును నాకు ఇచ్చినందుకు ఆ భగవంతుడికి జన్మజన్మలా రుణపడి ఉంటాను. నేను, నా కుటుంబం ఒకటే కోరుకుంటున్నాం. మేము ధైర్యంగా ఉన్నాం. జిల్లా ప్రజలు, శ్రేయోభిలాషులు కూడా అందరూ నా బిడ్డను ఆశీర్వదించండి. జిల్లాలో మాగుంట సుబ్బరామిరెడ్డి ఎంతో కష్టపడ్డారు. జిల్లాకు సేవ చేయటానికే వచ్చాం. అంతా మేలు జరగాలని కోరుకుంటున్నా..' అని చెప్పారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకుమించి ఎక్కువ మాట్లాడకూడదన్నారు. తరువాత నిజానిజాలు మీముందు ఉంచుతానని జిల్లా ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కేడర్‌కు ఆయన వివరించారు.

ఘనంగా తిరుపతి పుట్టినరోజు వేడుకలు

నగరంలో శోభాయమానంగా ఆధ్యాత్మిక యాత్ర | **గోవిందనామ స్మరణతో మార్మోగిన తిరుపతి**


గోవిందరాజస్వామికి సమర్పించేందుకు జీయర్ స్వాములతో కలసి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

సాక్షి, తిరుపతి: తిరుపతి నగరం 893వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ, కార్పొరేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఎమ్మెల్యే భూమన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీ గోవిందరాజుస్వామికి సమర్పించారు. శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వద్ద అర్చకులు, జీయర్‌స్వాముల ఆశీస్సులు తీసుకుని శోభాయాత్రను ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భజన మండళ్ల కళాప్రదర్శనల నడుమ ఆధ్యాత్మికయాత్ర శోభాయమానంగా సాగింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన చెక్క భజనలు, కోలాటాలు, కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వామి భక్తులు పౌరాణిక వేషధారణలో భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కనులపండువగా సాగిన యాత్ర ఆద్యంతం.. గోవిందనామ స్మరణతో తిరుపతి పులకించిపోయింది. తమ నగరం పుట్టినరోజును పురస్కరించుకుని నగరాన్ని పచ్చతోరణాలతో అలంకరించారు. పూలు చల్లుతూ, పసుపు నీళ్లు వారబోస్తూ శోభాయాత్రను స్వాగతించారు. గుమ్మడి కాయలతో దిష్టితీస్తూ, కర్పూర హారతులు పడుతూ భక్తిని చాటుకున్నారు. జగద్గురు శ్రీ రామానుజాచార్యుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ ప్రజలు సమతాస్ఫూర్తి ప్రచారకర్తలై ముందుకు సాగారు. పుణ్యక్షేత్ర జన్మదిన వేడుకలు ఏటా కొనసాగాలని జీయర్‌స్వాములు ఆకాంక్షించారు.

భగవంతుడి అనుగ్రహంతోనే..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి ఎంతో పవిత్రమైందని చెప్పారు. గోవిందరాజుస్వామిని ముక్కోటి దేవతలు పూజిస్తారన్నారు. శ్రీ మహావిష్ణువే శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారంలో స్వయంభువుగా వెలిసిన మహాపుణ్యక్షేత్రమిదని తెలిపారు. దైవసమానులైన సమతామూర్తి శ్రీ రామానుజాచార్యులు 1130 ఫిబ్రవరి 24వ తేదీన శంకుస్థాపన చేసిన ప్రాంతమని చెప్పారు. ప్రపంచంలో వ్యక్తులకు మాత్రమే జన్మదిన వేడుకలు జరుగుతాయని, అయితే ఓ ప్రాంతానికి జన్మదిన వేడుకలు జరగడమంటే ఒక్క తిరుపతికి మాత్రమేనని పేర్కొన్నారు. ఆ భగవంతుడి అనుగ్రహం వల్లే తాను ఇలాంటి మహోన్నత కార్యక్రమాన్ని చేస్తున్నానని, ఇది పూర్వజన్మ సుకృతమని చెప్పారు. తిరుపతి ప్రాభవాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాబృందాలు

ఔషధాల రక్షణ కీలకం

- ఫార్మా పరిశ్రమలు మందుల తయారీతోపాటు రక్షణపైనా దృష్టి పెట్టాలి
- భారత్‌లోని డ్రగ్ తయారీ పరిశ్రమలు అద్భుతం
- జనరిక్ మందుల తయారీలో ఇండియా నంబర్ వన్
- 'సాక్షి'తో యూఎస్ ఎఫ్‌డీఏ సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూకీ హెగిన్స్



సాక్షి, విశాఖపట్నం: ఫార్మా పరిశ్రమలు కేవలం ఔషధ ఉత్పత్తులపైనే కాకుండా... వాటి రక్షణ, నిల్వల పైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూకీ హెగిన్స్ చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏయూ ఫార్మసీ కళాశాల, యూఎస్ ఎఫ్‌డీఏ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బ్రూకీ హెగిన్స్... 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఫార్మా రంగానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే....

నిరంతర పరిశీలన

- ఆహార ఉత్పత్తులే కాదు, ఔషధాల తయారీ, నిల్వల విషయంలో సరైన పద్ధతుల్లో నాణ్యత, భద్రత ప్రమాణాలను పరిశీలిస్తున్నాం.
- మందులు, వైద్య పరికరాల పరిరక్షణకు ఎఫ్‌డీఏ గైడ్‌లైన్స్ పాటించాల్సిందే.
- ఫార్మా పరిశ్రమలు క్లీన్ రూమ్ ప్రమాణాలను పాటించాలి. ముఖ్యంగా స్టైరైల్‌గా భావించే ఔషధాలను ఉత్పత్తి చేసిన అనంతరం సూక్ష్మ జీవుల బారినపడకుండా భద్రపరచాలి. లేదంటే వాటిని వినియోగించేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- అసెప్టిక్ ప్రాసెసింగ్ (సూక్ష్మ కణాలు చేరకుండా భద్రపరచడం) అనేది ఫార్మా ఉత్పత్తుల కార్యకలాపాల్లో అత్యంత ముఖ్యమైనది. ప్రమాదకరమైనది కూడా.
- సాధారణంగా ఒక మనిషి శరీరం నుంచి రోజూ లక్షలాది బ్యాక్టీరియాలు విడుదల వుతుంటాయి. వీటి ద్వారా మందులు తయారుచేసే సమయంలోనే కొన్నిసార్లు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అందుకే డ్రగ్స్ తయారీలో గ్లోవ్ లెస్ రోబోటిక్స్ అసలైన ప్రత్యామ్నాయంగా భావించవచ్చు.
- డ్రగ్స్ తయారీ, భద్రత విషయంలో భారత్‌లోని ఫార్మా పరిశ్రమలు అద్భుతంగా వ్యవహరిస్తున్నాయి.
- జనరిక్ ఔషధాల తయారీ, సరఫరాలో భారత్ నంబర్ వన్‌గా ఉంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద డ్రగ్ పరిశ్రమగా, విలువ ప్రకారం పదో స్థానంలో భారత్ ఉంది. ఫార్మారంగంలో అమెరికాతో సత్సంబంధాలు మెరుగుపడుతున్నాయి.

తిరుమల లడ్డూ కౌంటర్లలో తాటాకు బుట్టలు!

సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు టీటీడీ చేయూత



తిరుమల : ప్రకృతి పరిరక్షణ, సంప్రదాయ వృత్తుల ప్రోత్సాహానికి టీటీడీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా రద్దు చేసింది. వాటి స్థానంలో బయో డీగ్రేడబుల్ ప్లాస్టిక్ కవర్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే ప్రకృతి వ్యవసాయవేత్త విజయరామ్ సహకారంతో టీటీడీ తాటాకు బుట్టలను లడ్డూ విక్రయ కేంద్రంలో భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. తద్వారా తాటి చెట్లను పెంచే వారికి ఆదాయంతోపాటు, తాటాకు బుట్టలను తయారు చేసే సంప్రదాయ వృత్తి కళాకారులకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది.

రాష్ట్రంలో కొత్తగా 3,000 ఆలయాలు

- దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కదానికి రూ.10 లక్షల వ్యయం
- ఇప్పటికే పురోగతిలో 936 ఆలయాల నిర్మాణ పనులు
- కొత్తగా 1,568 ఆలయాల నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆమోదం
- మరికొన్ని చోట్ల ఆలయాల నిర్మాణానికి ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలో కొత్తగా దాదాపు 3 వేల ఆలయాలను నిరిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని స్థాయిలో ఆలయాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. అధికారులతో సమీక్ష అనంతరం శుక్రవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షల చొప్పున 1,072 ఆలయాల నిర్మాణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. వీటిలో 936 చోట్ల ఆలయాలను నిర్మించేందుకు భూమిని గుర్తించామని చెప్పారు. వీటిలో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారానే మరో 330 ఆలయాల నిర్మాణం హిందూ ధార్మిక సంస్థ సమరసత ఆధ్వర్యంలో కొనసాగుతోందన్నారు. ఇవికాకుండా మరో 1,568 ఆలయాల నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. మరో 300 చోట్ల కూడా ఆలయాలను నిర్మించాలని అక్కడి ప్రజాప్రతినిధులు కోరుతున్నారన్నారు. వచ్చే ఏడాదిన్నర కాలంలోనే ఆలయాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రతి 30 ఆలయాలకు ఒక ఇంజనీరింగ్ అధికారిని నియమించనున్నామని తెలిపారు. దేవదాయ శాఖ ఆలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు ఏక విధానంతో కూడిన ప్రత్యేక పాలసీని తీసుకురానున్నట్టు చెప్పారు.

అన్నదాన సత్రాల ఏర్పాటుకు 18 దరఖాస్తులు..

శ్రీశైలంలో వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో అన్నదాన సత్రాల ఏర్పాటు, ఇతర సేవా కార్యక్రమాల నిర్వహణకు 18 దరఖాస్తులు ప్రభుత్వ పరిశీలనకు వచ్చాయన్నారు. వీటికి ఒక నిర్ణీత విధానంలో భూకేటాయింపులు చేయాలనే యోచన చేస్తున్నట్టు వివరించారు. ముందుగా అక్కడ భక్తులకు వసతి కోసం ఎన్ని గదులతో సత్రాలు నిర్మిస్తారో పూర్తి ప్లాన్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. శ్రీశైలంలో భూముల కేటాయింపు ఆలయ అభివృద్ధికి దోహదపడేలా నిబంధనలు తీసుకొచ్చే యోచనలో ఉన్నామని తెలిపారు. శ్రీశైలం ఆలయం– అటవీ శాఖల మధ్య ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 4,700 ఎకరాల భూమిని అటవీ శాఖ.. ఆలయానికి స్వాధీనం చేసేందుకు ఆమోదం తెలిపిందన్నారు. విజయవాడ దుర్గగుడిలో భక్తులకు అదనపు సౌకర్యాల కోసం పూర్తి స్థాయి మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని తెలిపారు. ఆలయాల్లో వివిధ అవసరాలకు వస్తువుల కొనుగోలులో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రతి ఆలయంలో మూడు వేర్వేరు టెండర్ల ప్రక్రియ ఉంటుందన్నారు. దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు ప్రత్యేక సెల్ ఉందని తెలిపారు.

ఏపీలో త్వరలోనే అందుబాటులోకి 4 వైద్య కళాశాలలు

- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ డాక్టర్ బాబ్జి

గుంటూరు మెడికల్: ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో పీజీ సీటు తీసుకునేందుకు ఒకప్పుడు వెనకడుగు వేసేవారని నేడు ఆర్థోపెడిక్‌కి డిమాండ్ పెరుగుతోందని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జి చెప్పారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో శుక్రవారం ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 52వ వార్షిక సదస్సు ప్రారంభమైంది. ఈ నెల 26 వరకు ఈ సదస్సు జరగనుంది. డాక్టర్ బాబ్జి ముఖ్య అతిథిగా విచ్చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నేడు కొత్తగా 5 వైద్య కళాశాలలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో విజయనగరం వైద్య కళాశాల ప్రారంభించామని, త్వరలోనే మిగతా 4 వైద్య కళాశాలలు ప్రారంభమవుతాయన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా గుంటూరు సదస్సుకు విచ్చేసిన డాక్టర్ బాబ్జిని సదస్సు నిర్వాహకులు సన్మానించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ నొప్పి నివారణలో ఆర్థోపెడిక్ వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్స్ సొసైటీ జాతీయ జనరల్ సెక్రటరీ డాక్టర్ నవీన్ ఠక్కర్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ ఫెలోషిప్ కోసం ఏపీ నుంచి 134 మంది యువ వైద్యులు దరఖాస్తు చేసుకోవడం సంతోషకరమన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, డాక్టర్ యశశ్వి రమణ తదితరులు ప్రసంగించారు.

నర్తనకాళి అలంకారంలో చండీమాత దర్శనం


యజ్ఞభూమిలో అమ్మవారిని దర్శించుకుంటున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం (పెందుర్తి): విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో లక్ష చండీ మహాయజ్ఞం 14వ రోజు శుక్రవారం కొనసాగింది. యజ్ఞభూమిలో చండీమాత అష్టోత్తర భుజ నర్తనకాళి అలంకారంలో దర్శనమిచ్చారు. చండీమాతను ఆరాధిస్తూ పండితులు విశేషంగా పారాయణ హోమాలు నిర్వహించారు. శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి గుంటీ మాత అమ్మవారికి పూజలు జరిపి, యజ్ఞాన్ని పర్యవేక్షించారు. అలాగే గుంటీమాత ఆశ్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి, కాలభైరవ, బాలా త్రిపుర సుందరీదేవి దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే లోక శాంతిని కాంక్షిస్తూ శనివారం యజ్ఞభూమిలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. ఆదివారం జరిగే మహా పూర్ణాహుతితో మహాయజ్ఞం ముగియనుంది.

మార్చి 3 నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో పుష్కరిణిలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలి రోజు సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి అవతారంలో స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. 4న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి అవతారంలో విహరిస్తారు. 5న శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్ప స్వామిగా దర్శనమిస్తారు. ఇదేవిధంగా శ్రీమలయప్ప స్వామి వారు 6న ఐదు సార్లు, 7న ఏడు సార్లు తెప్పపై విహరించి భక్తులను కటాక్షిస్తారు. తెప్పోత్సవాల కారణంగా మార్చి 3, 4వ తేదీల్లో తోమాలసేవ, అర్చన, సహస్ర దీపాలంకార సేవ, 5, 6వ తేదీల్లో తోమాలసేవ, అర్చన, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, మార్చి 7న ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో గురువారం అర్ధరాత్రి వరకు 57,737 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు సమర్పించారు.

నౌకాదళ అమ్ముల పొదిలో ఎంసీఏ బార్జ్


ఎంసీఏ బార్జ్

సాక్షి, విశాఖపట్నం : భారత నౌకాదళ అమ్ముల పొదిలో మిస్సైల్స్, మందుగుండు సామగ్రిని భద్రపరిచే మిస్సైల్ కమ్ ఎమ్యునేషన్ (ఎంసీఏ) బార్జ్ యార్డ్ 75 చేరింది. భారత నౌకాదళం 8 బార్జ్‌లను తయారు చేయాలని విశాఖపట్నానికి చెందిన సీకాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సిద్ధం చేసిన బార్జ్‌ని సీకాన్ ప్రయోగ కేంద్రమైన గుత్తెనదీవి వద్ద శుక్రవారం ప్రారంభించారు. మేకిన్ ఇండియాలో భాగంగా దాదాపు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీనిని తయారు చేశారు. నౌకాదళంలో 30ఏళ్ల పాటు ఇవి సేవలందించనున్నాయి. ఈ బార్జ్‌ల ద్వారా యుద్ధ నౌకలకు అవసరమైన మిస్సైల్స్, మందుగుండు సామగ్రిని బార్జ్‌ల ద్వారా సరఫరా చేయనున్నారు.

నలుగురి సజీవదహనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

కడియం: పెట్రోలు పోసి అతికిరాతకంగా నలుగురిని సజీవదహనం చేసిన కేసులో నిందితులు మాసాడ శ్రీను, మర్లపూడి మోహన్‌కు రాజమహేంద్రవరం 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.విజయ్ గౌతమ్ శిక్ష ఖరారు చేశారు. హత్యానేరానికి జీవిత ఖైదు, రూ.40 వేల జరిమానా, హత్యాయత్నం నేరానికి ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా, అక్రమ ప్రవేశం, ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు వివరాలను కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ శుక్రవారం తెలిపారు. 2020 జనవరి 22న తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ళ గ్రామంలోని ఇంట్లో నిద్రపోతున్న కోట్ని సత్యవతి, ఆమె కుటుంబ సభ్యులు కోట్ని రాము, గంటా దుర్గాభవాని, గంటా విజయలక్ష్మి, దుర్గామహేష్, ఏసుకుమార్‌పై.. మర్లపూడి మోహన్ అనే వ్యక్తితో కలిసి సత్యవతి భర్త అప్పారావు చెల్లెలి కొడుకు మాసాడ శ్రీను ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. ఇంటి తలుపులకు బయటి నుంచి గడియ పెట్టి.. నిందితులిద్దరూ సత్యవతి ఇంటి పైకప్పు పైనుంచి పెట్రోలు పోసి నిప్పు పెట్టారు. ఘటనలో సత్యవతి (50), రాము (18), దుర్గాభవాని (24), విజయలక్ష్మి (8) సజీవ దహనమయ్యారు. మహేష్, ఏసుకుమార్ గాయాలతో బయట పడ్డారు. ఘటనపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మోహన్‌తో కలిసి మాసాడ శ్రీను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి డి.విజయ్ గౌతమ్ పై విధంగా తీర్పునిచ్చారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ఇద్దరు మృతి, 25మందికి గాయాలు
- అనకాపల్లి జిల్లాలో ఘటన


నుజ్జు నుజ్జయిన ఆర్‌టీసీ బస్సు వెనుకభాగం, ఆటో

ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో 25మంది గాయపడ్డారు. అందులో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం జాతీయరహదారిపై పి.ధర్మవరం జంక్షన్‌లో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళుతున్న బస్సులో 48 మంది ప్రయాణికులున్నారు. పి.ధర్మవరం జంక్షన్‌లో ప్రయాణికులను దింపి, ఎక్కించుకునేందుకు రోడ్డు పక్కన బస్సు ఆగింది. ఇంతలో యలమంచిలి వైపు నుంచి తుని వైపు వెళుతున్న పంజాబ్‌కు చెందిన లారీ అతివేగంగా వచ్చి బస్సును వెనుక నుంచి ఢీకొని, అదే వేగంతో డివైడర్ దాటి అవతలి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయానికి బస్సు సమీపంలో ఒక ఆటో కూడా ఉంది. లారీ ఢీకొనడంతో బస్సు, ఆటో పక్కన 30 అడుగుల లోతులో ఉన్న వరాహనది కాలువలోకి దూసుకుపోయాయి. వెంటనే స్పందించిన స్థానికులు, ఎస్.రాయవరం ఎస్ఐ ప్రసాదరావు క్షతగాత్రులను నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. విశాఖపట్నం ఇసుకతోటకు చెందిన మడపల్లి పరసయ్య (50) నక్కపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లే సరికే మృతి చెందాడు. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి, ఆపై విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మార్గమధ్యంలో ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు గ్రామానికి చెందిన యేజర్ల నారాయణరాజు (56) మృతి చెందాడు. గాయపడిన వారిలో బస్సు డ్రైవర్ ఇసరపు రమణ, కండక్టర్ కె.లక్ష్మి, ఆటో డ్రైవర్ గొర్ల కృష్ణ, లారీ క్లీనర్ సుఫీమర్‌తోపాటు విశాఖ, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలకు చెందినవారున్నారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. నక్కపల్లి ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఇచ్చారు. నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత ప్రమాద స్థలాన్ని పరిశీలించి నక్కపల్లి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సు బోల్తాకొట్టకుండా లోయలోకి దూసుకుపోయింది. లేకుంటే మరింత ప్రాణ నష్టం జరిగి ఉండేది. 108 వాహనాలు వచ్చేలోపే ఎస్ఐ ప్రసాదరావు క్షతగాత్రులను ఎత్తుకుని తీసుకొచ్చి స్థానిక ఆటోల్లో ఆస్పత్రికి తరలించారు.

హనీట్రాప్‌లో పడిన డీఆర్‌డీవో అధికారి అరెస్ట్

పాకిస్థాన్‌కు రహస్య సమాచారం చేరవేసిన సీనియర్ టెక్నికల్ ఆఫీసర్

భువనేశ్వర్: హనీట్రాప్‌లో పడి పాకిస్థాన్‌కు రహస్య సమాచారం అందించిన ఆరోపణపై ఒక వ్యక్తిని ఒడిశాలోని బాలేశ్వర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పాకిస్థానీ మహిళ నిందితుడిని హనీట్రాప్ చేసిందని తూర్పు రేంజ్ ఐజీ హిమాన్షు లాల్, బాలేశ్వర్ ఎస్పీ సాగరికనాథ్ చెప్పారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. వారు తెలిపిన మేరకు.. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌ను గూఢచర్యం ఆరోపణలపై పోలీసులు అరెస్టు చేశారు. ఆయన చాందీపూర్‌లోని మధ్యంతర టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)లో పనిచేస్తున్నారు. సున్నితమైన రక్షణ, క్షిపణి పరీక్ష సంబంధిత సమాచారాన్ని పాకిస్థానీ మహిళతో పంచుకున్నట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. రావల్పిండిలోని ఓ వ్యక్తికి తన మొబైల్ ద్వారా క్షిపణి పరీక్ష మొదలైన వాటికి సంబంధించిన సున్నితమైన రక్షణ రహస్యాలను చేరదీస్తున్నట్లు, వాట్సాప్ ద్వారా సందేశాలు, ఫొటోలు, వీడియోలు ప్రసారం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బాలేశ్వర్ పోలీసులు, సెంట్రల్ ఏజెన్సీ సంయుక్త దర్యాప్తు తర్వాత నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

లవ్‌ప్రీత్ సింగ్ విడుదల



అమృత్‌సర్: ఖలిస్తానీ అనుకూలవాద బోధకుడు, 'వారిస్ పంజాబ్ దే' సంస్థ చీఫ్ అమృత్‌పాల్ సింగ్ అనుచరుడు లవ్‌ప్రీత్ సింగ్ శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యాడు. కిడ్నాప్ కేసులో లవ్‌ప్రీత్ అరెస్టును వ్యతిరేకిస్తూ వందలాదిగా అమృత్‌పాల్ అనుయాయులు కత్తులు, తుపాకులతో అమృత్‌సర్‌లో గురువారం చేపట్టిన భారీ ప్రదర్శన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన విషయం తెలిసిందే. కిడ్నాప్ సమయంలో లవ్‌ప్రీత్ అక్కడ లేరని తేలినందున అతడిని విడుదల చేయాలంటూ పోలీసులు శుక్రవారం కోర్టులో పిటిషన్ వేశారు. జడ్జి ఆదేశాల మేరకు అతన్ని అమృత్‌సర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల చేశారు. జైలు వెలుపల మద్దతుదారులు ఘన స్వాగతం పలికారు. గురువారం నాటి హింసాత్మక ఘటనలపై అధికారులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్నిఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఎజెండా లేదు: బీబీసీ

లండన్: భారత్‌లో బీబీసీ ఏ ఎజెండాతోనూ పనిచేయడం లేదని సంస్థ చీఫ్ టిమ్ డేవీ చెప్పారు. నిష్పాక్షికంగా వార్తలందించడం మినహా తమకింకేమీ ముఖ్యం కాదన్నారు. ధైర్యంగా వ్యవహరిస్తున్నందుకు సంస్థ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌లోని సిబ్బంది విధులను సురక్షితంగా, సమర్థవంతంగా కొనసాగించేందుకు బీబీసీ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆయన భారత్‌లో బీబీసీ కార్యాలయాల సిబ్బందికి ఒక మెయిల్ పంపారు. ప్రధాని మోదీ, 2002 గుజరాత్ అల్లర్లపై బీబీసీ ఇటీవల 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరుతో డాక్యుమెంటరీ ప్రసారం చేయడం..ఢిల్లీ, ముంబైల్లోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు సర్వే పేరుతో రికార్డుల తనిఖీ చేపట్టిన విషయం తెలిసిందే. బీబీసీ యూకే కేంద్రంగా పనిచేస్తోంది.

నేడు భారత్‌కు షోల్జ్


న్యూఢిల్లీ: జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ రెండు రోజుల పర్యటనకు శనివారం భారత్ రానున్నారు. ఉదయం రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు లాంఛనంగా స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రధాని మోదీతో షోల్జ్ చర్చలు జరుపుతారు. ఉక్రెయిన్ సంక్షోభం, ఇండో–ఫసిఫిక్ పరిస్థితులతోపాటు వాణిజ్యం, నూతన సాంకేతిక పరిజ్ఞానం, క్లీన్ ఎనర్జీ రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు గల అవకాశాలపై వీరు చర్చించనున్నారు.


చిన్న పార్టీల చుట్టూ...


మేఘాలయ, నాగాలాండ్ ఎన్నికల చిత్రం ● జాతీయ పార్టీల ఉనికి నామ మాత్రం ● చివరి దశకు ఎన్నికల ప్రచారం


మేఘాలయలో ప్రాంతీయ పార్టీలే జోరు మీదున్నాయి. ప్రస్తుతమున్న పార్టీలతో పాటుగా మరో రెండు పార్టీలు కొత్తగా బరిలోకొచ్చాయి. వాయిస్ ఆఫ్ ది పీపుల్స్ పార్టీ (వీపీపీ) , కేఏఎం మేఘాలయ కూడా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. వీపీపీ 18 సీట్లలోనూ కేఏఎం 3 సీట్లలో మాత్రమే పోటీ పడుతున్నప్పటికీ వాటి ప్రభావం బాగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఇతర పార్టీల్లా కాకుండా ఈ రెండు పార్టీలు స్వచ్ఛమైన రాజకీయాలు, అవినీతి రహిత ప్రభుత్వాలు అనే అంశాలపై దృష్టి సారించాయి. గత ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. ఈ సారి కూడా ఏ పార్టీకి మెజార్టీ దక్కే అవకాశాలైతే కనిపించడం లేదు. గత ఎన్నికల్లో ముకుల్ సంగ్మా సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 21 సీట్లు సాధించి సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించినప్పటికీ 19 సీట్లలో నెగ్గిన నేషనలిస్ట్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), రెండే స్థానాలు గెలిచిన బీజేపీతో పాటు ప్రాంతీయ పార్టీలైన యూడీఎఫ్, పీడీపీ, హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (హెచ్‌ఎస్‌పీడీపీ), మరికొందరు స్వతంత్రులతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ తర్వాత కొంత కాలానికి బీజేపీ, ఎంపీపీ మధ్య విభేదాలు ముదిరాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెర్నార్డ్ ఆర్. మారక్ గారో హిల్స్‌లో బ్రోతల్ హౌస్ నడుపుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేయడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, మారక్ ఇరువురు తుర పట్టణానికి చెందిన వారైనప్పటికీ వారి మధ్య సయోధ్య లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ ఈ సారి ఎన్నికల్లో మారక్‌కు పూర్తిగా స్వేచ్ఛనిచ్చింది. మారక్‌పై ఉన్న సానుభూతితో గారో హిల్స్‌లోని 24 అసెంబ్లీ స్థానాల్లో పాగా వేయాలని యోచిస్తోంది. సంగ్మా సర్కార్‌కు మద్దతు ఉపసంహరించాలని బీజేపీ స్థానిక నాయకులు ఒత్తిడి తెచ్చినప్పటికీ పార్టీ ఆచి తూచి అడుగులు వేస్తోంది. క్రిస్టియన్ జనాభా అధికంగా ఉన్న బీజేపీ గత ఎన్నికల్లో రెండు స్థానాలను గెలుపొంది ఇప్పుడు కనీసం డబుల్ డిజిట్‌పై దృష్టి పెట్టింది. అధికారంలో ఉన్న పార్టీలన్నీ ఎవరికి వారే పోటీ పడుతున్నట్టుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అధికార వ్యతిరేకత ఎన్‌పీపీపైనే ఉంటుందని ఇతర పార్టీలు ధీమాగా ఉన్నాయి. మరోవైపు ఎన్‌పీపీ కూడా బీజేపీ హిందుత్వ విధానాలు తమ పార్టీకి ఎదురు దెబ్బగా మారుతుందన్న ఆందోళనతోనే ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకోలేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని పార్టీలకు సవాల్ విసిరినా ఈసారి అంతర్గత కుమ్ములాటలతోనే ఆ పార్టీ సతమతమవుతోంది. గత ఎన్నికల్లో పార్టీలో ప్రధానంగా ఉన్న ముకుల్ సంగ్మా ఈసారి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈశాన్య రాష్ట్రాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్న టీఎంసీ ఈ సారి బలమైన పక్షంగా మారుతుందనే అంచనాలున్నాయి. మొత్తమ్మీద ఈ ముక్కోణపు పోటీలో మేఘాలయ ఎన్నికల చిత్రం ఎలా మారుతుందో చూడాలి.

పోలింగ్ తేదీ	ఫిబ్రవరి 27
మొత్తం స్థానాలు	60
బరిలో ఉన్న పార్టీలు	11
బరిలో మొత్తం అభ్యర్థులు	375
బీజేపీ పోటీ చేస్తున్న సీట్లు	60
కాంగ్రెస్ బరిలో ఉన్న సీట్లు	60
నేషనల్ పీపుల్స్ పార్టీ	57
తృణమూల్ కాంగ్రెస్	56









నాగాలాండ్లో మొత్తం 60 నియోజకవర్గాల్లో ఎవరూ అభ్యర్థుల్ని నిలబెట్టలేని పరిస్థితులున్నాయి. ఈ రాష్ట్రంలో కూడా ప్రాంతీయ పార్టీలదే హవా. జాతీయ పార్టీల ఉనికి నామ మాత్రంగానే ఉంది. నాగాలాండ్‌లో ప్రస్తుతం నేషనల్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) బీజేపీ కూటమి అధికారంలో ఉంది.ఎన్‌డీపీపీ 40 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుంటే, బీజేపీ 19 నియోజకవర్గాల్లో బరిలో ఉంది. ఈ సారి ఎన్నికల్లో గ్రేటర్ నాగాలాండ్ డిమాండ్ ఎక్కువ ప్రభావం చూపించనుంది. ముఖ్యమంత్రి నిఫుయో రియోకు సామాన్య ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. 2018లో జరిగిన ఎన్నికల్లో 26 స్థానాల్లో గెలిచి అతి పెద్ద పార్టీగా నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) అవతరించినప్పటికీ , బీజేపీతో ఎప్పట్నుంచో సంబంధాలున్నా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఎన్‌డీపీపీతో కలిసి అధికారంలో ఉన్న బీజేపీ నాగా శాంతి చర్చలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. ఈ సారి కూడా బీజేపీ ఎన్‌డీపీపీ కలిసి పోటీ చేయనున్నాయి. ఎన్‌డీపీపీ 40 స్థానాల్లో పోటీ చేస్తూ ఉంటే బీజేపీ 20 స్థానాలకే పరిమితమైంది. గ్రేటర్ నాగాలాండ్ డిమాండ్‌ను పరిశీలిస్తామన్న హామీతో బీజేపీ అత్యధిక సీట్లలో విజయం సాధించడానికి ప్రయత్నాలు చేస్తోంది. అప్పుడే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చునన్న ఆశతో ఉంది. రాష్ట్ర జనాభాలో 88 శాతం క్రిస్టియన్లు ఉన్నారు. బీజేపీ అందరితోనూ రాజీపడుతూ నాగాలాండ్‌లో పట్టు బిగించాలని చూస్తోంది. క్రిస్టియన్ల ఓటు బ్యాంకుపైనే గంపెడాశలు పెట్టుకున్న కాంగ్రెస్ 23 సీట్లలో మాత్రమే పోటీకి దిగింది. గత రెండు సార్లు ఎన్నికల్ని పరిశీలిస్తే స్థానిక అంశాలపై అంతగా వ్యతిరేకత కనిపించడం లేదు. 2018లో పోటీకి దిగిన అధికార ఎమ్మెల్యేలలో 70 శాతం మంది మళ్లీ నెగ్గడం విశేషం.

- సాక్షి, నేషనల్ డెస్క్

పోలింగ్ తేదీ	ఫిబ్రవరి 27
మొత్తం స్థానాలు	60
ఎన్నికల్లో పోటీలో ఉన్న పార్టీలు	12
బరిలో అభ్యర్థులు	183

కాంగ్రెస్ ఈశాన్యప్రాంతాన్ని ఏటీఎంలా వాడుకుంది

నాగాలాండ్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని



దిమాపూర్/షిల్లాంగ్: గతంలో కాంగ్రెస్ పార్టీ ఈశాన్య ప్రాంతాన్ని ఏటీఎంలాగా వాడుకుంటే, బీజేపీ మాత్రం ఇక్కడి ఎనిమిది రాష్ట్రాలను అష్టలక్ష్ములుగా భావించి, శాంతి, అభివృద్ధి కోసం పాటుపడుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నాగాలాండ్ రాష్ట్రం దిమాపూర్ సమీపంలోని చుమౌకెడిమాలో శుక్రవారం బీజేపీ, ఎన్‌డీపీపీ సంయుక్త ఎన్నికల ర్యాలీలో మోదీ ప్రసంగించారు. నాగాలాండ్‌లో శాశ్వత శాంతి స్థాపనే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం–1958ని పూర్తిగా రద్దు చేసిందని ఆయన తెలిపారు. 'గతంలో ఈశాన్యాన విభజన రాజకీయాలు నడిచాయి. దాన్ని మార్చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. బీజేపీ ప్రభుత్వం మతం, ప్రాంతం ఆధారంగా వివక్ష చూపదు. కాంగ్రెస్ హయాంలో నాగాలాండ్‌లో రాజకీయ అస్థిరత నెలకొంది. ఢిల్లీ రిమోట్ పాలన సాగింది. అభివృద్ధి నిధులను సొంతానికి వాడుకున్నారు. ఢిల్లీ నుంచి దిమాపూర్‌కు వారసత్వ రాజకీయాలు నడిచాయి'' అని మండిపడ్డారు. ప్రజలను కలిపేందుకు, ఢిల్లీ–ఈశాన్య ప్రాంతం మధ్య అంతరాన్ని తగ్గించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. సాంకేతికతను వినియోగించుకుని అవినీతిని రూపుమాపి, మౌలిక వసతులను అభివృద్ధి చేశామన్నారు.

దేశ విజయాల్లో మేఘాలయ కీలకం

మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో కూడా మోదీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. దేశం నూతన విజయ శిఖరాలను అందుకోవడంలో మేఘాలయ బలమైన సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్రంలో కమల వికాసం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్నే కోరుకుంటుందని చెప్పారు. వారసత్వ రాజకీయాల నుంచి రాష్ట్రం బయటపడాల్సిన అవసరం ఉందని తెలిపారు. 'రోడ్డు, రైలు, విమాన మార్గాల అనుసంధానత లేకపోవడంతో రాష్ట్రం వెనుకబాటుకు గురైంది. అయితే, గత 9 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతంతోపాటు రాష్ట్రంలో అనేక సానుకూల మార్పులను సాధించింది'అని చెప్పారు. యువత, వ్యాపారులు, ప్రభుత్వ సిబ్బంది, ఇలా ప్రతి ఒక్కరూ మేఘాలయలో బీజేపీయే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు.



భేటీ సందర్భంగా ఇచ్చిన విందులో ప్రతినిధులతో మంత్రి సీతారామన్

మోయలేని రుణ భారంతో...
దేశాలే తలకిందులు

పాక్, శ్రీలంకలనుద్దేశించి మోదీ ఆందోళన

- ప్రపంచ ఆర్థికాన్ని చక్కదిద్దే బాధ్యత మీదే
- జీ20 ఆర్థిక మంత్రుల భేటీలో వ్యాఖ్యలు
- అంతర్జాతీయ సంస్థలపై నమ్మకం తగ్గింది
- రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు ఆందోళనకరం
- రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై పరోక్ష వ్యాఖ్యలు

బెంగళూరు: మోయలేని రుణ భారం దెబ్బకు పలు వర్ధమాన దేశాల ఆర్థిక పరిస్థితి తలకిందులవుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వెలిబుచ్చారు. ఇది ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి కూడా ఇది ప్రమాద సంకేతమేనన్నారు. శుక్రవారం బెంగళూరులో మొదలైన జీ20 దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్ల రెండు రోజుల సమావేశాన్ని ఉద్దేశించి ఆయన వీడియో సందేశమిచ్చారు. మితిమీరిన అప్పులకు కరోనా కల్లోలం వంటివి శ్రీలంక దివాలా తీయడం, పాకిస్తాన్ కూడా అదే బాటన ఉండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తిరిగి స్థిరత్వంతో కూడిన వృద్ధి బాట పట్టించడం, దానిపై విశ్వాసం పాదుగొల్పడం సంపన్న దేశాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల బాధ్యతేనని ఆయన హితవు పలికారు. ''ఇదంత సులభం కాదు. కానీ నిర్మాణాత్మక ప్రయత్నం జరిగి తీరాలి. అయితే కాలానుగుణంగా సంస్కరించుకుని మారడంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు వెనకబడటంతో వాటిపై విశ్వాసం సన్నగిల్లుతోంది. దీనిపైనా దృష్టి పెట్టాలి'' అని అభిప్రాయపడ్డారు. వాతావరణ మార్పుల విపత్తునూ సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచంలో పలుచోట్ల భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ప్రపంచంలోని పలు దేశాల్లో కనీస సౌకర్యాలకూ నోచుకోక అలమటిస్తున్న దుర్బల ప్రజానీకాన్ని ఆదుకోవడంపై మరింత దృష్టి పెట్టాలన్నారు.

ఆశాదీపంగా భారత్: కరోనా కల్లోలం దెబ్బ నుంచి కోలుకోవడానికి వర్ధమాన దేశాలు ఇంకా పోరాడుతూనే ఉన్న నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ అద్భుత పనితీరు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మోదీ ఆశాభావం వెలిబుచ్చారు. డిజిటల్ కరెన్సీలు, పేమెంట్లు, ప్రపంచ బ్యాంకు వంటి ఆర్థిక సంస్థల్లో సంస్కరణల ఆవశ్యకతతో పాటు కీలకమైన పర్యావరణ మార్పుల సమస్యను ఎదుర్కోవడంపై కూడా సదస్సులో చర్చించే అవకాశముంది.

వ్యవసాయ కేటాయింపులు ఐదింతలు

న్యూఢిల్లీ: దేశ వ్యవసాయ రంగ వార్షిక బడ్జెట్ కేటాయింపులు 2014తో పోలిస్తే ఐదింతలు పెరిగి రూ.1.25 లక్షల కోట్లకు చేరుకున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ప్రభుత్వం సాగు రంగం పురోగతిపై దృష్టి సారించి, వంటనూనెలు వంటి ఆహార వస్తువుల దిగుమతులను తగ్గించేందుకు కృషి చేస్తోందన్నారు. 'వ్యవసాయం–సహకారరంగం'పై పోస్ట్–బడ్జెట్ వెబినార్‌లో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో నిర్ణయాల సమర్థ అమలుకు సలహాల నిమిత్తం కేంద్రం ఈ వెబినార్లను నిర్వహిస్తోంది.

సీడబ్ల్యూసీ సభ్యులకు ఎంపికే!
అధికారం ఖర్గేకు

మాజీ ప్రధానులు, అధ్యక్షులకు శాశ్వత సభ్యత్వం

- లోక్‌సభ, రాజ్యసభా పక్ష నేతలకు కూడా
- కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం
- రాయ్‌పూర్‌లో పార్టీ 85వ ప్లీనరీ షురూ
- ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం
- ప్రారంభోపన్యాసంలో అధ్యక్షుడు ఖర్గే
- 3 రోజులు జరగనున్న సమావేశాలు



ప్లీనరీలో సోనియాకు శాలువా కప్పుతున్న రాహుల్

నవా రాయ్‌పూర్: కాంగ్రెస్‌లో అత్యున్నత నిర్ణాయక విభాగమైన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి ఎన్నిక నిర్వహించరాదని పార్టీ నిర్ణయించింది. సీడబ్ల్యూసీ సభ్యులను నామినేట్ చేయాలని కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ తీర్మానించింది. ఈ అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కట్టబెట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ప్రారంభమైన కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ ఇందుకు వేదికగా నిలిచింది. సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపిక/ఎన్నిక విధానంపై మూడు రోజుల సదస్సులో తొలి రోజు స్టీరింగ్ కమిటీ విస్తృతంగా చర్చించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. వారిని అధ్యక్షుడే నామినేట్ చేయాలని 45 మంది సభ్యుల్లో దాదాపు అందరూ అభిప్రాయపడ్డట్టు చెప్పారు. ఈ నిర్ణయాన్ని ప్లీనరీలో ఏఐసీసీ, పీసీసీ ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తారని విశ్వాసం వెలిబుచ్చారు. కాంగ్రెస్ మాజీ ప్రధానులు, మాజీ అధ్యక్షులందరికీ ఇకపై సీడబ్ల్యూసీలో శాశ్వత సభ్యత్వం ఉండనుంది. లోక్‌సభ, రాజ్యసభల్లో కాంగ్రెస్ పక్ష నేతలు సీడబ్ల్యూసీ సభ్యులుగా కూడా వ్యవహరిస్తారు. అంతేగాక సీడబ్ల్యూసీ స్థానాల్లో 50 శాతం ఇకపై ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, మైనారిటీలు, యువతకు చెందుతాయి. వీటితో పాటు పార్టీ నియమావళికి ప్రతిపాదించిన 16 సవరణలకు స్టీరింగ్ కమిటీ ఆమోదముద్ర వేసినట్టు జైరాం ప్రకటించారు. సీడబ్ల్యూసీలో 25 మంది సభ్యులుంటారు. పార్టీ చీఫ్, పార్లమెంటరీ పార్టీ నేత పోను మిగతా 23 మందిలో 12 మందిని ఎన్నుకుంటారు. 11 మంది నామినేట్ అవుతారు. ఈ ప్రక్రియను ఏకగ్రీవంగా నిర్వహించడం కాంగ్రెస్‌లో ఆనవాయితీ. అందుకు వీలుగా నిర్ణయాధికారాన్ని అధ్యక్షునికి స్టీరింగ్ కమిటీ కట్టబెడుతూ ఉంటుంది.

సంక్షోభంలో వ్యవస్థలు: ఖర్గే

కాంగ్రెస్ 85వ ప్లీనరీ రాయ్‌పూర్‌లో అట్టహాసంగా మొదలైంది. అధ్యక్షుని హోదాలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పెను ప్రమాదంలో పడ్డాయంటూ ఆందోళన వెలిబుచ్చారు. పార్లమెంటరీ వ్యవస్థలన్నీ సంక్షోభంలో చిక్కడమే గాక రాజకీయ పార్టీల కార్యకలాపాలన్నింటిపైనా రాక్షస నిఘా పెరిగిపోయిందంటూ మండిపడ్డారు. ''ఇలాంటి తరుణంలో పార్టీ ప్లీనరీ జరుపుకుంటున్నాం. గత ప్లీనరీలు పలు చరిత్రాత్మక నిర్ణయాలకు, మైలురాళ్లకు వేదికలయ్యాయి. ఈ ప్లీనరీని కూడా అలా పార్టీ చరిత్రలోనే చిరస్మరణీయంగా మలచుకుందాం'' అంటూ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ''భారత్ జోడో యాత్ర ఉత్సాహాన్ని ముందుకు తీసుకెళ్దాం. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మనకు పెద్ద సవాలు. గొప్ప అవకాశం కూడా'' అన్నారు. అంతకుముందు ఖర్గే సారథ్యంలో స్టీరింగ్ కమిటీ భేటీలో మూడు రోజుల సమావేశాల అజెండాను ఖరారు చేశారు. తొలి రోజు సమావేశాలకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వద్రా గైర్హాజరయ్యారు. సోనియా, రాహుల్ శుక్రవారం సాయంత్రానికి రాయ్‌పూర్ చేరుకున్నారు.

నాలుగు అంశాలపై నిర్ణయాలు

ప్లీనరీ అజెండా ఖరారుతో పాటు సీడబ్ల్యూసీ సభ్యులు ఎంపిక విధానాన్ని, పార్టీ నియమావళికి ప్రతిపాదించిన సవరణలను ఆమోదిస్తూ తొలి రోజు నిర్ణయాలు తీసుకున్నారు. వీటితో ఆరు కీలక తీర్మానాలకు ఆమోదముద్ర వేయడంపైనా ప్లీనరీలో నిర్ణయం జరగనుంది.

కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ ఆమోదించిన ముఖ్య సవరణలు...

- మండలం నుంచి రాష్ట్ర స్థాయి దాకా అన్ని పార్టీ కమిటీల్లోనూ 50 ఏళ్ల లోపువారికి 50 శాతం రిజర్వేషన్.
- ఏఐసీసీలోని అన్ని విభాగాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మహిళలు, మైనారిటీ, యువతకు 50 శాతం రిజర్వేషన్.

కాలిఫోర్నియాకు మంచు తుపాను, వరద ముప్పు

లాస్‌ఏంజెలెస్: అమెరికాను మంచుతుపాను అతలాకుతలం చేస్తోంది. కాలిఫోర్నియాను శనివారం మధ్యాహ్నానికి ఎన్నడూ లేనంతటి వరదలు, తీవ్ర మంచు తుపాను చుట్టుముట్టే ప్రమాదముందని వాతావరణ విభాగం హెచ్చరించింది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. లాస్‌ఏంజెలెస్ కొండ ప్రాంతాల్లో 5 అడుగుల మేర మంచు కురియవచ్చని, గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ఇళ్లకే పరిమితం కావాలని కోరింది. మంచు తుపాను ఈ వారమంతా కొనసాగుతుందని పేర్కొంది. ఒరెగాన్ నగరంలో చాలా భాగం అడుగు మేర మంచు కురిసింది. పోర్ట్‌లాండ్‌లో అకస్మాత్తుగా కురిసిన మంచుతో ట్రాఫిక్ జామైంది. కరెంటు లైన్లు తెగిపోవడంతో సరఫరా నిలిచింది. స్కూళ్లు మూత బడ్డాయి. 10 లక్షల నివాసాలు, వ్యాపార సంస్థలు చీకట్లో మగ్గాయి. మిషిగన్, ఇలినాయీ, కాలిఫోర్నియా, న్యూయార్క్, విస్కాన్సిన్‌ల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా రెండు వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి.

వ్యాను, ట్రక్కు ఢీ: 11 మంది మృతి

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలోడా బజార్–భాటాపారా జిల్లాలో శుక్రవారం పికప్ వ్యాను, ట్రక్కు ఢీకొన్న ఘోర ప్రమాదంలో 11 మంది మరణించారు. 12 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు చిన్నారులు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.1.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాయి.

భారత్ పయనాన్ని ఎవరూ ఆపలేరు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

న్యూఢిల్లీ: వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తిరుగులేని శక్తిగా భారత్ ఎదుగుతోందని, ఈ పురోగతిని ఎవరూ ఆపలేరని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐఏఆర్ఐ) 61వ స్నాతకోత్సవంలో ప్రసంగించారు. 'ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు భారత్ ఎంతో శ్రమించింది. మన ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నెముక. మన ఎదుగుదలను అంతా అబ్బురంగా చూస్తున్నారు'' అన్నారు.

పీరియడ్ లీవ్ విధానపర నిర్ణయం: సుప్రీం

న్యూఢిల్లీ: విద్యార్థినులకు, ఉద్యోగినులకు పీరియడ్స్ సమయంలో ప్రత్యేకంగా సెలవు మంజూరు చేసేలా రాష్ట్రాలను ఆదేశించాలన్న పిల్‌పై విచారణకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం నిరాకరించింది. ఇది ప్రభుత్వాలు తీసుకోవాల్సిన విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసింది. పిటిషన్‌దారు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖకు ఈ మేరకు విజ్ఞప్తి చేసుకోవచ్చని సూచించింది.



రష్యా దురాక్రమణ మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా కీవ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని చేబూనిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ. సైనికుడు పతాకాన్ని ముద్దాడుతున్న దృశ్యం

ఉక్రెయిన్‌పై తీర్మానానికి భారత్ దూరం

ఐరాస: ఉక్రెయిన్‌లో యుద్ధానికి తక్షణం తెర పడి సమగ్ర, శాశ్వత శాంతి నెలకొనాల్సిన అవసరముందంటూ ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ గురువారం చేసిన తీర్మానానికి భారత్ దూరంగా ఉంది. తీర్మానంలోని వ్యవస్థాగతమైన పరిమితుల వల్ల ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం 193 సభ్య దేశాల్లో మరో 31 దేశాలు భారత్ బాటన నడిచాయి. తీర్మానానికి అనుకూలంగా 141 ఓట్లు, వ్యతిరేకంగా ఏడు ఓట్లు వచ్చాయి. దీనికి మద్దతివ్వాల్సిందిగా ఉక్రెయిన్‌తో పాటు అమెరికా, జర్మనీ తదితర దేశాలు భారత్‌ను కోరాయి. రష్యా, ఉక్రెయిన్ రెండింటికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి మనం కనీసం దగ్గరగానైనా వచ్చామా అన్నది ఆలోచించాల్సిన అంశమని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంభోజ్ ఈ సందర్భంగా సూచించారు. ''ఇరుపక్షాలనూ భాగస్వాములను చేయని ప్రక్రియతో ఫలితముంటుందా? ప్రపంచ శాంతిభద్రతలకు ఎదురవుతున్న సవాళ్ల పరిష్కారంలో ఐరాస భద్రతా మండలి విఫలమవుతుండటం చేదు నిజం కాదా?'' అని ప్రశ్నించారు. ''ఉక్రెయిన్ పరిణామాలపై భారత్ ఎంతో ఆందోళన చెందుతోంది. సమస్యకు చర్చలే పరిష్కారమన్నదే ముందునుంచీ భారత్ వైఖరి'' అని గుర్తు చేశారు. ఉక్రెయిన్‌పై గతంలో ఐరాస చేసిన తీర్మానాలకు కూడా భారత్ దూరంగానే ఉంది.



కొట్టుకుంటూనే ఉన్నారు...

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక సందర్భంగా శుక్రవారమూ గొడవ పడుతున్న ఆప్, బీజేపీ కౌన్సిలర్లు

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



సుర్రుమనే ఎండల్లో తిరిగి వచ్చి మట్టి కుండలోని గ్లాసుడు చల్లని నీరు తాగితే ఆ మజానే వేరు. శుక్రవారం బెంగళూరులోని యడియూరు వార్డులో కుండలు కొంటున్న మహిళలు

న్యూస్‌రీల్

27న శివమొగ్గలో ట్రాఫిక్ ఆంక్షలు

శివమొగ్గ: శివమొగ్గ నగరంలో నూతన విమానాశ్రయం ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీ వస్తుండడం, ఈ కార్యక్రమానికి లక్షలాది మంది ప్రజలు హాజరవుతుండడంతో ఈ నెల 27న నగర వ్యాప్తంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ జిల్లా పాలన యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. శివమొగ్గ నగరంతో పాటు నగర శివార్లలో జీరో ట్రాఫిక్, ట్రాఫిక్ మార్గాలలో మార్పులు చేస్తూ జిల్లాధికారి ఆర్. సెల్వమణి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 26, 27 తేదీలో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎంఆర్ఎస్ సర్కిల్ నుంచి ఎస్ఆర్ పుర రోడ్డు లక్కినకొప్ప సర్కిల్ వరకు, మత్తూరు-మండేనకొప్ప-సోగాన విమానాశ్రయం వరకు జీరో ట్రాఫిక్‌ను అమలు చేస్తున్నారు. అదే విధంగా 27వ తేదీ నగరంలో పలు మార్గాల్లో రాకపోకలను మళ్లించారు.

అడవిదున్న దాడిలో గొర్రెల కాపరి బలి

దొడ్డబళ్లాపురం: గొర్రెల కాపరిని అడవి దున్న బలి తీసుకున్న సంఘటన కనకపుర తాలూకా శివనహళ్లిదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. నాగనాయక్ (65) మృతి చెందిన గొర్రెల కాపరి. నాగనాయక్ గ్రామం శివారులో అటవీ ప్రాంతంలో గొర్రెలు మేపుతుండగా హఠాత్తుగా వచ్చి మీదపడ్డ అడవి దున్న పొడిచి చంపింది. నాగనాయక్‌తో పాటు గొర్రెలు మేపుతున్న పాపన్న నాయక్ దున్న దాడి నుంచి అదృష్టవశాత్తు తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఉత్తమ ప్రజాకీయ పార్టీకి ఆటో రిక్షా గుర్తు

శివాజీనగర: నటుడు ఉపేంద్ర స్థాపించిన ఉత్తమ ప్రజాకీయ పార్టీకి ఆటో గుర్తును కేటయించింది. ఈ విషయాన్ని ఉపేంద్ర ట్విట్టర్‌లో వెల్లడించారు. ఉత్తమ నాయకత్వం, బాధ్యతలు తీసుకుంటున్నానని, మీకు నమ్మకం ఉంటే ఎన్నికల్లో ఉత్తమ ప్రజాకీయ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

ఇద్దరు కార్మికుల దుర్మరణం

దొడ్డబళ్లాపురం: టిప్పర్‌లోకి ఇటుకలు లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ ప్రెస్ ఫెయిలై ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటన మాగడి తాలూకా సోలూరు గ్రామం వద్ద ఉన్న ఆర్‌కేబీ ఇటుకల ఫ్యాక్టరీలో జరిగింది. కార్మికులు రోజులాగే శుక్రవారం టిప్పర్‌లోకి ఇటుకలు లోడ్ చేస్తుండగా హైడ్రాలిక్ హఠాత్తుగా పడిపోయింది. దీంతో హైడ్రాలిక్ కింద చిక్కుకుని ఏపీలోని మహేశ్ (30), తుమకూరుకు చెందిన కాంతరాజు (45) మృతి చెందారు. నరసింహమూర్తి అనే మరో కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. కుదూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. క్షతగాత్రుడిని బెంగళూరు విక్టోరియాకు తరలించారు.

లోకాయుక్త తనిఖీలు

యశవంతపుర: బెంగళూరులోని ఉద్యానశాఖ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, ఎంఎస్ బిల్డింగ్‌లోని ఉద్యానశాఖ ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో లోకాయుక్త అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టి అనేక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. విజయపురకు చెందిన మల్లనగౌడ పంచమ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఉద్యానవనశాఖకు అవసరమైన పరికరాలను సమకూర్చే సంస్థను స్థాపించారు. అయితే సంస్థను రిజిస్ట్రేషన్ చేయటానికి ఉద్యానవన శాఖ అధికారులు నిరాకరించారు. అనేక సార్లు అఫీసు చుట్టు తిరిగినా ప్రయోజనం కనిపించలేదు. డబ్బులిస్తే పని చేయిస్తామని అధికారులు సతాయించారు. దీంతో మల్లనగౌడ లోకాయుక్తను ఆశ్రయించగా తనిఖీలు జరిగాయి.

పేదల సంక్షేమానికి శ్రమించాం



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై

- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్
- సీఎం బసవరాజ బొమ్మై

బనశంకరి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం శ్రమించిందని, ఈక్రమంలో అనేక పథకాలు అమలు చేశామని ముఖ్యమంత్రి బొమ్మై వెల్లడించారు. 2023–24 బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా పరిషత్‌లో సీఎం మాట్లాడారు. ప్రవేశపెట్టిన పథకాల్లో 90 శాతం పూర్తి చేశామని, మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కోవిడ్‌కు ముందు అనంతరం రోజులతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కంటే తక్కువగా అప్పులు చేశామన్నారు. 2009–14 వరకు యుపీఏ అవధిలో రూ.39,828 కోట్లు కేంద్ర పథకాలకు అందాయన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వ మొదట అవధిలో 2014 నుంచి 2019 వరకు రూ.74,373 కోట్లు నిధులు అందగా 2019 ఏడాది జనవరి చివరి నాటికి రూ.73,163 కోట్లు అందాయని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ద్వారా ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పేదలు, రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. కోవిడ్ సంక్లిష్ట సమయంలో రూ.30 వేల కోట్ల జీఎస్టీ పరిహారం కోల్పోయినా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు తీసుకుని పరిహారం చెల్లించిందన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. రైతుల కోసం రైతుశక్తి పథకం ప్రకటించగా 53 లక్షల మందికి లబ్ధి జరగనుందన్నారు. రైతు విద్యానిధి పథకం ద్వారా 10 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. మహిళల సంక్షేమం, పిల్లలు, ఆరోగ్యం, విద్యతోపాటు మౌలిక సదుపాయాలకు కేటాయింపులు పెంచితే ఆరోగ్యవంత సమాజం నిర్మితమవుతుందన్నారు.

తుది శ్వాస వరకు పార్టీకి సేవ

- మాజీ సీఎం యడియూరప్ప

శివాజీనగర: ఇకపై ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని, తుది శ్వాస వరకు పార్టీ సేవకు అంకితమవుతానని మాజీ సీఎం, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప వెల్లడించారు. శుక్రవారం ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇదే తన చివరి అసెంబ్లీ సమావేశమని, తాను ఈ స్థాయికి ఎదిగేందుకు ఆర్ఎస్ఎస్ కారణమన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ తనకు ఆదర్శమని తెలిపారు. పురసభ సభ్యుడి నుంచి సీఎం వరకు అంచెలంచెలుగా ఎదిగానన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయితో కలసి పర్యటించే అవకాశం దక్కిందన్నారు. రైతులకు న్యాయం లభించనప్పుడు విధానసభలో కూర్చొని నిరసన తెలిపినట్లు గుర్తు చేశారు. ఆ సమయంలో ఎస్ఎం కృష్ణ తన నిరసనకు స్పందించి రైతులకు పరిహారం అందించారని గుర్తు చేశారు. తాను బతికి ఉన్నంతవరకూ శికారిపుర ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానన్నారు. ప్రతిపక్ష నేత, మాజీ సీఎం సిద్ధరామయ్య పాలనను పేరు పెట్టేందుకు సాధ్యపడదని ప్రశంసించారు. ప్రస్తుత సీఎం బసవరాజ్ బొమ్మై చేపట్టిన పథకాలను కొనియాడారు. అనంతరం విధానసౌధ వద్ద మహాత్మా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రమంతటా పర్యటించి బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తానన్నారు.

కలాసీపాళ్య నూతన బీఎంటీసీ బస్టాండ్ ప్రారంభం

బనశంకరి: బెంగళూరు నగర నడిబొడ్డున రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన కలాసీపాళ్య నూతన బీఎంటీసీ, కేఎస్ ఆర్టీసీ, ప్రైవేట్ బస్టాండును శుక్రవారం సీఎం బసవరాజ బొమ్మై, మంత్రులు ఆర్. అశోక్, మునిరత్న శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని పలుప్రాంతాలకు ప్రైవేటు బస్సులతో పాటు ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ప్రైవేటు బస్సుల రవాణాకు ఈ బస్టాండు ఎంతో ఉపయోగకరంగా మారింది. కార్యక్రమంలో బీఎంటీసీ సంస్థ అధ్యక్షుడు నందీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



బీఎంటీసీ బస్సును ప్రారంభిస్తున్న సీఎం బొమై

ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

- జీ- 20 దేశాల ఆర్థిక మంత్రుల సదస్సులో
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

సాక్షి బెంగళూరు: పెరిగిపోతున్న రుణాలు, అంతర్జాతీయ రుణ ఎగవేతలపై జీ-20 దేశాలు పరస్పర సహకారం అందించుకుని వాటిని నియంత్రించాలని భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. జీ-20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్స్ గవర్నర్స్ సమావేశం బెంగళూరులో శుక్రవారం జరిగింది.అంతర్జాతీయ ఆర్థిక ఆర్కిటెక్చర్, సుస్థిర ఆర్థికాభివృద్ధి, మౌలిక వసతులపై చర్చ జరిగింది. నిర్మల సీతారామన్ మాట్లాడుతూ ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి ప్రపంచస్థాయి సంస్థలు 21వ శతాబ్దంలో ఎదురవుతున్న గ్లోబల్ చాలెంజెస్‌ను ఎదుర్కోవడంపై దృష్టి సారించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రుణ ఎగవేతలపై గతేడాది డిసెంబర్‌లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మాల్‌పాస్ ఆందోళన వ్యక్తంచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరికానికి దారి తీసే ప్రమాదం కూడా పొంచి ఉందని హెచ్చరించారు. అమెరికా ట్రెజరరీ కార్యదర్శి జనెట్ ఎల్లెన్, జపాన్ ఆర్థిక మంత్రి షునిచి సుజుకి, ఇటలీ ఆర్థిక మంత్రి జియాన్‌కార్లో జార్జెట్టీలతో సమావేశమై క్రిప్టో కరెన్సీ నియంత్రణకు పలు మార్గదర్శకాలు విడుదల చేయాలని సూచించారు. ఇదేసమయంలో ఇండోనేషియా, కెనడా, స్పెయిన్, అర్జెంటీనా తదితర దేశాల ప్రతినిధులతో కూడా ఆమె చర్చించారు.

బీజేపీ నేతలతో అమిత్‌షా సమాలోచనలు

శివాజీనగర: ఒక రోజు పర్యటన నిమిత్తం గురువారం కర్ణాటకకు విచ్చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రాష్ట్ర బీజేపీ నాయకులు భేటీ అయ్యారు. శుక్రవారం బెంగళూరునుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్లే ముందు రేస్‌కోర్స్ రోడ్డులో ఉన్న తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో అమిత్‌షాను సీఎం బసవరాజ బొమ్మై, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్, రాష్ట్ర ఇన్‌చార్జి అరుణ్‌సింగ్, బీజేపీ జాతీయ ఆర్గనైజింగ్ ప్రధానకార్యదర్శి బీఎల్ సంతోష్, రాష్ట్ర హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర భేటీ అయ్యారు. కాగా బీజేపీ సీనియర్ నేత యడియూరప్ప అమిత్‌షాను భేటీ చేయకుండా తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్ రోడ్డు మీదుగా విధానసౌధకు వెళ్లారు. విధానసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అమిత్‌షా నేతలకు సూచనలను ఇచ్చారని సమాచారం. అనంతరం అమిత్‌షా మధ్యప్రదేశ్‌కు వెళ్లేందుకు హెచ్.ఏ.ఎల్ విమానాశ్రయానికి వెళ్లారు. సీఎం బొమ్మై, హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్ అమిత్‌షాకు వీడ్కోలు పలికారు.

రథోత్సవం తిలకిస్తుండగా కూలిన మిద్దె

11 మందికి గాయాలు



మహిళకు చికిత్స చేస్తున్న వైద్యులు

ఆలూరు రూరల్/హొళగుంద: ఆలూరు మండలం గూళ్యం గ్రామంలో శుక్రవారం జరిగిన గాదిలింగప్ప తాత రథోత్సవలో అపశ్రుతి చోటుచేసుకుంది. సత్రం మిద్దెపై నుంచి రథోత్సవాన్ని తిలకిస్తుండగా ఒక్కసారిగా మిద్దె కూలడంతో 11 మందికి గాయాలయ్యాయి. హొళగుంద గ్రామానికి చెందిన హనుమంతమ్మ, మంగమ్మ, చంద్రమ్మ, మంజమ్మ, కర్ణాటకలోని అగసనూరుకు గ్రామానికి చెందిన గౌరమ్మ, పద్మ, రాధిక, నాడంగ గ్రామానికి చెందిన యంకమ్మ, రారావి గ్రామానికి చెందిన పవిత్ర, ఆలూరు మండలం హత్తిబెళగల్ గ్రామానికి చెందిన నాగమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను హొళగుంద పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. హనుమంతమ్మ, చంద్రమ్మ, బాలికలు రాధిక, పవిత్రలను బళ్లారికి తరలించారు. పాత మిద్దెపై దాదాపు 50 మందికి పైగా ఎక్కడంతో కూలిందని అధికారులు తెలిపారు. హాలహర్వి మండల తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంటోని, ఎస్ఐ విజయ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు.

కాన్పు కోసం వెళ్తే ఆస్పత్రి మూత

- వైద్యశాల ఎదుటే ప్రసవమైన మహిళ

సాక్షి,బళ్లారి: సర్కార్ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు అంటూ వైద్యాధికారులు, వైద్యులు నిత్యం చెబుతుండే మాటలు. అయితే క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కళ్లెదుటే ఆస్పత్రులు ఉన్నా రోగులకు వైద్యం అందడం లేదు. ఒక మహిళ పురిటినొప్పులతో కాన్పు కోసం రాగా ఆస్పత్రిమూసి ఉంది. దీంతో ఆమె ఆస్పత్రి ముందే ప్రసవమైంది. వైద్యుల నిర్లక్ష్యానికి ఈఘటన అద్దం పట్టింది. వివరాలు.. విజయపుర జిల్లా నాగఠాణలోని చౌహాన్‌దొడ్డికి చెందిన మహిళకు శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఆస్పత్రిని మూసి వేశారు. అప్పటికే నొప్పులు అధికంగా ఉన్న ఆ గర్భిణి ఆస్పత్రి ముందే ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ కుమారుడు ఆరోగ్యంగా ఉన్నారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరు, నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశీస్సులతో మళ్లీ కలుసుకుందాం



అసెంబ్లీ చివరి సమావేశాలు ముగియడంతో బయటకు వెళ్తున్న సభ్యులు

- ముగిసిన 15వ శాసనభ చివరి సమావేశాలు
- మహనీయులను స్మరించుకున్న సభ
- అనుభవాలను గుర్తు చేసుకున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

బనశంకరి: 15వ శాసనసభ చివరి సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శాసనసభలో అధికార, విపక్ష సభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేశామనే సంతృప్తిని సభ్యులు వ్యక్తం చేసి పరస్పరం శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుకున్నారు. రాష్ట్ర ప్రజలు ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచి మళ్లీ సభలోకి అడుగుపెడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయం ముగియగానే స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి సభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, మాజీ సీఎం బీఎస్.యడియూరప్ప, న్యాయశాఖమంత్రి మాధుస్వామి, కాంగ్రెస్ సభ్యుడు యుటీ.ఖాదర్, జేడీఎస్ సభ్యుడు బండెప్ప కాశంపూర్‌తో పాటు సభకు హాజరైన చాలా మంది సభ్యులు తమ హయాంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కొన్ని సందర్భాల్లో సభలో ఆవేశంగా ప్రసంగించినా అది ప్రజల సంక్షేమం కోసమేనని పలువురు సభ్యులు పేర్కొన్నారు. సీఎం బసవరాజ బొమ్మై మాట్లాడుతూ దేశాభివృద్ధికి నెహ్రూ, గాంధీ, అంబేడ్కర్‌తో పాటు పలువురు మహనీయులు గట్టి పునాది వేశారన్నారు. మాజీ సీఎం నిజలింగప్ప, సాహుకార్ చెన్నయ్య, అందానప్పమేటీ కర్ణాటక ఏకీకరణకు కృషి చేశారని, విధానసౌధ నిర్మించిన కెంగెల్ హనుమంతయ్య తదితరులు రాష్ట్రాభివృద్ధికి అందించిన సేవలను గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు పెంపు చారిత్రక నిర్ణయమన్నారు.15వ శాసనసభ విజయవంతం కావడానికి స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరి పాత్ర చాలా కీలమన్నారు. మంత్రులు, సీనియర్ల సలహాలు, అనుభవాలు, సూచనలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. యడియూరప్ప సహకారంపై కొనియాడారు. విపక్షనేత సిద్ధరామయ్య సహకారాన్ని ప్రస్తావించారు.

ప్రతి ఒక్కరికీ పది కిలోల బియ్యం

శివాజీనగర: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటికే పలు భరోసాలిచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ నేడు 3వ హామీ ప్రకటించింది. పేద కుటుంబంలో ప్రతి సభ్యుడికి 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామని చెప్పింది. శుక్రవారం కేపీసీసీ కార్యాలయంలో పార్టీ రాష్ట్రాధ్యక్షుడు డీ.కే.శివకుమార్, శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య, ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎం.బీ.పాటిల్‌తో పాటుగా ఇతర సభ్యులు సంయుక్తంగా జరిపిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. నిత్యావసర ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు అనుకూలంగా ఉండే విధంగా అన్నభాగ్య ప్రకటిస్తున్నామని చెప్పారు.

అవినీతిలో మునిగి తేలుతున్నారు : సిద్ధు

ఆర్కావతితో పాటుగా ఏది కూడా డీ నోటిఫికేషన్ చేయలేదని ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మైపై ఎదురు దాడికి దిగారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చకు సమాధానమిచ్చే సందర్భంలో సీఎం బొమ్మై, సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయిన సందర్భంలో రీడు పేరుతో 8 వేల కోట్ల అవినీతి చోటు చేసుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కేపీసీసీ కార్యాలయంలో అత్యవసర విలేకరుల సమావేశం నిర్వహించిన సిద్ధరామయ్య, సీఎంపై ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై ప్రభుత్వం 40 శాతం కమీషన్, అవినీతిలో నిమగ్నమైందని మీరు చేసిన ఆరోపణలకు కుట్రపన్ని ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు.

బీజేపీ ప్రగతి రథయాత్రకు శ్రీకారం

బనశంకరి: విధానసభ ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా శుక్రవారం ప్రగతి రథ యాత్ర పేరిట ప్రచార యాత్రను ప్రారంభించింది. 135 ప్రగతి రథ వాహనాలు 224 విధానసభ నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు. ఎల్ఈడీ తెరలు కలిగిన ఈ వాహనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన విజయాలను ప్రదర్శించనున్నాయి. బెంగళూరు దక్షిణ లోకసభ పరిధిలోని బీటీఎం లేఔట్ నియోజకవర్గంలో బీజేపీ ప్రగతి రథ యాత్రను ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు నళీన్‌కుమార్‌కటీల్, ఎంపీ తేజస్వి సూర్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సాధనలను ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడుగుతామన్నారు. బెంగళూరు నగరంలో అన్నివార్డుల్లో నమ్మక్లినిక్ ఏర్పాటుచేశామన్నారు. రాజకాలువల అభివృద్ధికి రూ.2వేల కోట్లు కేటాయించామన్నారు.



ప్రగతిరథయాత్ర ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

శాటిలైట్‌టౌన్, రింగ్‌రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదలచేసిందన్నారు. బెంగళూరు సిటీలో అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో రూ.7,500 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ పర్యాయం బీటీఎంలేఔట్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. యువమోర్చా అధ్యక్షుడు నందీశ్, బెంగళూరు దక్షిణశాఖ బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్య కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



బంగారు పతకాలతో విద్యార్థులు

యశవంతపుర: దేశాభివృద్ధికి సాంకేతిక విద్య ప్రముఖ పాత్ర వహిస్తున్నట్లు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అన్నారు. బెళగావి విశ్వేశ్వరయ్య టెక్నికల్ వర్సిటీ (వీటీయూ) జ్ఞానసంగమ సభాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వర్సిటీ 22వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాంకేతిక విద్యతో యువతలో నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. పరిశోధన, నాణ్యమైన విద్యకు భారతరత్న విశ్వేశ్వరయ్య స్మరణార్థం 1998లో స్థాపించిన వీటీయూ సాంకేతిక విద్యారంగంలో మైలురాయిగా నిలిచిందన్నారు. అనంతరం విద్యార్థులను గవర్నర్ అభినందించి డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు అందించారు.



కలబుర్గిలో శుక్రవారం నిర్వహించిన కల్యాణ కర్ణాటక ఉత్సవంలో భాగంగా శ్రీరామ ఆంజనేయ వేషధారణలతో ఊరేగింపుగా వస్తున్న కళాకారులు



తిరుమల నుంచి వచ్చిన శ్రీవారి ప్రచార రథం



పూజలు చేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్

నమో వేంకటేశా...

బనశంకరి: యలహంకలోని ఆర్‌డబ్ల్యూఎస్ క్రికెట్ స్టేడియంలో శనివారం శ్రీనివాస కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎస్ఆర్. విశ్వనాథ్, విశ్వవాణి ఫౌండేషన్ అధ్యక్షురాలు వాణిశ్రీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. కాగా శుక్రవారం తిరుమలనుంచి విచ్చేసిన శ్రీవారి ప్రచార రథాన్ని ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ ప్రారంభించారు.

క్లుప్తంగా

జోడు రథోత్సవ పాదయాత్ర



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

కంప్లి: శివశరణుల రథోత్సవాల్లో పాదయాత్ర ద్వారా పాల్గొనడం జీవితంలో మర్చిపోలేనని మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం శివశరణులు గాదిలింగేశ్వర తాత, సిద్ధేశ్వర స్వామిల జోడు రథోత్సవాల సందర్భంగా కోళూరు క్రాస్ వద్దగల బన్నిమహంకాళి దేవస్థానం నుంచి పాదయాత్ర ప్రారంభించి తనతో పాటు భక్తులు కూడా పెద్ద ఎత్తున పాల్గొనడం భక్తికి నిదర్శనమని, శివశరణులు వారిని సదా కాపాడాలని కోరుకుంటున్నానన్నారు.

సినీ నటులకు సన్మానం



సన్మానం స్వీకరిస్తున్న నటులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలో గురు రాఘవేంద్రుల పాదుకా పట్టాభిషేక ఉత్సవాల్లో భాగంగా కన్నడ సినీ నటులను సన్మానించారు. గురువారం రాత్రి మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగల్ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేష్, నటి రచితా రామ్‌లకు శాలువాలు కప్పి మొమెంటోను అందించి సన్మానించారు.

వంతెన మరమ్మతుల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీ, అధికారులు

రాయచూరు రూరల్: కర్ణాటక–తెలంగాణల మధ్య జాతీయ రహదారి–167లో కృష్ణా నదిపై వారధిగా ఉన్న పాత వంతెనకు చేపట్టిన మరమ్మతు పనులను శుక్రవారం రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. 22వ తేదీ నుంచి చేపట్టిన మరమ్మతు పనులను సకాలంలో శనివారం సాయంత్రానికల్లా పూర్తి చేసి తిరిగి ప్రజలు, వాహనాల సంచార పునరుద్ధరణకు వీలు కల్పించాలని అధికారులకు సూచించారు.

బడి పిల్లల భద్రత ముఖ్యం

కంప్లి: బడి పిల్లల భద్రత చాలా ముఖ్యమని హొసపేటె బీఈఓ చెన్నబసప్ప మగ్గద సూచించారు. ఆయన శుక్రవారం రెండు రోజుల క్రితం జరిగిన పాఠశాల బస్సు ప్రమాదంపై స్పందించి పాత్రికేయులతో మాట్లాడారు. యాజమాన్యాలు స్కూలు పిల్లల బస్‌లను కండీషన్‌లో పెట్టుకోవాలన్నారు. అర్హులు, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని, సీట్లకు తగ్గట్టుగా పిల్లలను కూర్చోపెట్టాలని, బస్సులో ఎక్కించే, దింపే సమయంలో ముందు జాగ్రత్తతో వ్యవహరించి సురక్షితంగా ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకోవాలని విద్యాసంస్థల ప్రముఖులకు సూచించామన్నారు. ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థులు, విద్యా సంస్థల ప్రముఖులు కృషి చేయాలని తెలిపారు.

సత్పౌరులుగా తీర్చిదిద్దాలి



జ్యోతి వెలిగిస్తున్న జడ్జి మారుతి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతి పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ వర్సిటీలో రేస్ చాణుక్య పాఠశాలలో విద్యార్థులు వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు పాఠ్యేతర విషయాలను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు లలిత, తాలూకా విద్యా శాఖాధికారి చంద్రశేఖర్, రవి, శ్రీలత, వెంకటేష్, శ్రీధర్‌రెడ్డి, పరిమళరెడ్డి, వీరభద్రప్ప, పురుషోత్తంలున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందిస్తున్న దృశ్యం

కంప్లి: తాలూకాలోని హోసూరు జవుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గ్రంథాలయానికి శుక్రవారం బీడీసీసీ బ్యాంక్ వ్యవస్థాపకులు జీరిగనూరు మారుతి 75కు పైగా పుస్తకాలను అందించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శంకరలింగప్ప, ఉప్పనమేటి గౌడ్రు, ఉపాధ్యాయులు కే.మాలిక్, పీ.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి సిటీ..టికెట్ కోసం పోటాపోటీ

- రేసులో నారా భరత్‌రెడ్డి, అల్లం ప్రశాంత్, జేఎస్ ఆంజనేయులు
- ఢిల్లీలో మకాం వేసి మాజీ ఎమ్మెల్యే అనిల్‌లాడ్ ప్రయత్నాలు



నారా భరత్‌రెడ్డి



అల్లం ప్రశాంత్



జే.ఎస్ ఆంజనేయ



అనిల్‌లాడ్

సాక్షి,బళ్లారి: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుండటంతో బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల్లో తీవ్ర పోటీ నెలకొంది. దాదాపు 15 మందికి పైగా పేర్లను కేపీసీసీకి పంపించగా వారిలో నుంచి ముగ్గురి పేర్లను ఏఐసీసీకి పంపారు. మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి తనయుడు టచ్‌ఫర్ లైఫ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, మాజీ జెడ్పీ మెంబరు నారా భరత్‌రెడ్డి, మాజీ బుడా అధ్యక్షుడు జే.ఎస్.ఆంజనేయలతో పాటు మాజీ మంత్రి, మాజీ కేపీసీసీ అధ్యక్షుడు అల్లం వీరభద్రప్ప తనయుడు మాజీ జెడ్పీ మెంబర్ అల్లం ప్రశాంత్ పేర్లు తెరపైకి వచ్చాయి. నారా భరత్‌రెడ్డి తనకే టికెట్ దక్కుతుందనే ధీమాతో ఇప్పటికే నగరంలో ఇంటింటా కుక్కర్లను పంపిణీ చేయడంతో పాటు వీధి వ్యాపారులకు గొడుగులు కూడా అందజేసి ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉన్నారు.

ముందు వరుసలో భరత్‌రెడ్డి..

కేపీసీసీ, ఏఐసీసీ ముఖ్యులతో టచ్‌లో ఉంటూ ఎలాగైనా టికెట్ దక్కించుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు బరిలో నిలిచే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భరత్‌రెడ్డికి టికెట్ ఇచ్చే విషయంపై పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, కేఆర్‌పీపీ అభ్యర్థులు ఒకే సామాజిక వర్గం కావడంతో కాంగ్రెస్ తరఫున బలమైన లింగాయత్ సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే ఎలా ఉంటుందన్న విషయంపై కూడా ఆలోచన చేస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన అల్లం ప్రశాంత్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సన్నిహితుడు జేఎస్ ఆంజనేయ కూడా తనకే టికెట్ దక్కుతుందని గంపెడాశతో ఉన్నారు.

జోరుగా అనిల్‌లాడ్ పైరవీలు..

ఇక మాజీ ఎమ్మెల్యే అనిల్‌లాడ్ ఢిల్లీలో మకాం వేసి టికెట్ కోసం పైరవీలు చేస్తున్నారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరి క్షణంలో హైకమాండ్‌ను ఒప్పించి టికెట్ తీసుకుని వస్తానని తన అనుచరులతో చెప్పుకుంటున్నారు. ఈయన 2008లో బళ్లారి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోగా, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బళ్లారి నుంచి పోటీ చేసి తక్కువ ఓట్లతో ఓడిపోయినందున తనకు టికెట్ ఇస్తే ఖచితంగా గెలిచేందుకు అవకాశాలు ఉన్నాయని పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారు. నలుగురు అభ్యర్థులు బళ్లారి సిటీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు, పైరవీలు చేస్తుండటంతో ఎవరికి టికెట్ దక్కుతుందోనన్న విషయం ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

సైనికుని కుటుంబానికి సాయం



నగదును అందిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా సుంకేశ్వరాళలో సైనికుడు రామలింగ నాయక్ ఆకస్మిక మృతి నేపథ్యంలో ఆ కుటుంబానికి వ్యక్తిగత సాయంగా రూ.లక్ష నగదును రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అందించారు. శుక్రవారం సుంకేశ్వరాళ గ్రామంలోని జవాన్ ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఐదు ఎకరాల భూమిని అందించాలని మాన్వి తహసీల్దార్‌ను ఆదేశించారు.

పొలంలో మొసలి పట్టివేత



మొసలిని పట్టుకొని బంధించి తరలిస్తున్న గ్రామస్తులు, అటవీ శాఖాధికారులు

హొసపేటె: విజయనగర జిల్లా హూవినహడగలి తాలూకా తుంగభద్ర నదీ తీరంలోని పొలంలో సంచరిస్తున్న భారీ మొసలిని చూసి రైతులు పరుగులు తీశారు. శుక్రవారం ఉదయం రైతులు తమ పొలం పనులు చేసేందుకు వచ్చి మొసలిని చూసి భయాందోళనకు గురయ్యారు. రాజవాళ వద్దనున్న వరి పొలంలో మొసలి దాగి ఉంది. ఈ విషయం తెలియగానే వెంటనే గ్రామస్తులు అందించిన సమాచారంతో అటవీశాఖాధికారులు తమ సిబ్బందితో పాటు అక్కడికి చేరుకున్నారు. రైతుల సాయంతో పొలంలో దాగిన సుమారు 9 అడుగుల పొడవున్న మొసలిని పట్టుకొని బంధించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

కేఆర్‌పీపీకి ఓటమి తప్పదు



మాట్లాడుతున్న ఎస్ఆర్.హిరేమఠ

హుబ్లీ: కేఆర్‌పీపీకి ఓటమి తప్పదని సమాజ పరివర్తన సంస్థ ముఖ్యస్తులు ఎస్ఆర్.హిరేమఠ్ తెలిపారు. హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బళ్లారితో పాటు కొన్ని జిల్లాల్లో ప్రవేశానికి ఆయనపై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిందన్నారు. అలాంటి వ్యక్తి పార్టీ పెట్టడం, ప్రజా జీవన స్రవంతిలోకి రావడం సబబు కాదన్నారు. కొన్నేళ్ల క్రితం గాలి జనార్దన్‌రెడ్డి స్నేహితుడు, మంత్రి శ్రీరాములు బీఎస్ఆర్ పార్టీని ప్రారంభించారన్నారు. ఆ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవాలని అప్పట్లో తాను పాదయాత్ర చేపట్టానని గుర్తు చేశారు. ఆయనకు కూడా పరాజయం తప్పదన్నారు. ఇలాంటి వారి పార్టీకి ప్రజాస్వామ్యంలో ఎటువంటి స్థానం ఉండదన్నారు. కేంద్ర న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజిజు, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ న్యాయాంగ వ్యవస్థను అవమానించేలా వ్యవహరించారన్నారు. రాజ్యాంగ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. వీరు తమ పదవుల్లో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారన్నారు. వీరిపై వ్యతిరేక అభియాన్‌కు అందరూ సహకరించాలన్నారు.

ఘనంగా ఆలయ కలశ ప్రతిష్ఠాపన



కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న మంత్రి శ్రీరాములు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది కిష్కింధా క్షేత్రం మేగోటె దుర్గామాత ఆలయంలో శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బి.శ్రీరాములు దుర్గామాత కలశ స్థాపనను నెరవేర్చారు. ఈ సందర్భంగా రాజవంశస్తులు లలితారాణి శ్రీ రంగదేవరాయలు, రాజా కృష్ణదేవరాయ దంపతుల నేతృత్వంలో కలబురగి వేద పాఠశాల పరిమళ ఆచార్య బృందం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను దుర్గామాత మానసపుత్ర, దాసోహ రత్న బ్రహ్మానంద స్వామీజీ ఆధ్వర్యంలో శత చండీయాగాన్ని రాజా కృష్ణదేవరాయలు, శ్రీరాములు పీఏ రాజు, విజయ్ కుమార్ దంపతులు నిర్వహించారు. వేద పాఠశాల బ్రాహ్మణ బృందంతో పాటు వాజేంద్ర ఆచారి, బళ్లారి మాజీ ఎంపీ శాంత, ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, పార్టీ నాయకుడు సంతోష్ కేలోజీ, కళాకారుడు విష్ణు జోషి, శ్రీరామనగర్ హరిబాబు, మేనేజర్ రాజన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ శాఖ భవనం ప్రారంభం



భవనం ప్రారంభ పూజలో పాల్గొన్న ప్రముఖులు

కంప్లి: పట్టణంలోని బీడీసీసీ బ్యాంక్ కేఎస్ఎఫ్ శాఖ ఖాతాదారుల మెరుగైన సేవలందిస్తూ జిల్లాలోనే ఉత్తమ శాఖగా పేరొంది లాభాల బాటలో ఉందని బ్యాంక్ పాలక మండలి ఉపాధ్యక్షుడు గుండుముణుగు తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ముద్దాపుర అగసి వద్ద బ్యాంక్ కేఎస్ఎఫ్ శాఖ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేఎస్ఎఫ్ శాఖ రూ.19.21 కోట్ల డిపాజిట్లు సేకరించి రూ.11.12 కోట్ల కేసీసీ రుణం, రూ.2.30 కోట్ల వ్యక్తిగత రుణాలు, రూ.21.59 లక్షల రుణం, ఇంటి నిర్మాణానికి రూ.8.64 లక్షలు అందించి 2021–22వ సంవత్సరానికి గాను రూ.43.95 లక్షల లాభాలు గడించిందన్నారు. సహకార సంఘాల ఉపనిర్దేశకులు బీపీ. కేసరిమఠ, బ్యాంక్ డైరెక్టర్ టీఎం.చంద్రశేఖరయ్య, ఎల్‌సీ ఆనంద్, చిదానంద ఐగోళ, కోళూరు మల్లికార్జున, గురుసిద్దనగౌడ, భోగిరెడ్డి, క్షేత్రాధికారి బాలప్ప, లెక్కపరిశోధకులు యల్లణ్ణ గుర్ల తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

డిమాండ్ల సాధనకు 1 నుంచి సమ్మె



కలెక్టరేట్ ముందు కరపత్రాలను ప్రదర్శించి నినాదాలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

కోలారు : ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఒత్తిడి చేస్తూ మార్చి 1వ తేదీ నుంచి విధులకు గైర్హాజరు కావాలని ఉద్యోగులను జాగృతం చేయడానికి ఉద్యోగ సంఘం ప్రముఖులు శుక్రవారం కలెక్టరేట్ ముందు కరపత్రాలను ప్రదర్శించి అనంతరం డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు మాట్లాడుతూ తమ పోరాటానికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర, ఉపాధ్యాయు గెళెయర బళగ అధ్యక్షుడు నారాయణస్వామి, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్: ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని ఒత్తిడి చేస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం మార్చి 1వ తేదీ నుంచి విధులకు గైర్హాజరు కావడం ద్వారా నిరవధిక సమ్మెకు తీర్మానించినట్లు తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్ నరసింహమూర్తి, కార్యదర్శి రవి ప్రకాష్ తెలిపారు. వారు ప్రభుత్వ ఉద్యోగులను జాగృతం చేయడానికి సంఘం ప్రముఖులతో కలిసి శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలను పంచి పెట్టి మాట్లాడారు. ఆరోజు నుంచి విధులకు గైర్హాజరై సమ్మెలో పాల్గొనాలని ఉద్యోగులను కోరారు. ఈ సందర్భంగా సంఘం కోశాధికారి ఎస్ కృష్ణమూర్తి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వినోద్‌బాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని బైకిస్టు మృతి

మాలూరు : ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మరణించిన ఘటన హొసకోటె–మాలూరు రహదారిలో చోటు చేసుకుంది. తాలూకాలోని బనహళ్లికి చెందిన వెలవనహళ్లి జయరాం అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో భార్యతో కలిసి ఆమె పుట్టింటికి వెళ్లి భార్యను దింపి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జయరాం గతంలో బనహళ్లి జీపీ అధ్యక్షుడిగా పని చేశారు. జయరాంకు భార్య, కుమార్తె ఉన్నారు. మాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత భోజన క్యాంటీన్ ప్రారంభం



రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : రాబర్ట్‌సన్‌పేట ప్రభుత్వ ఆస్పత్రి ముందు శుక్రవారం భారతమాత ఉచిత క్యాంటీన్‌ను కమ్మసంద్ర జీపీ అధ్యక్షుడు సురేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం వచ్చే పేద రోగుల అనుకూలం కోసం ఈ క్యాంటీన్‌ను ప్రారంభించామన్నారు. నిత్యం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకు ఉచిత భోజనం అందిస్తారన్నారు. కార్యక్రమంలో రాబర్ట్‌సన్ పేట ఎస్ఐ భారతి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు శ్రీధర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

అపర దేశభక్తుడు ఛత్రపతి శివాజీ

- కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ



జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

గంగావతి రూరల్: హిందూ ధర్మ సంస్కృతి పరిరక్షణతో పాటు దేశ రక్షణ కోసం పోరాడిన శ్రేష్ఠ నాయకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ అన్నారు. నగరంలోని సాహిత్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శివాజీ స్వరాజ్యం అనే ఆలోచనలను సృష్టించిన హిందూ నాయకుడు శివాజీ తన తల్లి జీజాబాయి నుంచి ప్రేరణ పొందాడన్నారు. ఆమె చిన్నతనం నుంచి ఆయనకు నాయకత్వ లక్షణాలను బోధించిందన్నారు. శివాజీ మహారాజ్ దేశభక్తి లక్షణాలను ప్రతి హిందువు పెంపొందించుకోవాలన్నారు. నేటి పోటీ యుగంలో ప్రతి ఒక్కరూ చదువుకుని జ్ఞానవంతులు కావాలన్నారు. తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించాలన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ హేమలతా నాయక, కర్ణాటక మరాఠ అభివృద్ధి మండలి అధ్యక్షులు ఎం.జి. ముళె, సీనియర్ సాహితీవేత్త మజుందార్, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షులు మహంతేశ్ ఎస్.పాటిల్, ఏడీసీ సావిత్రి, నగరసభ సభ్యులు ముత్తురాజ్ కుష్టగి, విరుపాక్షప్ప, సివి చంద్రశేఖర్, వీరేశ్ మహంతయ్య, సోమశేఖర్ హిట్నాళ, సమాజ నాయకులు కమలేశ రావు, నాగేశ్ బడిగేర, మారుతి కారటగి, విశ్వనాథ అరకేరి, లక్ష్మణ, దినేశ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు



నిందితుడు భాస్కర్

హొసపేటె: మహిళ మెడలోని బంగారు తాళిని లాక్కొని పరారైన నిందితుడికి జేఎంఎఫ్‌సీ కోర్టు శిక్ష విధించింది. వివరాలు..2014 సెప్టెంబర్ 27న ఉదయం 5.25 గంటలకు నగరంలోని నెక్స్ ఎలక్ట్రానిక్స్ షూరూం వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని సుమారు రూ.1.30 లక్షల విలువ చేసే బంగారు తాళి గొలుసును నిందితుడు భాస్కర్ లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. ఈ ఘటనపై అప్పటి రూరల్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.రఘుకుమార్ నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఈ కేసును విచారించిన నగర జెఎంఎఫ్‌సి కోర్టు జడ్జి బి.కిషన్ మూడలగి నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు కేసు వాదించిన ప్రభుత్వ న్యాయవాది గీతా ఎస్.మీరజకర్ శుక్రవారం తెలిపారు.

నేత్రపర్వంగా కొట్టూరేశ్వర జాతర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంగావతి: పట్టణంలో శుక్రవారం కొట్టూరేశ్వర జాతర, రథోత్సవాన్ని ఘనంగా జరిపారు. దేవస్థానం వద్ద నుంచి కొట్టూరు స్వామి మఠం వరకు రథాన్ని లాగి తిరిగి దేవస్థానానికి చేర్చారు. ఉదయాన్నే కొట్టూరేశ్వర స్వామికి పలు రకాల అభిషేకాలు, పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు. రథోత్సవంలో నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వేలాది మంది భక్తులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో పురుగుల అన్నం

- విద్యార్థుల గోడు పట్టని వైనం



ఆహారంలో కనిపిస్తున్న పురుగులు

రాయచూరు రూరల్: జిల్లాలోని వివిధ సాంఘీక సంక్షేమ శాఖ హాస్టళ్లలో రాళ్లు, పురుగుల అన్నం వడ్డిస్తున్నా ఆ శాఖ ఉన్నతాధికారులు విద్యార్థుల గోడును పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నగరంలోని దేవరు కాలనీ, లింగసూగూరు, కసబా లింగసూగూరు, ముదుగల్, కవితాళ, జాడలదిన్ని, పోత్నాళల్లోని హాస్టళ్లలో గత మూడు రోజులుగా పురుగులతో కూడిన అన్నం పెట్టారని ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు వాపోయారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



భూమిపూజ చేపట్టిన ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: అసెంబ్లీ నియోజకవర్గంలోని ఇందరగిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.10 లక్షల నిధులతో ఇందిరేశ్వర దేవస్థాన నిర్మాణానికి, రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, రూ.1.40 కోట్లతో ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి ఆయన భూమిపూజ నెరవేర్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో ప్రజలు మరోసారి తనను ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. బీజేపీ నేత చెన్నప్ప మళిగి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

షాదీమహల్‌కు రూ.5 లక్షల విరాళం



విరాళం నగదును అందిస్తున్న రామేగౌడ

మాలూరు : పట్టణంలోని కుంబారపేటలో ముస్లిం సోదరులు నిర్మిస్తున్న షాదీమహల్‌కు జేడీఎస్ అభ్యర్థి జీఈ రామేగౌడ రూ.5 లక్షల విరాళాన్ని శుక్రవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు శుభకార్యాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడే షాదీ మహల్ కోసం తన వంతు ఆర్థిక సాయం అందించానన్నారు. తాను గత 20 ఏళ్లుగా తాలూకాలో సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానన్నారు. వచ్చే ఎన్నికలలో జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ముస్లిం సోదరులు మద్దతు తెలిపి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ, తాలూకా అధ్యక్షుడు బల్లహళ్లి నారాయణస్వామి, నగర అధ్యక్షుడు ఎం కె ఆనంద్, ఉపాధ్యక్షుడు కె వి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సౌకర్యాలపై సైకిల్ జాతా



సైకిల్ జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ప్రభుత్వ వివిధ సౌకర్యాలపై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రజలకు తగిన అవగాహన కలిగించాలని స్కౌట్స్ కమిషనర్ కె ఆర్ సురేష్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని సుభాష్ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థాపక దినోత్సవం సందర్భంగా సైకిల్ జాతాను ప్రారంభించి మాట్లాడారు. పరిసరాల స్వచ్ఛతపై కూడా ప్రజలను జాగృతం చేయాలన్నారు. జిల్లా సహకార్యదర్శి స్కౌట్స్ బాబు మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ సంస్థ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నారాయణస్వామి, సుధా, పదాధికారులు విఠల్‌రావు, ఉమాదేవి, విశ్వనాథ్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

తేనె పట్టు కోసం చెట్టు పైకెక్కిన ఎలుగుబంటి

హొసపేటె: తాలూకాలోని వెంకటాపుర గ్రామ శివార్లలో ఓ ఎలుగుబంటి చెట్టుమీద కూర్చొన్న దృశ్యం శుక్రవారం వైరల్‌గా మారింది. చెట్టు కొమ్మకు ఉన్న తేనెపట్టు కోసం ఎలుగుబంటి చెట్టుపైకెక్కి ఉండవచ్చని అటవీ శాఖాధికారులు తెలిపారు. సమాచారం అందగానే ఎలుగుబంటిని బంధించేందుకు అటవీ శాఖాధికారులు, సిబ్బంది అక్కడ బోనును ఏర్పాటు చేశారు.

ఉత్సవాలకు అభివృద్ధి నిధులా?

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటక గ్రామీణ అభివృద్ధి మండలి(కేకేఆర్‌డీబీ)కి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను కలబుర్గిలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న కళ్యాణ కర్ణాటక ఉత్సవాలకు రూ.5 కోట్లు వెచ్చించడాన్ని జన సంగ్రామ సమితి సంచాలకుడు రాఘవేంద్ర కుష్టగి ఖండించారు. శుక్రవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేకేఆర్‌డీబీ అధ్యక్ష పదవి చేపట్టిన దత్తాత్రేయ పాటిల్ రేవూర్ తనకు ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తూండడం దురదృష్టకరమని అన్నారు. రాయచూరుకు ఎయిమ్స్ మంజూరుకు ఎంపీ బాధ్యతలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా ఆలయ జీర్ణోద్ధరణ



ప్రత్యేక అలంకరణలో భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి

శ్రీనివాసపురం: బెళమారనహళ్లిలో వెలసిన భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణను ఆంజనేయ, మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపనను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో అష్టబంధన, గరుడ స్తంభ మహాసంప్రోక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఆలయంలో దేవతా ప్రార్థన, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, కుంభారాధన, ఉక్త హోమాలు, మహాపూర్ణాహుతి, మహామంగళారతి తదితర పూజలను ఆలయ అర్చకులు నెరవేర్చారు. పెద్ద సంఖ్యలో గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ జరిగింది.

ఈసారి గెలుపు నాదే

- వర్తూరు ప్రకాష్

కోలారు: నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకే ఈసారి విజయం సిద్ధిస్తుందని మాజీ ఎమ్మెల్యే వర్తూరు ప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిద్దరామయ్య కోలారు నుంచి పోటీ చేసినంత మాత్రాన తనకే మాత్రం నష్టం లేదన్నారు. సిద్దరామయ్య కోలారుకు వచ్చినప్పుడు మాత్రమే హడావిడి చేసే నాయకులు, కార్యకర్తలు ఆయన వెళ్లిన తరువాత కనిపించబోరన్నారు. కోలారు అసెంబ్లీ టికెట్ తనకు కాకుండా వేరే ఎవరికి ఇచ్చినా తాను స్వాగతిస్తానని, వారి విజయం కోసం శ్రమిస్తానని తెలిపారు. ఇటీవల తాను తమ సముదాయ స్వామీజీలతో కలిసి కాంగ్రెస్‌తో రాజీ చేసుకుంటున్నట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

ఈ సొత్తు దాఖలాల అందజేత

కోలారు : తాలూకాలోని కొండరాజనహళ్లి జీపీలోని పాఠశాలలకు ఈ సొత్తు దాఖలాలను శుక్రవారం అందించారు. పంచాయతీలోని 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ దాఖలాలను అందించి టీపీ ఈఓ మునియప్ప మాట్లాడారు. పీడీఓల సామాజిక నిబద్ధత ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. ఈ సొత్తు దాఖలాలను అందించడంలో సహకరించిన జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఈఓ కన్నయ్య, పీడీఓ రామకృష్ణప్ప, పంచాయతీ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, సభ్యుడు నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కంప్లి: అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని సండూరు ఎమ్మెల్యే ఈ.తుకారాం తెలిపారు. ఆయన శుక్రవారం సిద్ధమ్మనహళ్లి నుంచి ఏళుబెంచికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే గణేష్, తాను రామలక్ష్మణులం అన్నారు. ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు తథ్యమన్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ సాకారానికి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా సిద్ధమ్మనహళ్లి గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుస్తుల వ్యాపారి ఆత్మహత్య

మైసూరు: వ్యాపారంలో నష్టం రావడంతో దుస్తుల వ్యాపారి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాపోక్లు పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సకలేశపుర తాలూకా హెత్తూరు హోబళి హడ్లహళ్లి గ్రామానికి చెందిన హెచ్‌కే సందీప్ (40) 20 ఏళ్లుగా నాపోక్లులో ఆర్‌హెచ్ పేరుతో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం స్నేహితుడు సందేశ్‌కు కాల్ చేసి 9 గంటలకు ఇంటికి రావాలని సందీప్ కోరాడు. సందేశ్ ఇంటికి రాగానే సందీప్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అనంతరం సందేశ్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. భారీగా నష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు.

పగిలిన పైప్‌లైన్



మైసూరు: మైసూరు తాలూకా ఇలవాల హోబళి కె.హెమ్మనహళ్లి గ్రామంలో తాగు నీటిని సరఫరా చేసే పైపునకు రంధ్రం పడడంతో అధిక ప్రమాణంలో కావేరి నీరు వృథాగా పోతోంది. సుమారు 20 గ్రామాలకు తాగునీరు అందించే ఈ పైప్‌లైన్‌కు చీలిక ఏర్పడింది. ఏడెనిమిది రోజులుగా నిరంతరంగా నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. స్థానికులు ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా కంచె

- కనకపురలో వ్యక్తి నిర్వాకం



దొడ్డబళ్లాపురం: పబ్లిక్ తిరిగే రోడ్డుకు అడ్డంగా కంచె వేసిన వ్యక్తి రోడ్డు తనదంటూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన సంఘటన కనకపుర తాలూకా మత్తికుంట గ్రామంలో చోటుచేసుకుంది. మత్తికుంట గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి పంచాయతీ వారు తనకు సంబంధించిన స్థలంలో రోడ్డు వేసారని ఆరోపిస్తూ రోడ్డుకు అడ్డంగా కంచె వేసి వాహనాల రాకపోకలను నిర్బంధించాడు. దీంతో బస్సులు, కార్లు, ఇతర వాహనాలు గంటలకొద్దీ రోడ్డుకి రెండు వైపులా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వచ్చి రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్లు, ముళ్లచెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసికెళ్లారు.

మైసూరు జిల్లాలో విజయఢంకా మోగించాలి

మైసూరు: సొంత బలం మీద అధికారంలోకి రావాలంటే మైసూరు జిల్లా నుంచి అత్యధిక స్థానాలు గెలుపొందాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ పిలుపునిచ్చారు. నగరంలోని కర్ణాటక ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మైసూరు నగర, గ్రామీణ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను తెలియజేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నాయకుడు సిద్ధరామయ్య అనేక ఆరోపణలు చేశారని, అవన్నీ అసత్యాలు కాబట్టే ఏసీబీ, కోర్టు, లోకాయుక్తలో ఫిర్యాదు చేయడానికి కాంగ్రెస్ నేతలు సాహసించలేదన్నారు.

ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

బనశంకరి: పింఛన్ వంచనకు గురైన ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం విధానసౌధ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. పింఛన్ అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగి విధానసౌధ ముట్టడికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వీరిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పింఛన్‌తో పాటు వేతనం, జ్యోతి సంజీవిని డిమాండ్లు పరిష్కరించాలని పోరాటానికి దిగి శుక్రవారానికి 141 రోజుకు చేరుకుంది.

కృష్ణజింక పట్టివేత



జింకను పట్టుకున్న గ్రామస్తులు

తుమకూరు: ఆహారం కోసం వచ్చిన కృష్ణ జింకను కేపీటీసీఎల్, అటవీ అధికారులు రక్షించి అటవీధామంలో వదిలిపెట్టారు. మధుగిరి తాలూకా మిడగేశి హోబళి హోసకెరె గ్రామంలో కేపీటీసీఎల్‌కు చెందిన విద్యుత్ ప్రాంతానికి రాత్రి వేళ అకస్మాత్తుగా సుమారు రెండున్నరేళ్ల వయసున్న ఆడ కృష్ణ జింక వచ్చింది. ఈ విషయం తెలిసిన అటవీ శాఖ అధికారులు కృష్ణ జింకను పట్టుకున్నారు. స్వల్పంగా గాయపడిన దానికి ప్రాథమిక చికిత్స చేసి కొడిగెనహళ్లి హోబళి కృష్ణ జింకల సంరక్షిత ప్రాంతం మైదనహళ్లి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సీటీ రవి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- మాజీ ప్రధాని దేవెగౌడపై అనుచిత వ్యాఖ్యలు తగదు
- సీటీ దిష్టిబొమ్మ దహనం



సీటీ రవి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జేడీఎస్ నాయకులు

శివాజీనగర: మాజీ ప్రధాని, జేడీఎస్ దళపతి దేవెగౌడపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకుడు, ఎమ్మెల్యే సీటీ రవికి వ్యతిరేకంగా జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు విధాన పరిషత్ మాజీ సభ్యుడు హెచ్.ఎం.రమేశ్‌గౌడ నేతృత్వంలో ధర్నా చేపట్టారు. శుక్రవారం నగరంలోని మౌర్య హోటల్ వద్ద సీటీ రవి దిష్టిబొమ్మ దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవెగౌడ తమ పార్టీలో సుప్రీం, రాష్ట్రమంతా అపారమైన గౌరవం, అభిమానం ఉన్న మేరు నాయకుడు, ప్రధాని మోదీ సైతం అత్యంత గౌరవం చూపే నాయకుడు దేవెగౌడ, అటువంటి వ్యక్తిని సీటీ రవి చులకనగా మాట్లాడడం ఖండనీయమని రమేశ్ గౌడ ధ్వజమెత్తారు. దేశంలో ప్రధాని సీటును అలంకరించిన ఏకైక కన్నడిగుడు దేవెగౌడ, ఆయనను అవమానించటమంటే కన్నడిగులందరినీ అవమానించినట్లేనని, తక్షణం సీటీ రవి బేషరతుగా దేవెగౌడకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చిన్నస్వామి స్టేడియంలో సీఎం

యశవంతపుర: ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై శుక్రవారం చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న సినిమా సెలబ్రిటీలు ఆడుతున్న క్రికెట్ మ్యాచ్‌ను తిలకించారు. శాసనసభ సమావేశాలు శుక్రవారం సాయంత్రంతో ముగియగానే రెవెన్యూ మంత్రి ఆర్ అశోక్‌తో కలిసి సీఎం మ్యాచ్‌ను తిలకించారు. శుక్ర, శనివారం రెండు రోజుల పాటు సెలబ్రిటీల క్రికెట్ మ్యాచ్ జరుగనుంది.

మంత్రి సునీల్‌కు మైక్ షాక్

బనశంకరి: విధానసౌధలో శుక్రవారం మైక్ ఆన్ చేయగానే ఇంధనశాఖ మంత్రి సునీల్‌కుమార్‌కు స్వల్పంగా విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో కొద్దిసేపు సభలో కొంత గందరగోళం నెలకొంది. ఈ సమయంలో న్యాయశాఖమంత్రి మాదుస్వామి మాట్లాడుతూ పవర్ మినిస్టర్‌కు షాక్ కొట్టిందని హాస్య మాడారు, సభలో ఇంధనశాఖ మంత్రి బిల్లు ప్రవేశపెట్టడానికి నిలబడగా మైక్ ఆన్ చేయగానే చిన్నగా షాక్ తగిలినట్లు తెలిసింది.

ఆప్‌కు మద్దతు ఇస్తే అవినీతి రహిత పాలన



మాట్లాడుతున్న పృథ్వీరెడ్డి

బాగేపల్లి: అవినీతి లేని పాలన కోసం వచ్చే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతివ్వాలని ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పృథ్వీరెడ్డి విజ్ఞప్తి చేశారు. బాగేపల్లి పట్టణంలో ఆప్ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీ తరహాలో విద్య, ఆరోగ్యం తదితర రంగాలతో పాటు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఆప్‌కు సహకరించాలని ప్రజలను కోరారు. ఢిల్లీలో వీధి వ్యాపారులు, టైలర్లు, పేద కుటుంబాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను పొందుతున్నారని తెలిపారు.

సిగ్నల్ బోర్డులు ఏర్పాటు



గౌరిబిదనూరు: నగరంలో పలు చోట్ల సిగ్నల్ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారులు సులువుగా గుర్తించడానికి, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం కావడానికి నగర సీఐగా వచ్చిన సత్యనారాయణ ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నారు.. తాలూకాలో ట్రిపుల్ రైడింగ్‌లు, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను కూర్చొపెట్టడం, హెల్మెట్ ధరించకపోతే మంచి మాటలతో సీఐ సత్యనారాయణ వాహనదారుల్లో పరివర్తన తెస్తున్నారు.

గజరాజుకు బంధనాలు

- పెంపుడు ఏనుగులతో కార్యాచరణ
- ఈనెల 20న ఇద్దరి బలితీసుకున్న వైనం



ఏనుగును బంధించిన దృశ్యం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకా రెంజిలాడి గ్రామంలో ఇద్దరిని బలిగొన్న అడవి ఏనుగును అటవీ సిబ్బంది ఎట్టకేలకు బంధించారు. ఈ నెల 20న కెంజిలాడి నైలకు చెందిన రంజితారై (21), ఆమెను రక్షించటానికి వెళ్లిన రమేశ్‌రై (52)లను ఏనుగు తొక్కి చంపేసింది. ఏనుగును బంధించాలని స్థానికులు డిమాండ్ చేయడంతో ఏనుగుల శిక్షణ కేంద్ర నుంచి గజరాజులను రప్పించి మూడు రోజుల పాటు శ్రమించి ఏనుగును బంధించారు. ఐదు కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో దాగి ఉండటంతో అధికారులు డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి, ఏనుగును కొడగు జిల్లా మత్తిగోడలోని ఎలిఫెంట్ క్యాంప్‌నకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

అధికారుల వాహనాలపై రాళ్లు

గురువారం సాయంత్రం ఏనుగును బంధించి వాహనంలో తీసుకెళ్తుండగా అటవీ, పోలీసు సిబ్బందిపై రాళ్ల దాడి చేశారు. ఇందుకు సంబంధించి కోంబారు గ్రామానికి చెందిన కమరకజ్జి ఉమేశ్, రాజేశ్ కన్నడ, జనార్ధాన్ రై, కోకిలనంద, తీర్థకుమార్, గంగాధరగౌడ, అజిత్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. ఒక ఏనుగును బంధిస్తే చాలదు.. అన్ని ఏనుగులను బంధించాలని కోంబారు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

27 నుంచి ఖాతా నమోదు జాగృతి



మాట్లాడుతున్న ప్రత్యేక కమిషనర్ ఆర్‌ఎల్.దీపక్

బనశంకరి: ఈనెల 27 నుంచి బృహత్ బెంగళూరు మహానగర పాలికె రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఖాతా నమోదు జాగృతి కార్యక్రమం ఏర్పాటు చేస్తామని బీబీఎంపీ ప్రత్యేకక మిషనర్ (రెవెన్యూ) ఆర్‌ఎల్.దీపక్ తెలిపారు. శుక్రవారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో దీపక్ మాట్లాడుతూ... పాలికె పరిధిలో ఉన్న అన్ని భూములను నగర పాలికెలో నమోదు చేసి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకురావడం, దీనికి సంబంధించి ప్రజలకు పూర్తి సమాచారం కల్పించడం కోసం ఖాతా ఆందోళన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పాలికెలోని అన్ని వలయాల్లో ఉన్న అసిస్టెంట్ రెవెన్యూ అధికారులు కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయని, భూముల యజమానులకు కొత్తగా ఖాతా నమోదు చేసుకోవడం గురించి పూర్తి సమాచారం అందిస్తామని తెలిపారు. పాలికె వెబ్‌సైట్‌ను సందర్శించి మరింత సమాచారం తెలుసుకోవాలని తెలిపారు.

ఆటో డ్రైవర్ దుర్మరణం



కృష్ణరాజపురం: బెంగళూరులో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఆటోను ట్రక్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. విజయనగర పోలీసు స్టేషన్ పరిధిలో జరగ్గా ఘటన అనంతరం ట్రక్ డ్రైవర్ పారిపోయాడు. పీక్ అవర్‌లో నగరంలో భారీ వాహనాల రాకపోకల నిషేధం ఉంది. అయినప్పటికీ ట్రక్ డ్రైవర్ నిబంధనను ఉల్లంఘించి నిషేధిత ప్రాంతంలో ప్రవేశించి ఆటోను ఢీ కొట్టారు.

కార్ల అద్దాలు ధ్వంసం

బనశంకరి: నగరంలోని హనుమంతనగర పరిధి శ్రీనివాసనగరలో శుక్రవారం వేకువజామున బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆరు కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితులు హనుమంత నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలో పరిశీలించి దుండగుల కోసం గాలిస్తున్నారు.

జంట హత్యల కేసు నిందితుడు లొంగుబాటు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా దొడ్డబెళవంగలలో జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో మరో నిందితుడు లాయర్ సాయంతో కోర్టులో లొంగిపోయాడు. మొత్తం ఐదుమందిలో ఒక్కడైన అనిల్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తారనే భయంతో కోర్టులో లొంగిపోయాడు. ప్రస్తుతం పోలీసులు అనిల్‌ను కస్టడీకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

విమానాశ్రయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ సెల్వమణి

శివమొగ్గ: శివమొగ్గ శివార్లలోని సోగానేలో నూతనంగా నిర్మించిన విమానాశ్రయాన్ని ఈ నెల 27న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాధికారి డాక్టర్ ఆర్.సెల్వమణి తెలిపారు. సోగానే విమానాశ్రయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... ప్రారంభోత్సవానికి సుమారు లక్ష మంది కూర్చోడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెండోచోట్ల భోజన ఏర్పాట్లు చేసినట్లు, మరోచోట 100 కౌంటర్లు తెరిచినట్లు తెలిపారు. కార్యక్రమం వీక్షించడానికి 4 చోట్ల ప్రొజెక్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 775 ఎకరాల విస్తీర్ణంలో రూ. 449.22 కోట్ల ఖర్చుతో విమానాశ్రయం సిద్ధమైనట్లు తెలిపారు. 3.2 కిలోమీటర్ల రన్‌వే, 4,320 చదరపు అడుగుల ప్యాసెంజర్ టెర్మినల్, ఎయిర్ ట్రాఫికింగ్ సెంటర్ తదితర సౌకర్యాలు ఈ విమానాశ్రయంలో ఉన్నట్లు తెలిపారు. ఈ విమానాశ్రయం ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, భూమిపూజ చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ మిథున్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని వైపుల సీసీ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు. ప్రజలు ఉదయం పది గంటలకు ప్రాంగణంలోకి రావాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం కూడా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నల్లటి దుస్తులు, చేతిరుమాలు ధరించకూడదు, నీటి బాటిల్, హ్యాండ్ బ్యాగ్ తీసుకు రావొద్దన్నారు. మొబైల్, పర్సుకు మాత్రమే అనుమతి ఉందన్నారు.

సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండను

మైసూరు: తాను సుదీర్ఘ కాలం రాజకీయాలు చేసేందుకు ఇష్టం లేదని ఎంపీ ప్రతాప్ సింహ తెలిపారు. శుక్రవారం మైసూరు జలదర్శిని గెస్ట్‌హౌస్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీతో కలసి పని చేసేందుకు తాను ఇష్టపడుతున్నట్లు, అయితే 2029 తర్వాత రాజకీయాల్లో ఉండాలా వద్దా అనేది తర్వాత నిర్ణయిస్తానన్నారు. అభివృద్ధి చేయడం తన తొలి ప్రాధాన్యత అని, మంచి పనులు చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తాలిబాన్ ప్రభుత్వం వస్తుందని గురువారం తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటున్నట్లు తెలిపారు. పీఎఫ్ఐ కేసు రద్దు చేసింది ఎవరు? పోలీసు శాఖ వ్యతిరేకించినా సిద్ధరామయ్య ప్రభుత్వం పీఎఫ్ఐ కేసులను క్లియర్ చేసిందని విమర్శించారు. మార్చి 11 లేదా 12న బెంగళూరు–మైసూరు పది లేన్ల రహదారిని ప్రధాని ప్రారంభిస్తారని తెలిపారు. మండ్యలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అదేరోజు మైసూరు–కుశాల నగర నాలుగు లేన్ల రహదారికి కూడా ప్రధాని భూమిపూజ చేస్తారన్నారు.

ఏడు గంటల పాటు త్రీఫేస్ ఇవ్వాలి



బెస్కాం అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకాలో రైతులకు పగటిపూట 7 గంటల త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. పట్టణంలోని బెస్కాం కార్యాలయంలో ఈఈని కలిసిన రైతులు మాట్లాడుతూ... రాత్రిపూట త్రీఫేస్ విద్యుత్ ఇవ్వడం వల్ల కనకపుర తాలూకాలో ప్రయోజనం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి పూట అడవి జంతువులు విచ్చలవిడిగా సంచరిస్తుంటాయని, ప్రాణాలకు తెగించి పొలాలకు వెళ్లి తాము నీళ్లు కట్టలేమన్నారు. తమ గ్రామాల్లో పట్టపగలే చిరుతలు, ఏనుగులు తదితర జంతువులు సంచరిస్తుంటాయని అలాంటిది తాము రాత్రిపూట పొలం పనులు చేసుకోలేమన్నారు. పగటిపూటే తమకు 7 గంటల త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలని డిమాండు చేసారు. వినతిపత్రం అందుకున్న ఈఈ నాగరాజు మాట్లాడుతూ పగటిపూటే త్రీఫేస్ విద్యుత్ ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు.

మంగళూరు సీపీగా కులదీప్ జైన్ బాధ్యతల స్వీకరణ



యశవంతపుర: మంగళూరు నగర పోలీసు కమిషనర్‌గా కులదీప్ జైన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శశికుమార్‌ను బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన జైన్ మాట్లా డుతూ....అవినీతి ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు. ప్రజా సమస్యల ను వెంటనే పరిష్కరించాలని, పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

నిందితుడి అరెస్ట్

యశవంతపుర: బెంగళూరు నగరంలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని యశవంతపుర పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు 40 ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన ముదాసిర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. నిందితుడిపై బెంగళూరు, మైసూరు, మండ్య, తుమకూరు పోలీసుస్టేషన్‌లో కేసులున్నాయి.

24 గంటల్లో నిందితుడి పట్టివేత..



కృష్ణరాజపురం: 24 గంటల వ్యవధిలో హత్య కేసు నిందితుడిని జ్ఞాన భారతి పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం దినేశ్ అనే వ్యక్తిని అరుణ్ నడి రోడ్డుపై దారుణంగా హత్య చేశాడు. దినేశ్ వద్ద రూ. లక్ష నగదును నిందితుడు అరుణ్ తీసుకున్నాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలని దినేశ్ పదేపదే నిలదీశాడు. ఇదే సమయంలో అరుణ్ భార్య గురించి దినేశ్ అసభ్యంగా మాట్లాడాడు. దీంతో కోపోద్రిక్తుడైన అరుణ్ డబ్బులు ఇస్తానని నమ్మబలికి దినేశ్‌ను పిలిపించి హత్య చేశాడు. అరుణ్‌ను పోలీసులు ఘటన జరిగిన 24 గంటల్లో అరెస్టు చేశారు.

హోసూరు వార్తలు..

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి తాలూకాలోని 9 కేంద్రాల్లో శనివారం నిర్వహించనున్న గ్రూప్ 2 పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ దీపక్‌జేకబ్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో కల్పించిన సదుపాయాలపై ఆరా తీశారు. కేంద్రాలకు బస్సు సదుపాయం కల్పించాలని సూచించారు. కాపీయింగ్ నివారించేందుకు సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌వో రాజేశ్వరి, వేడియప్పన్, సుకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సాధనలపై ఫొటో ఎగ్జిబిషన్



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న స్థానిక ప్రజలు

క్రిష్ణగిరి: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పథకాలు, సాధనలపై ప్రజా సంబంధ శాఖ సూళగిరి సమితి నెరిగం పంచాయతీలో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. ప్రజల వద్దకే వైద్యం, ఇంటి వద్దకే విద్య, గిరిజన గ్రామాలకు 108 అంబులెన్స్ సేవలు, కళాశాల విద్యార్థులకు ప్రతిభా శిక్షణ శిబిరాలు, పెరటి తోటల పెంపకం, లక్ష మందికి ఉచిత విద్యుత్ కనెక్షన్లు తదితర పథకాలపై వందకుపైగా ఫొటోలను ప్రదర్శించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తిలకించారు.

కైలాసగిరి బ్రహ్మచారికి పాదపూజ



బ్రహ్మచారికి పాదపూజ నిర్వహిస్తున్న భక్తులు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా మరుదాండపల్లి పంచాయతీ యళసేపల్లి గ్రామంలోని పుట్టలింగేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం వచ్చిన కైలాసగిరి బ్రహ్మచారికి గ్రామస్తులు పాదపూజ చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కైలాసగిరి బ్రహ్మచారి తీర్థయాత్రలు చేస్తూ శుక్రవారం యళసేపల్లి గ్రామంలో పుట్టలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకురాలు వెంకటమ్మ నేతృత్వంలో విశేష పూజలు మహర్షులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

వేగవంతంగా వంతెన నిర్మాణ పనులు



సాగుతున్న నిర్మాణ పనులు

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి నుంచి కుంభళం వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానికుల 40 ఏళ్ల కోరిక త్వరలో నెరవేరనుంది. సూళగిరి సమీపంలోని దొరచెరువు, చిన్నారు డ్యాంకు వరదనీరు వెళ్లే వాగుపై వంతెన నిర్మించాలని స్థానిక ప్రజలు పలు సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావాలని కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

హోసూరు: డెంకణీకోట, సూళగిరి ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. డెంకణీకోట సమీపంలోని గరగూరు గ్రామానికి చెందిన రైతు పచ్చప్ప(30) గురువారం రాత్రి బైక్‌లో జవళగిరి– బాలతోటనపల్లి రోడ్డుపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన సరకుల రవాణా వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన పచ్చప్పను డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. డెంకణీకోట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన వ్యాన్ డ్రైవర్ రామచంద్రన్(33) బుధవారం సాయంత్రం సూళగిరి సమీపంలోని ఒడ్డేనూరు వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సూళగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

26న ఘంటసాల వర్ధంతి

హోసూరు: హోసూరు సంగీత, సాహిత్య కళా మిత్ర బృందం, ఆంధ్ర సాంస్కృతిక సమితి సంయుక్తంగా ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం కామరాజ్ కాలనీలోని ఆంధ్రసాంస్కృతిక సమితి భవనంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి, ఎస్.పి. బాలసుబ్రమణ్యం స్మారక సంగీత స్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గాయనీగాయకులు హైదరాబాద్‌కు చెందిన బాలకామేశ్వరరావు, హోసూరుకు చెందిన లక్ష్మీవిశ్వనాథ్, కృష్ణ, నాగభూషణం, బేరికె జానకీరాం, కగ్గనూరు మునిరాజ్, కోనేరుపల్లి బాలకృష్ణలు సినీ గేయాలు ఆలపిస్తారన్నారు. అదేవిధంగా తబల కోనేరుపల్లి వేణుగోపాల్, కీబోర్డ్ సేవగానపల్లి కార్తిక్, రిథం ప్యాడ్ మాస్టర్ కోనేరుపల్లి పూర్ణేష్ పాల్గొంటున్నారని తెలిపారు.

ముగ్గురు మహిళల అదృశ్యం

హోసూరు: హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాల్లో కళాశాల విద్యార్థినితోసహా ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. హోసూరు సమీపంలోని గోవిందఅగ్రహారం గ్రామానికి చెందిన నందిని(19) ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈనెల 20వ తేదీ కళాశాలకెళ్లిన నందిని తిరిగి రాలేదు. అదేవిధంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయురాలు విజిత(35) రెండు రోజుల క్రితం పట్టణంలోని బస్తీ భారతీయార్ నగర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. బాగలూరు కోట ప్రాంతానికి చెందిన సుమ(26) ఈనెల 19వ తేదీ ఇంటి నుంచి బయటకెళ్లి అదృశ్యమైంది. ఆయా ఘటనలపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గ్రానైట్ రాళ్ల లారీ స్వాధీనం

హోసూరు: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణగిరి ఖనిజ సంపద శాఖ అధికారిణి అశ్వని నేతృత్వంలో అధికారులు గురువారం రాత్రి మూంగిల్‌పుదూర్ గ్రామం వద్ద నిలిపి ఉన్న లారీని తనిఖీ చేయగా అనధికారికంగా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు తేలింది. దీంతో లారీని స్వాధీనం చేసుకున్నారు.

పీయూసీ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాజు

చిక్కబళ్లాపురం: మార్చి 9 నుంచి జరిగే ద్వితీయ పీయూసీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాజు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పరీక్ష కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని, ప్రశ్నపత్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలన్నారు. ఇక విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. సమావేశంలో ఏడీసీ తిప్పేస్వామి, పీయూ డీడీపీఐ ఆనంద్, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్



కృష్ణరాజపురం: ఓ వ్యక్తిని హత్య చేసి పరారైన నిందితులను కామాక్షిపాళ్య పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను కృష్ణ, నిరంజన్‌లుగా గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. నిందితుల వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కామాక్షిపాళ్య పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్లుప్తంగా...

ఆదిలోనే అధిక ఉష్ణోగ్రతలు

రాష్ట్ర వ్యాప్తంగా 2 నుంచి 4 డిగ్రీలు పెరుగుదల

సాక్షి, అమరావతి: వేసవి ప్రారంభంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో 36 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో అత్యధికంగా 38.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాయలసీమలోని ఎక్కువ ప్రాంతాల్లో 37 నుంచి 38.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోస్తా జిల్లాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో 36–38 డిగ్రీల ఉష్ణోగ్రతలొచ్చాయి. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న నాలుగైదు రోజుల్లో ఎండల తీవ్రత ఇంకా పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరాంధ్రలో 3- 5, రాయలసీమలో 2–3 డిగ్రీల మేర సాధారణం కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. పొడి గాలుల కారణంగా ఎండ తీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది.

ఏపీలో రూ.1,292.65 కోట్ల హైవే పనులకు ఆమోదం

- ఆమోదం తెలిపిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,292.65 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. భారతమాల పరియోజనలో భాగంగా బెంగళూరు–విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో చంద్రశేఖరపురం నుంచి పోలవరం వరకు 32 కిలోమీటర్ల మేర ఆరులేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే అభివృద్ధి నిమిత్తం నిధులకు ఆమోదం తెలిపినట్లు కేంద్రమంత్రి వరస ట్వీట్లలో పేర్కొన్నారు. బెంగళూరు–కడప–విజయవాడ ఎకనామిక్ కారిడార్ బెంగళూరు ఎస్‌టీఆర్‌ఆర్ నుంచి ప్రారంభమవుతుందని, ఇప్పటికే ఉన్న బెంగళూరు–విజయవాడ (ఎన్‌హెచ్–44)లోని కొడికొండ చెక్‌పోస్ట్ వరకు రహదారిని వినియోగించుకుంటుందని తెలిపారు. ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎకనామిక్ కారిడార్ కొడికొండ చెక్‌పోస్టు నుంచి ఎన్‌హెచ్–16లోని అద్దంకి వద్ద ముప్పవరం గ్రామం వరకు తదనంతరం విజయవాడ వరకు ఉన్న రహదారిని వినియోగించుకుంటుందని పేర్కొన్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి ముప్పవరం వరకు 342.5 కిలోమీటర్లు పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ హైవే అని తెలిపారు. ప్రకాశం జిల్లాలోని ఈ ప్రతిపాదిత అభివృద్ధిని 14 ప్యాకేజీలుగా చేపడతామని కేంద్రమంత్రి గడ్కరీ పేర్కొన్నారు.

ఈడబ్ల్యూఎస్ వారికి మరో ఐదేళ్లు

- ఏపీ రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు రూల్స్‌ను సవరిస్తూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్) యువతకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు వయోపరిమితి తరహాలోనే ఆర్థికంగా బలహీన వర్గాలకు కూడా ప్రభుత్వం నేరుగా భర్తీచేసే ఉద్యోగాలకు ఐదేళ్లు వయోపరిమితిని పెంచింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఓసీలకు నేరుగా భర్తీచేసే ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితి 34 సంవత్సరాలుగా ఉంది. ఇప్పుడు ఆర్థికంగా బలహీన వర్గాలకు 34 సంవత్సరాలకు అదనంగా మరో ఐదేళ్ల వయోపరిమితి పెంచారు. అంటే ఆర్థికంగా బలహీనవర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలకు వయో పరిమితి 39 సంవత్సరాలుగా ఉండనుంది. మరోపక్క ఆర్థికంగా బలహీనవర్గాల సంక్షేమశాఖను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఇప్పటికే ఆర్థికంగా బలహీనవర్గాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్పొరేషన్లను ఆ శాఖ పరిధిలోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులను జారీచేశారు. ఆయా కార్పొరేషన్ల సర్వీసు అంశాలతో పాటు, వివిధ పథకాలు, చట్టాలు కూడా ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమశాఖ పరిధిలోకి వస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పదివేల కోట్లు ఇచ్చినా బాబు రాజధాని కట్టలేదు

ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోమువీర్రాజు



మదనపల్లె/ బి.కొత్తకోట : కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు ఇచ్చినా చంద్రబాబు రాజధాని నిర్మించకపోగా, రైతులను నడిరోడ్డు మీద పడేశాడని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనూ, బి.కొత్తకోట మండలం అమరనారాయణపురంలో తంబళ్లపల్లె నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లతో జరిగిన సమావేశంలోనూ శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆనాడు చంద్రబాబు అమరావతిలో సగం నిర్మాణాలు చేసి ఉన్నా ఈరోజు రాజధాని ప్రసక్తే ఉండేది కాదన్నారు. రాష్ట్ర బీజేపీలో అసమ్మతి పెరిగిందన్న ప్రశ్నకు స్పందిస్తూ.. ప్రత్యేక అజెండాతోనే పార్టీ మారుతున్నారన్నారు. జనసేనతో బీజేపీ పొత్తు కొనసాగుతుందని, ఈ విషయాన్ని పవన్‌కళ్యాణ్ స్వయంగా ధృవీకరించారని తెలిపారు. కమ్యూనిస్టులు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వసూలు చేసే సొమ్ముతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీలను ఓడించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ హీటెక్కిపోతోంది. వేసవిలో వడగాడ్పుల రోజుల సంఖ్య పెరుగుతోంది. దేశంలోకెల్లా ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే రాష్ట్రంగా రాజస్థాన్ నిలుస్తుండగా.. రెండో స్థానంలో ఒడిశా ఉండేది. దశాబ్దకాలంగా పరిస్థితిలో మార్పు వచ్చింది. ఒడిశాను పక్కకు నెట్టేసి ఆ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఆక్రమించింది. దక్షిణ భారతదేశంలో ఏపీ మొదటి స్థానంలో నిలుస్తోంది.





ఏపీలో గ్రీష్మతాపం.. హీట్‌వేవ్స్ ప్రతాపం

రాష్ట్రంలో దశాబ్ద కాలంగా పెరుగుతున్న వడగాడ్పుల రోజుల సంఖ్య

- దేశంలో అధిక వడగాడ్పులు నమోదైన రెండో రాష్ట్రంగా ఏపీ
- ఎక్కువ హీట్‌వేవ్ రోజులతో మొదటి స్థానంలో రాజస్థాన్
- కడప, కర్నూలు, మచిలీపట్నం, విశాఖల్లో పెరుగుతున్న వడగాడ్పుల తీవ్రత
- కాకినాడ, కళింగపట్నంలలో తగ్గుదల

సాక్షి, విశాఖపట్నం: పదేళ్లుగా రాష్ట్రంలో వేసవి గరిష్ఠ ఉష్ణోగ్రతల పెరుగుదల కొనసాగుతోంది. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. అంతేకాదు.. వడగాడ్పులు కొనసాగే రోజులూ అధికమవుతున్నాయి. 2011–2021 సంవత్సరాల మధ్య వేసవి ఉష్ణోగ్రతల గణాంకాలను బట్టి రాజస్థాన్ తర్వాత అత్యధిక హీట్‌వేవ్స్ రోజులు ఆంధ్రప్రదేశ్‌లోనే రికార్డవుతున్నాయని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాస్త్ర శాఖ మంత్రి జితేంద్రసింగ్ ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. గడచిన దశాబ్ద కాలంలో నడి వేసవి కాలంలో రాజస్థాన్‌లో 119, ఆంధ్రప్రదేశ్‌లో 106, ఒడిశాలో 103 వడగాడ్పుల రోజులు నమోదయ్యాయి. ఈ దశాబ్దంలోని ఆరేళ్లలో సగటున ఏడాదికి పది కంటే ఎక్కువ హీట్‌వేవ్స్ రోజులు నమోదైన ఏకైక రాష్ట్రంగా కూడా ఆంధ్రప్రదేశ్ రికార్డులకెక్కింది. ఈ దశాబ్దంలో పొరుగున ఉన్న తెలంగాణాలో 69, తమిళనాడులో 56 వడగాడ్పుల రోజులు నమోదయ్యాయి. వేసవిలో సాధారణ ఉష్ణోగ్రతలకంటే 4.5 డిగ్రీలకు మించి అధికంగా రికార్డయితే వడగాడ్పులు వీస్తాయి. రాష్ట్రంలో 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే వేసవి తాపం ప్రభావం మొదలవుతుంది. అలా అవి పెరిగే కొద్దీ వడగాడ్పుల తీవ్రత కూడా పెరుగుతుంది. మరోవైపు 2014–17 మధ్య రాష్ట్రంలో వడదెబ్బకు 2,776 మంది మృత్యువాతపడ్డారు.

కాకినాడ, కళింగపట్నాల్లో భిన్నంగా..

ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ పరిధిలో 8 వాతావరణ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 6 స్టేషన్లలో వేసవి సీజన్‌లో హీట్‌వేవ్ సరళి పెరుగుదల నమోదైంది. కానీ.. కాకినాడ, కళింగపట్నం స్టేషన్లలో మాత్రం అందుకు భిన్నంగా హీట్‌వేవ్ రోజులు తగ్గుతున్నట్టు గుర్తించారు. 1961 నుంచి 2021 సంవత్సరాల మధ్య వేసవిలో (ఏప్రిల్, మే, జూన్ నెలల్లో) నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలను బట్టి ఈ నిర్ధారణకు వచ్చారు. మరోవైపు అనంతపురం, వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, మచిలీపట్నం, విశాఖపట్నం ప్రాంతాలలో హీట్‌వేవ్ ట్రెండ్ పెరుగుతున్నట్టు తేల్చారు. ప్రకాశం జిల్లా వెలిగండ్లలో 2016 మే రెండో తేదీన 48.6 (49) డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయినట్టు రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికల సంస్థ పేర్కొంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం విశేషం. దేశవ్యాప్తంగా 103 వాతావరణ స్టేషన్లలో వేసవి తాపం, వడగాడ్పుల తీవ్రతపై సమీక్షించగా కేవలం 20 స్టేషన్ల పరిధిలోనే హీట్‌వేవ్ తగ్గుదల నమోదవుతున్నట్టు నిర్ధారించారు.

ఎందుకిలా!?

వేసవిలో వడగాలులు (హీట్‌వేవ్స్) రాజస్థాన్ నుంచి తెలంగాణ మీదుగా రాష్ట్రంపైకి వీస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో 974 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. వేసవిలో మధ్యాహ్నం తర్వాత సముద్రం నుంచి గాలులు వీస్తుంటాయి. అవి ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ గాలులు సక్రమంగా వీయకపోవడం, ఆలస్యంగా వీయడం వంటివి జరుగుతున్నాయి. ఫలితంగా ఉష్ణ తీవ్రత పెరిగి వడగాడ్పుల ఉధృతిని, ఉక్కపోత తీవ్రతను పెంచుతున్నాయని భారత వాతావరణ విభాగం రిటైర్డ్ అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'తో చెప్పారు. అదే సమయంలో ఏప్రిల్‌కు కొద్దిరోజుల ముందు నుంచే వేసవి ఛాయలు మొదలవడం, నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడం వంటివి రాష్ట్రంలో హీట్‌వేవ్స్ రోజులు పెరగడానికి దోహదపడుతున్నాయని వివరించారు.

జోరుగా 'అత్యంత ప్రాధాన్యత పనులు'

- సచివాలయాల పరిధిలో గుర్తిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- వెంటనే మంజూరు చేస్తున్న ప్రభుత్వం
- పూర్తయిన పనుల బిల్లులకు నిధులూ విడుదల
- పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన అత్యంత ప్రాధాన్యత పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన పనులను ఎప్పటికప్పుడు 'గడప గడపకు మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత పనుల పోర్టల్'లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు రూ.1,180.40 కోట్ల విలువైన 30,174 పనులను అప్‌లోడ్ చేశారు. వీటిలో 5,414 సచివాలయాల పరిధిలోని రూ.1082.80 కోట్ల విలువైన 27,197 పనులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇందులో రూ.974.40 కోట్ల విలువైన 24,356 పనులు ప్రారంభం కూడా అయ్యాయి. పోర్టల్'లో అప్‌లోడ్ చేసిన పనులను వెంటనే మంజూరు చేయడం, వాటిని ప్రారంభించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతోంది. ఈ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.3,000 కోట్లు మంజూరు చేసింది. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపునకు తొలి విడతగా రూ.500 కోట్లు జిల్లాలవారీగా డీడీవోలకు విడుదల చేసింది. ఈ పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులను నిరంతరం పర్యవేక్షించాలని, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు.

పనులు ముమ్మరంగా సాగుతున్నాయి : ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్

ప్రాధాన్యత పనులు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయని గ్రామ, వార్డు, సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. బిల్లుల చెల్లింపునకు తొలి దశ నిధులు విడుదల చేశామన్నారు. పనులు పూర్తవుతున్నకొద్దీ నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

తుంగభద్రను రక్షించుకుందాం

రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తమరెడ్డి



తిరుపతి అర్బన్: కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర ప్రాజెక్టుపై ఎగువభద్ర పేరుతో ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తుండడం రాయలసీమకు శాపంగా మారనుందని రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త మాకిరెడ్డి పురుషోత్తమరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'తుంగభద్రను కాపాడుకుందాం- సిద్ధేశ్వరం అలుగుతో మనసీమను సస్యశ్యామలం చేద్దాం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమకు కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టును కాపాడుకోవడం కోసం విద్యార్థులు సోషల్ మీడియా వేదికగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తుంగభద్రకు సంబంధించి బచావత్ నీటి కేటాయింపులు లేకపోయినా, సుప్రీంకోర్టులో స్టే ఉన్నా ఎగువ రాష్ట్రం అయిన కర్ణాటక నిబంధనలు ఉల్లంఘించి తుంగభద్ర ప్రాజెక్టుపై ఎగువన ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడం దుర్మార్గమని చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదం వచ్చినప్పుడు పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా రాయలసీమకు అన్యాయం చేస్తూ కర్ణాటకలో అనుమతులు లేని ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడమే కాకుండా నిధులు మంజూరు చేయడం అన్యాయమన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలపాలని సదస్సులో తీర్మానించారు. ఆచార్య జయచంద్రా రెడ్డి, ఆచార్య సుబ్రమణ్యం, ఆచార్య నరేన్ కుమార్, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'అవకాశాలను అందిపుచ్చుకోండి'

విశాఖ స్పోర్ట్స్: దేశంలో క్రికెట్‌కు పాపులారిటీ పెరుగుతోందని..అందుకు తగినట్టుగానే ఆటగాళ్లు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఎదగాలని ఆంధ్రా క్రికెట్ సంఘం పూర్వ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు ఔత్సాహిక క్రికెటర్లకు ఉద్బోధ చేశారు. విశాఖలో(ఆనందపురం–తాళ్లవలస హైవే దరి) ఎంఎస్‌కే ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వీడీసీఏ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు జాతీయ సీనియర్ మెన్ జట్టు ఎంపిక కమిటీ పూర్వ ఛైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ఎంఎస్‌కే చేస్తున్న కృషిని అభినందించారు. ఏసీఏ డైరెక్టర్‌గా ఉన్న రోజుల్లోనే మూడు మెన్, ఒక ఉమెన్ అకాడమీని ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.. 75 యార్డ్స్‌లో ఏర్పాటు చేసిన టర్ఫ్ పిచ్, గ్రౌండ్‌ను గంగరాజు ప్రారంభించారు. క్రికెట్‌కు విశేష సేవలందించిన డీవీ సుబ్బారావు, గంగరాజు, ఎన్.వెంకట్రావు, ఆర్.వి.ఆర్.కె.ప్రసాద్, అప్పలరాజు తదితరులు పేరిట 9 నెట్స్‌ను అతిథులు ప్రారంభించారు.

'ఎమ్మెల్సీ'లోనూ ఏకగ్రీవాలు

9 స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో ఐదింట్లో వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవం

సాక్షి అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవ విజయాలు నమోదు చేస్తోంది. ప్రస్తుతం స్థానిక సంస్థల కోటాలో 9 శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా విజయం సాధించనున్నారు. వైఎస్సార్, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం ఈ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మాత్రమే రంగంలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఉంది. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులను అధికారికంగా ప్రకటిస్తారు.

వైఎస్సార్ జిల్లాలో తెలుగుదేశం పార్టీ నేతలు నిలబెట్టిన స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో బలపరిచిన వారి సంతకాలు ఫోర్జరీవని తేలడంతో ఆయన నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. దీంతో ఇక్కడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. అనంతపురం జిల్లాలో స్వతంత్ర అభ్యర్థి వేలూరు రంగయ్య నామినేషన్‌ను అధికారులు స్క్రూటినీలో తిరస్కరించారు. దీంతో ఈ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్.మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సిపాయి సుబ్రహ్మణ్యం ఎన్నిక ఏకగ్రీవం కానుంది. నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ అభ్యర్థిత్వాన్ని తాను బలపరచలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని సూళ్లూరుపేట కౌన్సిలర్ చెంగమ్మ రిటర్నింగ్ ఆఫీసర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. ఇక్కడ మురళి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. తూర్పు గోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణరావు ఎన్నిక లాంఛనమే కానుంది. టీడీపీకి చెందిన కడలి శ్రీదుర్గ, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను సాంకేతిక కారణాలతో అధికారులు తిరస్కరించారు. బరిలో కుడుపూడి సూర్యనారాయణరావు మాత్రమే ఉన్నారు.

శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల పరిశీలన పూర్తయ్యింది. వైఎస్సార్‌సీపీ తరఫున నర్తు రామారావు, ఇండిపెండెంట్‌గా ఆనెపు రామకృష్ణ బరిలో ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గాలు రెండింటిలో మొత్తం 8 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన అనంతరం ఏడుగురు బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు బరిలో ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి నల్లి రాజేష్ నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. కర్నూలు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక్కడ మొత్తం నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థి కుమ్మరి శ్రీనివాసులు నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. బరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎ.మధుసూదన్, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు రంగంలో మిగిలారు.

పట్టభద్రుల నియోజకవర్గాలకు భారీగా నామినేషన్లు

మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు 137 నామినేషన్లు, రెండు టీచర్ల నియోజకవర్గాలకు 25 నామినేషన్లు దాఖలైనట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప–అనంతపురం–కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గానికి అత్యధికంగా 63 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో 12 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 51 మంది బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం బరిలో వైఎస్సార్‌సీపీ నుంచి వెన్నపూస రవీంద్ర రెడ్డి, తెలుగుదేశం పార్టీ నుంచి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, భూమిరెడ్డి ఉమాదేవి, బీజేపీ నుంచి రాఘవేంద్ర నగరూరు సహా పలువురు ఉన్నారు. శ్రీకాకుళం–విజయనగరం–విశాఖ పట్టభద్రుల నియోజకవర్గంలో 44 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ నుంచి సీతంరాజు సుధాకర్, టీడీపీ నుంచి వేపాడ చిరంజీవిరావు, గుణూరు మల్లునాయుడు, బీజేపీ నుంచి పీవీఎన్ మాధవ్ తదితరులు నామినేషన్లు వేశారు. ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గానికి 30 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటలో ఏడింటిని అధికారులు తిరస్కరించారు. వైఎస్సార్‌సీపీ నుంచి పేర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డి, పేర్నేటి హేమ సుస్మిత, టీడీపీ నుంచి కంచర్ల శ్రీకాంత్ చౌదరి, అవిల్నేని సరిత, బీజేపీ నుంచి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తదితరులు బరిలో ఉన్నారు.

టీచర్ల నియోజకవర్గాలకు బరిలో 22 మంది

పార్టీలకు అతీతంగా జరిగే రెండు టీచర్ల నియోజకవర్గాలకు మొత్తం 25 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు నియోజకవర్గానికి 8 నామినేషన్లు దాఖలవగా అన్నీ ఆమోదం పొందాయి. కడప–అనంతపురం–కర్నూలుకు 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురి నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం మొత్తం 22 మంది బరిలో ఉన్నారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం నికరంగా ఎంతమంది బరిలో ఉన్నారన్న విషయంపై స్పష్టత వస్తుంది. ఏకగ్రీవం కాని స్థానిక సంస్థలు, పట్టభద్రులు, టీచర్ల స్థానాలకు మార్చి13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి16న ఓట్లు లెక్కించి, విజేతలను ప్రకటిస్తారు.

సై..కిల్ అయింది!

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ నిలుపుకోలేక పోయిన టీడీపీ

- వైఎస్సార్‌జిల్లా 'స్థానిక' సంస్థల్లో 94 శాతం బలం వైఎస్సార్‌సీపీదే
- దీంతో పోటీ చేయకూడదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నిర్ణయం
- అత్యుత్సాహం ప్రదర్శించిన పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి
- స్వతంత్ర అభ్యర్థిగా రమణయ్యను పోటీలోకి దింపిన వైనం
- తమ సంతకాలు ఫోర్జరీవని ప్రతిపాదితుల ఫిర్యాదు
- రమణయ్య యాదవ్ నామినేషన్ తిరస్కరణ
- క్రిమినల్ కేసు నమోదుకు రిటర్నింగ్ అధికారి ఆదేశం

సాక్షి ప్రతినిధి, కడప: నేల విడిచి సాము చేయబోయిన తెలుగుదేశం పార్టీ బోర్లా పడింది. పార్టీకి బలం లేకపోయినా, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్ వేసింది. అభ్యర్థిని బలపరిచిన వారి సంతకాలు ఫోర్జరీవని తేలడంతో ఉన్న కాస్త పరువూ పోగొట్టుకుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 911 మంది ఓటర్లున్నారు. వారిలో 94 శాతం వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలుపొందిన వారే. 4 శాతమే టీడీపీకి చెందిన వారు. మిగతా వారు 2 శాతం ఉన్నారు. ఇక్కడ గెలిచేది వైఎస్సార్‌సీపీ అభ్యర్థే. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి నిర్ణయించారు. అయితే, టీడీపీ అధిష్టానం వద్ద మెప్పు కోసం ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి తమ పార్టీకే చెందిన ఓబులవారిపల్లె మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణయ్య యాదవ్‌తో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నట్లు నామినేషన్ పత్రాల్లో కౌన్సిలర్లు శివజ్యోతి (ప్రొద్దుటూరు), చిన్న వెంకట సుబ్బారెడ్డి, ఖాదర్ బాషా (మైదుకూరు) సంతకాలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) జేసీ సాయికాంత్‌వర్మ ఎన్నికల పరిశీలకులు రవిచంద్ర, నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సమక్షంలో నామినేషన్లు పరిశీలించారు. తొలుత వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి నామినేషన్ పత్రాలను పరిశీలించి ఆమోదించారు. ఆ తర్వాత రమణయ్య నామినేషన్ పత్రాలను పరిశీలించారు. రమణయ్య నామినేషన్ పత్రాల్లో ప్రతిపాదించిన వ్యక్తుల సంతకాలు ఫోర్జరీవని రామసుబ్బారెడ్డి, మరికొందరు ఆర్వో దృష్టికి తీసుకు వచ్చారు. అదే సమయంలో రమణయ్య నామినేషన్ పత్రాల్లో ఉన్నవి తమ సంతకాలు కాదని, ఫోర్జరీ చేశారని కౌన్సిలర్లు శివజ్యోతి, చిన్న వెంకట సుబ్బారెడ్డి, ఖాదర్‌బాషా ఆర్వోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వారే స్వయంగా సంతకాలు చేశారని రమణయ్య చెప్పగా, ఇందుకు ఆధారాలుంటే సమర్పించాలని ఆర్వో మధ్యాహ్నం 1 గంట వరకు గడువిచ్చారు. లేనిపక్షంలో క్రిమినల్ కేసు నమోదుచేస్తామని ఆర్వో చెప్పారు. వీడియో ఉంటే సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత ఇద్దరు అభ్యర్థులనూ పిలిపించారు. ఆధారాలు చూపాలని రమణయ్యను అడగ్గా, లేవని ఆయన చెప్పారు. దీంతో రమణయ్య నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ఆర్వో ప్రకటించారు. అంతేకాకుండా సంతకాల ఫోర్జరీ ఫిర్యాదుతో రమణయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులకు సిఫార్సు చేశారు.



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రామసుబ్బారెడ్డి నామినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిటర్నింగ్ అధికారి

పొన్నపురెడ్డి ఎన్నిక లాంఛనమే

వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. టీడీపీ నేతలు స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దించిన రమణయ్య నామినేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో రామసుబ్బారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక ఖరారైంది. ఈనెల 27వ తేదీన రామసుబ్బారెడ్డికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సాయికాంత్‌వర్మ డిక్లరేషన్ ఫారాన్ని అందించనున్నారు.

జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు



న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు . చిత్రంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తదితరులు

- ఆయన సేవల్ని కొనియాడిన సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా
- తండ్రి పద్మనాభరెడ్డి, చిన్నాన్న జస్టిస్ చిన్నపరెడ్డే మార్గదర్శకులన్న జస్టిస్ ప్రవీణ్
- జస్టిస్ ప్రవీణ్ దంపతులకు ఘన సన్మానం

సాక్షి, అమరావతి: నేడు (శనివారం) పదవీ విరమణ చేయనున్న సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్‌కు హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. శనివారం హైకోర్టుకు పాలనాపరమైన సెలవు కావడంతో శుక్రవారమే ఆయనకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. జస్టిస్ ప్రవీణ్‌కు వీడ్కోలు పలికేందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలో న్యాయమూర్తులందరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీజే జస్టిస్ మిశ్రా మాట్లాడుతూ జస్టిస్ ప్రవీణ్‌కుమార్ న్యాయ వ్యవస్థకు ఎంతో సేవ చేశారన్నారు. న్యాయమూర్తిగా ఆయన 26 వేల కేసులను పరిష్కరించారని చెప్పారు. హైకోర్టు విభజన తరువాత హైకోర్టు విజయవాడకు వచ్చిన తరువాత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఎంతో కష్టపడ్డారన్నారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ యువ న్యాయవాదులకు ఆదర్శప్రాయుడని చెప్పారు. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథారిటీ వంటి సంస్థలకు నేతృత్వం వహించి చక్కని సేవలు అందించారన్నారు. పాలనాపరమైన విషయాల్లో తనకు ఎంతో సహకరించారని జస్టిస్ మిశ్రా చెప్పారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి పద్మనాభరెడ్డి, చిన్నాన్న జస్టిస్ చిన్నపరెడ్డి తనకు మార్గదర్శకులన్నారు. అనిశ్చిత సమయాల్లో వారే తనకు మార్గదర్శనం చేశారని తెలిపారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తన వృత్తి జీవితం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇన్నేళ్ల తన ప్రస్థానంలో తనకు సహకరించిన వారందరికీ ఆయన పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్ , బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ పదవీ విరమణ తరువాత జస్టిస్ ప్రవీణ్‌కుమార్ న్యాయ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు. జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. అనంతరం హైకోర్టు న్యాయవాదుల సంఘం జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించింది.


రూపాలి జకాకా

'ఆమె చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ మెచ్చుకోవాలి' అని ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఇటీవల ట్విటర్‌లో కామెంట్ చేశారు. 75 ఏళ్ల రూపాలి జకాకాను రాయగడ జిల్లాలోని మన్యం ప్రాంతంలో మన్యం థెరిసాగా పిలుచుకుంటారు. దానికి కారణం గవర్నమెంట్‌తో ఏ పని జరగాలన్నా ఈమె సాయం చేయాల్సిందే.

మన్యం థెరిసా

మన్యంలోని సాహి అనే గ్రామంలో చీకటి పడి భోజనాలు అయ్యాక ఒక్కొక్కరుగా రూపాలి జకాకా ఇంటికి చేరుకుంటారు. అక్కడ సభ తీరి తమ కష్టసుఖాలు చెప్పుకుంటారు. ఆమె అన్నీ వింటుంది. ఎవరికి ఏ సాయం కావాలో, ఏ పథకం ద్వారా సాయం అందించాలో జ్ఞాపకం పెట్టుకుంటుంది. తెల్లవారి లేచి ఇంట్లో పనులు ముగించుకుని ఊర్లో ఉన్న స్కూల్ దగ్గరకు వెళుతుంది. అక్కడి హెడ్మాస్టర్‌కు ఆమె ఏ పని మీద వచ్చిందో తెలుసు. ఒక్కొక్కరి పేరు ఆమె చెబుతుంటే వారి పేరుతో అప్లికేషన్లు రాసి సహాయం చేస్తాడు. ఆమె వాటిని అధికారులకు చేరవేయడానికి బయలుదేరుతుంది. దాదాపుగా ఇది ఆమె దినచర్య.

ఒరిస్సా రాయగడ జిల్లాలోని హలువా పంచాయతీలో సాహితో సహా 18 గ్రామాలు ఉన్నాయి. అన్నీ ఆదివాసీ గ్రామాలే. పెద్ద వాళ్లంతా దాదాపుగా నిరక్షరాస్యులే. వారందరి సమస్యలు తీర్చే స్వచ్ఛంద కార్యకర్త రూపాలి జకాకా.

భర్త మరణంతో

రూపాలి జకాకాకు 35 ఏళ్లు ఉన్నప్పుడు ఆమె భర్త అంతర్ జకాకాకు జబ్బు చేసింది. హలువాలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో చేతనైన వైద్యం చేశారు గాని అది సరిపోలేదు. ఇంతకు మించి వైద్యం చేయాలంటే రాయగడ వెళ్లాలి. ఉచిత వైద్యం పొందాలి. అది ఎలాగో చెప్పమని వారినీ వీరినీ బతిమాలింది. ఎవరూ సాయం చేయలేదు. భర్త మరణించాడు. కూతురితో జకాకా మిగిలింది. 'మన బతుకులు ఇంతేనమ్మా. దిక్కులేని బతుకులు. వీరి కోసం ఏదైనా చేయి నువ్వు' అని ముసలి తండ్రి అన్నాడు. ఆ మాటలు జకాకా మీద పని చేశాయి. అప్పటికి ఆమె వంట చెరకు సేకరించి అమ్మి బతుకుతోంది. ఇల్లు కూడా సరిగా లేదు. అయినా సరే తన బాగు చూసుకోక అందరి కోసం పని చేయడం మొదలుపెట్టింది. గత 40 ఏళ్లుగా చేస్తూనే ఉంది.

> "మేము అడవిలో ఉంటాము గనుక అధికారులు వచ్చేవారు కాదు. నేనే రాయగడకు తిరిగి వారిని రప్పించేలా చేశాను."
> – జకాకా

ప్రభుత్వం ప్రజల కోసం, ఆదివాసీల కోసం ఏమేం పథకాలు నిర్వహిస్తోందో కనుక్కుని అవన్నీ అందేలా సాయం చేస్తోంది జకాకా. 'మేము అడవిలో ఉంటాము గనుక అధికారులు వచ్చేవారు కాదు. నేనే రాయగడకు తిరిగి వారిని రప్పించేలా చేశాను' అంటుంది జకాకా. పథకాలు అందాలంటే డెత్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్ చాలా ముఖ్యమని ఆమె తెలుసుకుంది. అందుకే తన పంచాయతీలో చావు, పుట్టుక జరిగితే సర్టిఫికెట్లు తీసుకోమని వెంట పడుతుంది. అవి వచ్చేలా చూసి వారి కుటుంబ సభ్యులకు వాటిని అందిస్తుంది.

5000 మందికి సాయం

ఇంత వయసు వచ్చినా జకాకాలో చరుకుదనం పోలేదు. ఎంత దూరమైనా నడుస్తుంది. కంటి చూపుకు ఢోకా లేదు. అందుకే ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఊళ్లోనో చుట్టుపక్కల పల్లెల్లోనో తిరుగుతూనే ఉంటుంది. ఇప్పటికి ఆమె 5000 మందికి సాయం అందించినట్టు అధికారులే లెక్క తేల్చడం కాదు... ఇటీవల రాయగడకు పిలిచి సన్మానం కూడా చేశారు. ఒరిస్సా ముఖ్యమంత్రి ఆమెను మెచ్చుకుంటూ ట్వీట్ చేసి 'ప్రజల కోసం ఉద్దేశించిన పథకాలు అట్టడుగు స్థాయికి చేరాలంటే ఇటువంటి వారు చేసే కృషి స్ఫూర్తి కావాలి' అన్నారు.

జకాకా ఇప్పుడు తన కూతురు, మనవరాలు, మనవడితో కలిసి జీవిస్తోంది. పంట పొలాల్లో పని ఉంటే చేస్తోంది. అధికారులు ఆమెకు 20 కేజీల బియ్యం, 500 రూపాయల నగదు ప్రతి నెలా అందేలా శాంక్షన్ చేశారు. ఇప్పటికీ ఆమె ఇల్లు అంతంత మాత్రంగానే ఉంది. అయినా సరే తన కోసం కాకుండా ఊరి జనాల కోసం ఆమె తిరుగుతూనే ఉంటుంది. సాటి వారికి సాయం చేయడంలో సంతృప్తే ఆమెకు సంజీవనిలా పని చేస్తున్నట్టుంది.


ప్రతీకాత్మక చిత్రం

• ప్లాస్టిక్ కాలుష్యానికి చెక్

ఇంట్లోనే మొదలవ్వాలి

మీకు తెలుసా? ప్రపంచ వ్యాప్తంగా తయారవుతున్న ప్యాకింగ్ మెటీరియల్‌లో మూడింట రెండు వంతులు ఆహార పదార్థాలను ప్యాక్ చేయడానికే ఖర్చవుతోంది. ఈ ప్యాకింగ్ మెటీరియల్‌లో పేపర్, పేపర్ బోర్డ్, కార్డ్ బోర్డ్, వ్యాక్స్, ఉడ్, ప్లాస్టిక్‌లు, మోనో కార్టన్‌లు... ఇంకా రకరకాలవి ఉపయోగిస్తారు. మిగిలిన అన్నిటికన్నా ప్యాకింగ్ మెటీరియల్‌లో ఉపయోగించే ప్లాస్టిక్ శాతం తక్కువే. కానీ మట్టిలో కలిసిపోకుండా పల్లపు ప్రదేశాలకు కొట్టుకుపోతున్న ప్లాస్టిక్ తోనే సమస్య. క్లైమేట్ చేంజ్, పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందుల మీద చర్చించిన ఐక్యరాజ్య సమితి... నదులు, సముద్రాలను ముంచెత్తుతోన్న కాలుష్యాన్ని ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభంగా పేర్కొంది. మారుతున్న జీవనశైలి, ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న ఈ సమస్యకు మన వంతుగా చెక్ పెట్టడం ఎంతవరకు సాధ్యమో చూద్దాం.

ఫ్యామిలీ ఆడిట్

ప్యాకింగ్ మెటీరియల్‌ని తిరిగి ఉపయోగించడం పట్ల శ్రద్ధ చూపించకపోవడం కూడా ప్రధానమైన కారణం. 'స్వీడన్ వంటి కొన్ని దేశాల్లో ఒక్కశాతం కంటే ఎక్కువ ప్యాకింగ్ మెటీరియల్ చెత్తలోకి వెళ్లదు. అంటే అక్కడ 99 శాతం మళ్లీ వాడకంలోకి వస్తోంది. అదే మనదేశంలో రీయూజ్ 22 శాతానికి మించడం లేద'ని బెంగళూరుకు చెందిన పర్యావరణవేత్త నరేశ్ హెగ్డే చెప్పారు. ''మన దేశంలో ముఖ్యంగా పెద్ద నగరాల్లో ఒక్కో కుటుంబం నుంచి ఉదయం పాలప్యాకెట్‌తో మొదలయ్యే ప్యాకింగ్ అవసరం రాత్రి పడుకునే ముందు ఇంటి బయట పెట్టే చెత్త కవర్‌ల వరకు సగటున రెండు నుంచి మూడు కిలోల ప్యాకింగ్ వేస్ట్ ఉత్పత్తి అవుతోంది. ఫుడ్ ఆర్డర్‌ల ద్వారా వచ్చే ప్యాకెట్లది సింహభాగం. ఈ సమస్య సంపన్న కుటుంబాల్లోనే ఎక్కువ. కానీ ఈ విషయంలో ప్రతి కుటుంబం ఆడిట్ చేసుకోవాలి. వ్యర్థాల ఉత్పత్తిని ఎంత మేర నిలువరించవచ్చు అని విశ్లేషించుకుని అమలు చేయాలి'' అని చెబుతున్నారు పర్యావరణవేత్తలు.

రీ యూజ్

''మనం ఇప్పుడిప్పుడు ఇళ్లలో తడిచెత్త, పొడిచెత్తలను వేరు చేయడం వరకు అలవరుచుకుంటున్నాం. ఇకపై ఈ రెండింటితోపాటు రీ యూజబుల్ మెటీరియల్‌ను వేరు చేయడం కూడా అలవాటు చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ బ్యాగ్ ఒకసారి వాడి పారేయకుండా వీలైనన్ని ఎక్కువ దఫాలు వాడడం ఒక సూచన. ఇక కొన్నింటిని వాడి పారేయాల్సిందే, తిరిగి వాడడానికి వీలుకాదు. ఉదాహరణకు షాంపూ ప్యాకెట్‌లు, కాస్మటిక్ ఉత్పత్తులు ఈ కోవలోకి వస్తాయి. చైతన్యం ఉన్నప్పటికీ ఎలా డిస్పోజ్ చేయాలో తెలియకపోవడం ఒక కారణం. ప్లాస్టిక్‌ని సరైన విధానంలో రీ సైకిల్ చేయడం, పరిహరించడం మనకు మనంగా చేయగలిగిన పని కాదు. తయారు చేసిన కంపెనీలకే ఆ బాధ్యతను అప్పగిస్తూ ప్రభుత్వాలు చట్టాలు చేయాలని పలు సందర్భాల్లో సూచించాం. ఇదెలాగంటే... సౌందర్యసాధనాలు, షాంపూ, వాషింగ్‌పౌడర్, క్లీనింగ్ ఉత్పత్తులను వాడేసిన తర్వాత ప్యాకెట్‌లను ఏ దుకాణంలో కొన్నామో అదే దుకాణంలో తిరిగి డిపాజిట్ చేయడం అన్నమాట. ఒక వస్తువు ఉత్పత్తి చేసిన కంపెనీ నుంచి కిరాణా దుకాణం వరకు సరఫరా అయినట్లే ఖాళీ ప్యాకెట్లు కూడా సప్లయ్ బ్యాక్ సిస్టమ్ ద్వారా తయారీ స్థానానికి తిరిగి చేరాలి. ఈ నియమాన్ని పాటించగలిగితే ఈ సంక్షోభానికి అడ్డుకట్ట వేయవచ్చు'' అంటారు పర్యావరణ విశ్లేషకులు దొంతి నరసింహారెడ్డి.

నిజానికి భారతీయుల జీవనశైలిలో సింగిల్ యూజ్ కంటే ముందు రీ యూజ్ ఉండేది. పాళీతో రాసే ఇంకు పెన్నుల నుంచి కాటన్ చేతి సంచీ వరకు ప్రతి వనరునీ వీలైనన్ని ఎక్కువసార్లు ఉపయోగించేవాళ్లం. యూజ్ అండ్ త్రో, సింగిల్ యూజ్ మాటలు పాశ్చాత్యదేశాల నుంచి నేర్చుకున్న అపభ్రంశమే. కానీ ఇప్పుడు ఆయా దేశాలు రీ యూజ్ వైపు మరలుతూ ఇండియాను వేలెత్తి చూపిస్తున్నాయి. మనం వీలైనంత త్వరగా మనదైన రీ యూజ్ విధానాన్ని తిరిగి మొదలుపెడదాం. ఇంటి వాతావరణాన్ని మార్చుకోగలిగితే అది పర్యావరణ సమతుల్యత సాధనలో తొలి అడుగు అవుతుంది.

– వాకా మంజులారెడ్డి

ప్రత్యామ్నాయాలున్నాయి!

* బర్త్‌డే పార్టీలో థర్మాకోల్ బాల్స్, ప్లాస్టిక్ చమ్కీలను వాడుతుంటారు. అవి లేకుండా వేడుకను ఎకో ఫ్రెండ్లీగా చేసుకోవాలి.
* పెళ్లిళ్లు ఎకో ఫ్రెండ్లీ వాతావరణంలో చేసుకోవాలి.
* ఇంట్లో ప్లాస్టిక్‌ని అవసరమైన వరకు మాత్రమే ఉపయోగించాలని, తప్పనిసరిగా రీయూజ్ చేయాలనే నియమాలను పెట్టుకోవాలి. ఆ నినాదాన్ని ఇంటి గోడ మీద రాసుకుంటే మనల్ని చూసి మరి కొంత మంది ప్రభావితమవుతారు.
* పేపర్ బ్యాగ్, కాటన్ బ్యాగ్, మొక్కజొన్న పిండితో తయారవుతున్న క్యారీ బ్యాగ్‌ల వంటి ప్రత్యామ్నాయాలను వాడవచ్చు.

షీ ఈజ్ అన్‌స్టాపబుల్

స్త్రీ శక్తి





నేవీ వెల్‌నెస్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని, నౌకాదళానికి చెందిన వివిధ విభాగాల మహిళలు 'షీ ఈజ్ అన్‌స్టాపబుల్' నినాదంతో ఈ నెల 14న ఢిల్లీలోని వార్ మెమోరియల్ నుంచి కారు యాత్ర చేపట్టారు. వివిధ నగరాల గుండా సాగిన ఈ కారు యాత్ర మహిళా యోధుల విజయాలను ప్రచారం చేస్తోంది.

జైపూర్‌లోని ఒక కళాశాలలో...

నావికా దళానికి చెందిన పాయల్ గుప్తా, వికాస్ శ్రేయాన్, కుషాల్ పండేకర్‌లు గోవా నుంచి పోర్ట్ లూయిస్ (ఈస్ట్ ఆఫ్రికా) వరకు చేసిన సంచలన సముద్ర యాత్ర గురించి కళ్లకు కట్టినట్లు వివరించారు.

వాతావరణ పరిస్థితులను తట్టుకొని 21 రోజుల పాటు 4.500 కి.మీ నాన్‌స్టాప్‌గా సాగిన ఈ సాహస సముద్ర యాత్ర గురించి విద్యార్థులు ప్రశ్నల వర్షం కురిపించడంతోపాటు నేవీలో చేరడానికి అవసరమైన విద్యార్హతల గురించి ఆసక్తిగా అడిగారు.

బికనేర్‌లోని ఒక స్కూల్‌లో...

లెఫ్టినెంట్ కమాండర్ వర్తికా జోషి నేతృత్వంలో లెఫ్టినెంట్ కమాండర్‌లు ప్రతిభ జమ్వాల్, స్వాతి, విజయాదేవి, ఐశ్వర్య, పాయల్‌గుప్తాలు దేశీయంగా తయారుచేసిన ఐఎన్ఎస్‌వీ తరిణి నౌక ద్వారా వివిధ దేశాలు చుట్టి వచ్చిన 'నావికా సాగర్ పరిక్రమ' గురించి 'షీ ఈజ్ అన్‌స్టాపబుల్' బృందం చెప్పింది విన్న తరువాత విద్యార్థులు చప్పట్లు కొట్టారు. తమకు కూడా అలాంటి సాహసాలు చేయాలని ఉందని మనసులో మాట చెప్పారు.

నావికాదళానికి సంబంధించి మహిళల సాహసగాథలు మాత్రమే కాకుండా అలనాటి స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను చెప్పి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను గుర్తుతెచ్చుకుంది ఈ బృందం.

ఇలా ఎన్నో పట్టణాలలో స్కూల్, కాలేజీ విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి నావికాదళ ప్రాముఖ్యత, నావికాదళంలో ఉద్యోగావకాశాల గురించి తెలియజేయడం మాత్రమే కాదు వ్యక్తిత్వ వికాస కోణంలో ఈ బృందం సభ్యులు స్ఫూర్తిదాయకమై ఉపన్యాసాలు ఇచ్చారు. లైఫ్ స్కిల్స్ గురించి వారికి అర్థమయ్యే భాషలో వివరించారు.

వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలను సందర్శించి అక్కడ ఉంటున్న వారితో ఆప్యాయంగా మాట్లాడారు.

మహిళల సముద్ర సాహసయాత్రలు ఆయా కాలాలకు మాత్రమే పరిమితమైనవి కావు. ఆ యాత్రలలో ఎన్నో కథలు దాగున్నాయి. శక్తిమంతమైన స్ఫూర్తి ఉంది. వీటిని ప్రజలకు చేరువ చేయడం 'షీ ఈజ్ అన్‌స్టాపబుల్' యాత్ర ముఖ్య ఉద్దేశం. వచ్చిన స్పందన చూస్తే యాత్ర ఉద్దేశం నెరవేరిందని చెప్పవచ్చు.

'నారీశక్తి స్ఫూర్తిని ప్రజల చెంతకు తీసుకువెళ్లడానికి, నావికాదళంలో చేరాలనే ఉత్సాహాన్ని యువతలో కలిగించడానికి ఈ యాత్ర ఉపయోగపడింది' అంటున్నారు వైస్ అడ్మిరల్ దినేష్ త్రిపాఠి.

2,300 కి.మీల ఈ ఆల్–ఉమెన్ కారు యాత్ర ఈరోజు ఢిల్లీలో ముగుస్తుంది.

• రచన-నటన-దర్శకత్వం-సాంకేతిక సహకారం-సంగీతం

ఆల్ ఉమెన్ టీమ్

> కొన్ని నాటకాలు మన జీవితాల్లో నుంచే నడిచొస్తాయి. మన జీవితాన్ని కొత్తగా చూపుతాయి. ఆలోచనలకు పదును పెడతాయి. ఆల్–ఉమెన్ బృందం 'దేఖ్ బహెన్' అచ్చంగా అలాంటి నాటకమే!

తల్లి, కూతురు, భార్య, సోదరి, ప్రియురాలు... ఇలా రకరకాల పాత్రలలో ఉన్న మహిళలకు సంబంధించిన నాటకం దేఖ్ బహెన్. ఎనభై నిమిషాల నిడివిగల ఈ ఆల్–ఉమెన్ ప్లే రకరకాల మహిళలకు సంబంధించి రకరకాల భావోద్వేగాల సమ్మేళనం. జీవితంలోని తీపి, చేదుల కలయిక.

అస్త అరోర, ప్రీతి చావ్లా, ప్రేరణ చావ్లా, శిఖా తల్సానియా, తహీరనాథ్ కృష్ణన్ ఈ నాటకంలో నటించారు.

'రచన అనేది సులువైన పనేమీ కాదు. కత్తి మీద సాము. కొన్నిసార్లు మనతో మనమే పోరాడవలసి ఉంటుంది. ఇది కఠినమైన ప్రయాణమే అయినప్పటికీ మంచి అనుభూతిని కలిగించే ప్రయాణం. ఎన్నో విలువైన జ్ఞాపకాలను పదిలంగా భద్రపరుచుకునే ప్రయాణం' అంటుంది ప్లే రైటర్ దిల్‌షాద్ ఎడిబమ్ ఖురానా.

నాటక రచనలో ఖురానాకు కో–రైటర్ తహీరనాథ్ క్రిష్ణన్ సహకరించారు.

ఈ ఆప్తమిత్రులు నాటకరచన సమయంలో కొన్నిసార్లు ఒకరిపై ఒకరు యుద్ధం ప్రకటించుకుంటారు. అలా అని మొండిగా వ్యవహరించరు.

ఒకరి కాన్సెప్ట్ మరొకరికి నచ్చితే మళ్లీ ఆప్తమిత్రులు అవుతారు.


'దేఖ్ బహెన్' నాటక బృందం

'నాటక రచనలో ఇద్దరు వ్యక్తులు పాలుపంచుకున్నప్పుడు వాదోపవాదాలు సహజమే. అలా ఉంటేనే నాటకం బలంగా వస్తుంది. కొన్ని విషయాల్లో మా ఇద్దరి ఆలోచనల్లో తేడా ఉన్నప్పటికీ అనేక విషయాల్లో మేము ఒకేలా ఆలోచిస్తాం. ఇదే మా బలం' అని కో–రైటర్ తహీరనాథ్ క్రిష్ణన్ గురించి చెబుతుంది దిల్‌షాద్.

'మహిళల బృందానికి సంబంధించిన నాటకం ఇది. నేల విడిచి సాము చేయని నాటకం. హృదయానికి దగ్గరయ్యే నాటకం. రంగస్థలంపై కనిపించే దృశ్యాలు మనల్ని నిజజీవిత దృశ్యాలతో మమేకమయ్యేలా చేస్తాయి. కొత్తగా ఆలోచించేలా చేస్తాయి. అతి నాటకీయత లేకుండా డైలాగులు సహజంగా ఉంటాయి' అంటుంది కో–రైటర్ తహీరనాథ్ కృష్ణన్.

ముంబైకి చెందిన ప్రేరణ చావ్లా ఈ నాటకానికి దర్శకత్వం వహించింది.

'నన్ను సవాలు చేసే పనులను నెత్తికెత్తుకోవడం అంటే నాకు మొదటి నుంచి ఇష్టం. ఈ నాటకానికి డైరెక్టర్‌గా బాధ్యత తీసుకోవడం కూడా అలాంటిదే. టీమ్ నన్ను బలంగా నమ్మింది. ఆ నమ్మకమే నాకు మరింత బలాన్ని ఇచ్చింది. గొప్ప నటులతో పనిచేయాలనే నా కల దేఖ్ బహెన్ నాటకంతో నిజమైంది' అంటుంది ప్రేరణ చావ్లా.

నాటక రిహార్సల్ కార్యక్రమాలు ముంబైలో మిలిటరీ క్రమశిక్షణ ప్రమాణాలతో సాగాయి.

'మూస విధానంలో ఈ నాటకాన్ని రూపొందించలేదు. మహిళలకు సంబంధించిన అన్ని కోణాలను వ్యక్తీకరించే నాటకం ఇది' అంటున్నారు నిర్మాత ఆకర్ష్.

ఆకర్ష్ తప్ప ఈ నాటకానికి సంబంధించిన దర్శకులు, సాంకేతిక నిపుణులు, డిజైనర్‌లు, నటులు అందరూ మహిళలే.

'స్క్రిప్ట్ నచ్చిన తరువాత నాటకం విషయంలో జోక్యం చేసుకోలేదు. వారికి పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చాను. ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ నాటకం గొప్పగా వచ్చేలా చేశారు. ఈ నాటకం ద్వారా మేము ముందడుగు వేసినట్లుగా భావిస్తున్నాం' అంటున్నాడు ఆకర్ష్.

కిచెన్‌టిప్స్



• ఎండాకాలంలో పెరుగు తొందరగా పులిసిపోతుంటుంది. అలా కాకుండా ఉండాలంటే తోడు పెట్టిన తర్వాత పాలల్లో చిన్న కొబ్బరి ముక్కవేస్తే పెరుగు కమ్మగా ఉంటుంది.
• తేనెసీసాలో రెండు మూడు మిరియాలు వేస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. చీమలు కూడా పట్టవు.
• నిమ్మకాయ రసం పిండివేశాక, ఆ నిమ్మడిప్పల్ని పారవేయకుండా వాటితో ప్లాస్టిక్ సామానును రబ్ చేయండి మురికి పోయి అది మెరిసిపోవటాన్ని మీరు గుర్తించగలుగుతారు.
• నిమ్మరసం ఎక్కువగా రావాలంటే పది నిముషాల పాటు గోరు వెచ్చటి నీటిలో వేసి ఉంచాలి. ఒకవేళ ఫ్రిజ్‌లో ఉంటే వాటినుంచి రసం తీయటానికి పది నిమిషాల ముందు బయటపెట్టాలి.



అధిక కొలెస్ట్రాల్ లక్షణాలని గుర్తించండి ఇలా...

ఆహారంలో ఉప్పు తక్కువ తీసుకుంటున్నా మీకు బీపీ పెరుగుతోందా? కాళ్లూ చేతులు తిమ్మిర్లుగా ఉంటున్నాయా? గోళ్ల రంగు మారుతోందా? ఇవన్నీ వ్యాధి లక్షణాలే. అయితే భయపడవద్దు. అది ఏమంత ప్రమాదకరమైనది కాకపోవచ్చు కానీ, తేలిగ్గా కూడా తీసుకోకూడదు. మీ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగిందనడానికి నిదర్శనం అది. కొలెస్ట్రాల్ దానంతట అది ప్రమాదకరమైనది కాదు కానీ, ఇతర వ్యాధులకు దారితీస్తుంది. అందువల్ల దానిని నిర్లక్ష్యం చేయద్దు. అసలు మన శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువ ఉంటే ఏ లక్షణాలుంటాయో అవగాహన కోసం.

సాధారణంగా కొలెస్ట్రాల్ పేరు వినగానే అది చాలా చెడ్డదని అనుకుంటారు. కానీ ఇందులో రెండు రకాల కొలెస్ట్రాల్‌లు ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలను తయారు చేయడానికి సహాయపడుతుంది. కానీ చెడు కొలెస్ట్రాల్ పరిమాణం పెరిగినప్పుడు రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోయి రక్తం గడ్డకట్టడానికి దారితీస్తుంది. ఇది రక్త ప్రవాహానికి ఆటంకం కలిగిస్తుంది. ఈ ప్రమాదాలను నివారించడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. మంచి జీవనశైలిని అనుసరించాలి.

కొలెస్ట్రాల్ పెరిగిందనడానికి కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. అవి...

1. అధిక రక్తపోటు: శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగితే అది నేరుగా రక్తపోటుకు దారితీస్తుంది. రక్తంలో కొవ్వు శాతం ఎంత పెరిగితే రక్తపోటు అంతగా పెరుగుతుంది కాబట్టి కారణం తెలియకుండానే బీపీ పెరిగిపోతుంటే కొలెస్ట్రాల్ ఉందేమో అని అనుమానించాల్సి ఉంటుంది.

2. కాళ్లు, చేతులు తిమ్మిర్లు, పాదాలు మొద్దుబారడం: కాళ్లు చేతులు తిమ్మిరికి గురి కావడాన్ని తేలికగా తీసుకోవద్దు. ఇది అధిక కొలెస్ట్రాల్‌కు సంకేతంగా గుర్తించాలి. ధమనులలో రక్త ప్రసరణ, ఆక్సిజన్ సరఫరాలో అవరోధం ఉండటం వల్ల ఇలా జరుగుతుంది. పాదాలలో నొప్పి, తిమ్మిరి కారణంగా రక్త సరఫరా సరిగ్గా జరగదు.

3. గోర్ల రంగులో మార్పు: శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు ధమనులలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది సిరల్లో రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. చేతివేళ్లు, కాలి వేళ్లకు సరైన రక్త సరఫరా లేకపోవడం వల్ల అవి లేత గులాబీ రంగులోకి లేదా పసుపు రంగులోకి మారుతాయి. ఉండవలసిన దానికన్నా అధిక కొవ్వు ఉండటం వల్ల ఇలా జరుగుతుందని గుర్తించాలి.

మధుమేహం ఉంటే కొలెస్ట్రాల్ కూడా పెరుగుతూ ఉంటుంది. అందువల్ల మధుమేహం ఉన్న వాళ్లు మూడు నెలలకొకసారి రక్తంలో సరాసరి చక్కెర శాతం ఎంత ఉందో తెలుసుకునే పరీక్షతోపాటు కొలెస్ట్రాల్ పాళ్లను తెలుసుకునే పరీక్ష కూడా చేయించుకుని దానిని అదుపు చేసేందుకు తగిన మందులు తీసుకోవాలి.

మీ పిల్లలు తరచు దగ్గు, జలుబుతో బాధపడుతున్నారా?

ఇది అటు చలి కాలం కాదు, అలాగని పూర్తి వేసవి కాలమూ కాదు... అటూ ఇటూ కానీ సంధికాలం. ఈ కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా చిన్నపిల్లలే తరచుగా అనారోగ్యం బారిన పడుతుంటారు. వాటిలో ప్రధానమైనవి దగ్గు, జలుబు. అలెర్జీ, దగ్గు, న్యూమోనియా, బ్రాంకైటిస్, అధిక జ్వరం, టాన్సిలైటిస్, చెవి ఇన్ఫెక్షన్ సమస్యలు పిల్లలకు తరచు సోకుతుంటాయి.



తప్పక గుర్తుంచుకోవాల్సిన విషయాలు

పిల్లలకు దగ్గు, జలుబు వంటి సమస్యలుంటే కృత్రిమ రంగులు కలిపిన ఆహారాలు, అధిక తీపి, ఎక్కువ చల్లగా ఉండే ఆహారాలను తినిపించకూడదని వైద్యులు సలహానిస్తుంటారు. ఎందుకంటే ఇవి దగ్గును ఎక్కువ చేస్తాయి. అలాగే బ్యాక్టీరియా పెరిగేలా చేస్తాయి. అంతేకాదు ఇది సంక్రమణ ప్రమాదాన్ని కూడా పెంచుతాయి.

వీటితోపాటు క్యాండీలు, ఐస్‌క్రీం, చాక్లెట్లు, డోనట్స్, పేస్ట్రీలు, ద్రాక్ష, రిఫ్రిజిరేటర్‌లో ఉండే చల్లని ఆహారాలకు పిల్లలను వీలైనంత దూరంగా ఉంచాలి. ఎందుకంటే ఇవి దగ్గును బాగా పెంచుతాయి. దుమ్ము, ధూళి ఎక్కువగా ఉన్న ప్రదేశాలకు పిల్లలను పంపించకూడదు. ఎందుకంటే ఇవి దగ్గును ప్రేరేపిస్తాయి. ముఖ్యంగా పిల్లలకు బొమ్మలు ఇవ్వాల్సి వస్తే.. వాటిని వాష్ చేసిన తర్వాతే ఇవ్వండి. అలాగే పావురాలు, ఇతర పెంపుడు జంతువులకు కొద్దిగా దూరంగా ఉంచండి. ఇవి అలెర్జీని కలిగిస్తాయి.

నడక మంచిదే... ఫిట్‌నెస్ ఊరికే రాదు!

ప్రస్తుతపు ఉరుకులు పరుగుల లైఫ్‌లో మిషన్ల సాయం లేకపోతే పని నడవదు. అలాగని కదలకుండా కూర్చుంటే చేజేతులా ముప్పు తెచ్చుకున్నట్లే. మరయితే ఏం చేయాలి? మనసుంటే మార్గం ఉన్నట్లు ఈ బిజీ లైఫ్‌లో కూడా కొన్ని చిట్కాలను పాటించడం వల్ల ఆరోగ్యంగా, ఫిట్ గా ఉండొచ్చు. అవేమిటో చూద్దామా?



రకరకాల కారణాల వల్ల వ్యాయామం చేయడానికి సమయం లేని వారు కొన్ని చిట్కాలు పాటించడం వల్ల ఆరోగ్యంగా, ఫిట్ గా ఉండవచ్చు. అందులో నడక ఒకటి. అసలు ఎలా నడవాలి.. ఎప్పుడెప్పుడు నడిస్తే ఆరోగ్యంగా ఉంటామో ఇప్పుడు తెలుసుకుందాం..

మాట్లాడుతూనే నడవండి



కొంతమందికి పొద్దస్తమానం ఫోన్ మాట్లాడటం అవసరం. మరికొందరికి వృత్తిరీత్యా తప్పదు. చాలామందికి అలవాటు. అది వర్క్ కాల్ అయినా.. మీకు ఇష్టమైన వారితో చెప్పుకునే కాలక్షేపం కబుర్లే కావచ్చు... మాట్లాడండి. కానీ అలా మాట్లాడుతూనే నడవండి. ఎందుకంటే అరగంట వాకింగ్ చేస్తే ఒంటికి ఎంత మేలు జరుగుతుందో తెలుసా? ఇది మీ బరువును తగ్గించడానికి సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఆరోగ్యానికి మెట్లు



ఫిట్‌గా ఉండటానికి మెట్లను ఖచ్చితంగా ఎక్కాలని నిపుణులు చెబుతున్నారు. ఇది శరీర కదలికలు చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. మెట్లను ఎక్కుతున్నప్పుడు మీ హృదయ స్పందన రేటు పెరుగుతుంది. అందుకే లిఫ్ట్‌లో వెళ్లకుండా మెట్లను ఎక్కడం అలవాటు చేసుకోండి. అయితే కొన్ని రకాల శారీరక ఇబ్బందుల రీత్యా, కొన్ని శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారినీ వైద్యులు మెట్లు ఎక్కవద్దని చెబుతారు. అలాంటి వారు మాత్రం మెట్లెక్కడాన్ని మినహాయించాలి.

ఎక్కువ కదలడానికి ప్రయత్నించండి

మీ ఆఫీస్ దగ్గరలో ఉంటే నడిచి వెళ్లడానికి ప్రయత్నించండి. లేదా ఆఫీసుకు కనీసం 10 నుంచి 20 నిమిషాల నడక దూరంలో దిగి.. నడిచి వెళ్లండి. బస్సులో వెళ్లినా, కారులో వెళ్లినా ఇలాగే నడవండి. ఫిట్‌గా ఉండటానికి ఈ చిన్న చిన్న మార్పులు అత్యవసరం.

నిలబడి పనిచేయండి

మీరు పనిచేసే ప్లేస్‌లో మీకు సౌకర్యంగా ఉంటే నిలబడి పని చేయడానికి ప్రయత్నించండి. ఇలా కొద్దిసేపు నిలబడి పనిచేయడం వల్ల దీర్ఘకాలికంగా ప్రయోజనం పొందుతారు. అలా అని మరీ ఎక్కువసేపు నిలబడటం ఆరోగ్యానికి మంచిది కాదు.

టీవీ చూస్తున్నప్పుడు...



టీవీ లేదా సెల్ ఫోన్‌లో సినిమాలను చూస్తున్నప్పుడు ఒకే దగ్గర కూర్చోకుండా.. ట్రెడ్‌మిల్‌పై నడవడం లేదా సైక్లింగ్ లేదా శరీరాన్ని సాగదీయడం వంటి కొన్ని వ్యాయామాలను చేయడం వల్ల మీ శరీరం బాగా కదిలి ఆరోగ్యంగా ఉంటుంది.

డ్యాన్స్ బెస్ట్

సమయం దొరికినప్పుడల్లా మీ శరీరాన్ని కదిలించడానికి ప్రయత్నించండి. అన్నింటిలో డ్యాన్స్ బెస్ట్. ఎందుకంటే ఇది వ్యాయామంగా అనిపించదు. కొన్ని నిమిషాలపాటు డ్యాన్స్ చేస్తే మనసుకు సంతోషం, శరీరానికి ఆరోగ్యం చేకూరతాయి.

వీటితోబాటు సాధ్యమైనంత వరకు ఇంట్లో మీ పనులు మీరే చేయండి. క్లీనింగ్, వాషింగ్, వంటపనుల్లో ఓ చేయి వేయండి. ఈ పనులు కూడా వ్యాయామం కిందికే వస్తాయి. మిమ్మల్ని ఫిట్‌గా ఉంచుతాయి.

• మీకు తెలుసా



జీడిపప్పులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని ఎన్నో వ్యాధులనుంచి రక్షిస్తాయి. జీడిపప్పులో ఉండే మెగ్నీషియం రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

జీడిపప్పును ఒక్కొక్కరు ఒక్కోలా తింటుంటారు. కొందరు పచ్చి జీడిపప్పును తింటే ఇంకొంతమంది వీటిని రాత్రి నానబెట్టి ఉదయం తింటుంటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జీడిపప్పును పాలలో నానబెట్టి తింటే వాటి ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి బాగా సహాయపడుతుంది.

ఇందుకోసం ఏం చేయాలంటే..?

రాత్రిపూట గ్లాసు పాలలో మూడు లేదా నాలుగు జీడిపప్పులను వేయండి. మరుసటి రోజు ఈ జీడిపప్పు తిని పాలను తాగండి. దాంతో మామూలుగా జీడిపప్పు తినడం వల్ల కలిగే ప్రయోజనాలకంటే అనేకరెట్లు అధిక ప్రయోజనాలను పొందవచ్చు. ఆరోగ్యానికి మంచిదని మోతాదుకు మించి తింటే ఆరోగ్యం దెబ్బతింటుంది జాగ్రత్త.

ఉదయం లేచిన తర్వాత వేడి వేడిగా టీ కానీ, కాఫీ కానీ తాగనిదే చాలా మంది రోజు మొదలవ్వదు. చాలా మంది సమయం సందర్భం లేకుండా టీ తాగుతూ ఉంటారు. లేవగానే ఒకసారి టీ తాగడం.. టిఫిన్ చేశాక టీ తాగడం, మళ్లీ సాయంత్రం, మధ్యాహ్నం భోజనం తర్వాత ఇలా.. ఎప్పుడు పడితే అప్పుడు తాగేస్తుంటారు. అయితే.. భోజనం తర్వాత టీ కానీ కాఫీ గానీ తాగడం వల్ల మనకు తెలీకుండానే సమస్యలు కొని తెచ్చుకున్నవాళ్లం అవుతామట. అదెలాగంటే... అన్నవాహిక అనేది ఒక పొడవాటి గొట్టం. ఇది మన నోటి నుంచి కడుపు వరకు ఉంటుంది. ఇది ద్రవాలు, లాలాజలం, నమిలిన ఆహారానికి వాహకంగా పనిచేస్తుంది. వేడి వేడి కాఫీ, టీలు ఎక్కువసార్లు తాగడం వల్ల అన్నవాహిక దెబ్బతిని క్యాన్సర్ల వంటివి వచ్చే ముప్పు ఉందట. అందువల్ల కాఫీ టీలు తాగేటప్పుడు అదీ మరీ వేడిగా తాగేటప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోవడం మంచిది.

• హెల్త్ టిప్స్



- రాత్రి పడుకోబోయేటప్పుడు ఒక గ్లాసు మంచి నీటిలో చిన్న పటిక బెల్లం ముక్కను వేసి ఉంచి ఆ నీటిని ఉదయం లేవగానే తాగాలి. పదిహేను రోజుల పాటు ఇలా చేస్తే పార్శ్వపు తలనొప్పి తగ్గుతుంది.
- చిటికెడు పసుపును గ్లాసు పాలలో కాచి, రోజూ ఉదయాన్నే తాగుతుంటే జలుబు, దగ్గు, ఆయాసం తగ్గుతాయి..
- గ్యాస్ట్రిక్ ట్రబుల్ తగ్గాలంటే రోజుకు రెండుసార్లు కప్పు పాలల్లో ముక్కలుగా చేసిన ఒక వెల్లుల్లి రెబ్బను వేసి బాగా మరగనిచ్చి వెల్లుల్లి ముక్కలను తీసి, ఆ పాలు తాగితే మంచి గుణం కన్పిస్తుంది.



- దగ్గు, ఆయాసంతో బాధపడేవారు స్పూన్ అల్లం రసం, స్పూను దానిమ్మరసం, స్పూన్ తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే సరి
- చిన్న పిల్లలు మలబద్ధకంతో బాధపడుతుంటే రోజూ రెండు స్పూన్లు ద్రాక్షరసం ఇస్తూ ఉంటే సమస్య తొలగుతుంది,
- అజీర్ణం, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడేవారు తోటకూర, క్యారెట్, నారింజలను సమంగా కలిపి ఆ మిశ్రమాన్ని రోజుకు మూడుసార్లు తీసుకోవాలి.



సినిమా

కస్టడీ కంప్లీట్


● నాగ చైతన్య

నాగచైతన్య 'కస్టడీ' పూర్తయింది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళ్) చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో అరవింద స్వామి విలన్ రోల్ చేస్తుండగా, ప్రియమణి, సంపత్ రాజ్, శరత్‌కుమార్ కీ రోల్స్ చేశారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా యూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది. ''చైతూ... మా 'కస్టడీ' నుంచి ఇక నీకు విడుదల'' అని వెంకట్ ప్రభు పేర్కొన్నారు. ''మే 12న మీ అందరినీ (ప్రేక్షకులు) కస్టడీలోకి తీసుకుంటాం'' అని పేర్కొన్నారు నాగచైతన్య, కృతీశెట్టి. ''నాగచైతన్య కెరీర్‌లోని అత్యంత భారీ బడ్జెట్ మూవీస్‌లో 'కస్టడీ' ఒకటి. ఇళయ రాజా, యువన్‌శంకర్ రాజా ఈ సినిమాకు మ్యూజిక్ అందించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆర్ఆర్ఆర్‌కి నామినేషన్స్

● యాక్షన్ మూవీ ● బెస్ట్ యాక్టర్


● రామ్‌చరణ్, ఎన్టీఆర్

'ది క్రిటిక్స్ చాయిస్ అసోసియేషన్' ఇచ్చే క్రిటిక్స్ చాయిస్ సూపర్ అవార్డ్స్ నామినేషన్స్ వెల్లడయ్యాయి. 'బెస్ట్ యాక్షన్ మూవీ', 'బెస్ట్ యాక్టర్ ఇన్ యాన్ యాక్షన్ మూవీ' విభాగాల్లో 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు నామినేషన్స్ లభించాయి. ఇక 'బెస్ట్ యాక్షన్ మూవీ' అవార్డు కోసం 'ఆర్ఆర్ఆర్'తో పాటు 'బుల్లెట్ ట్రైన్', 'టాప్‌గన్: మ్యావెరిక్', 'ది అన్‌బేరబుల్ వెయిట్ ఆఫ్ మాసివ్ టాలెంట్', 'ది ఉమెన్ కింగ్' చిత్రాలు పోటీలో నిలిచాయి. అలాగే 'బెస్ట్ యాక్టర్ ఇన్ యాక్షన్ మూవీ' విభాగంలో ఎన్టీఆర్ (ఆర్ఆర్ఆర్), రామ్‌చరణ్ (ఆర్ఆర్ఆర్), నికోలస్ కేజ్ (ది అన్‌బేరబుల్ వెయిట్ ఆఫ్ మాసివ్ టాలెంట్), టామ్ క్రూజ్ (టాప్‌గన్: మ్యావెరిక్), బ్రాడ్ పిట్ (బుల్లెట్ ట్రైన్)లు నామినేషన్స్ దక్కించుకుని అవార్డ్ కోసం పోటీ పడుతున్నారు. మరి.. ఎవరెవరికి అవార్డు దక్కుతుందో మార్చి 16న జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో తెలిసిపోతుంది.

ఊర మాస్


● నాని

నాని హీరోగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'దసరా'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా మార్చి 30న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. కాగా శుక్రవారం (ఫిబ్రవరి 24) నాని పుట్టినరోజు సందర్భంగా 'దసరా' కొత్త పోస్టర్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేశారు. లుంగీ కట్టుకుని కళ్లద్దాలు పెట్టుకుని బీడీ తాగుతున్న ధరణి (ఈ చిత్రంలో నాని పాత్ర పేరు)గా ఊర మాస్ లుక్‌లో కనిపించారు నాని.

అవసరానికో అబద్ధం


● త్రిగున్, రుబాల్ షేక్ రావత్

త్రిగున్, రుబాల్ షేక్ రావత్ జంటగా ఆయాన్ బొమ్మాళి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అవసరానికో అబద్ధం''. ఝాన్సీ, శ్రీ కృష్ణమూర్తి యలమంచిలి సమర్పణలో డా. శివకుమార్ చికిన సహకారంతో డా. జై జగదీశ్ బాబు యలమంచిలి నిర్మిస్తున్నారు. తొలి సన్నివేశానికి తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత 'దిల్' రాజు క్లాప్ కొట్టారు. మరో నిర్మాత సురేష్‌బాబు గౌరవ దర్శకత్వం వహించారు. ఆయాన్ బొమ్మాళి, కృష్ణమూర్తి, డా. జై జగదీశ్‌బాబు మాట్లాడుతూ– ''మనిషి జీవితంలో నిజానికి ఎంత ప్రాముఖ్యత ఉందో అబద్ధానికి కూడా అంతే ప్రాధాన్యత ఉందని చెప్పే సందేశంతో మా చిత్రం రూపొందుతోంది'' అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో విజయవాడ తూర్పు వైసీపీ ఇంచార్జ్ దేవినేని అవినాష్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ కోలేటి పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: సీహెచ్ మోహన్ చారి.

వినోదాల సుబ్రహ్మణ్యం


● రావు రమేష్ ● ఇంద్రజ

క్యారెక్టర్ ఆర్టిస్ట్, విలన్, కమెడియన్.. ఇలా విలక్షణ నటుడిగా ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రావు రమేశ్ తొలిసారి 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' అనే చిత్రంలో లీడ్ రోల్‌లో నటించనున్నారు. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్ష్మణ్ కార్య ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రంలో రావు రమేష్‌కి జోడీగా ఇంద్రజ నటించనున్నారు. పీబీఆర్ సినిమాస్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా రూపొందనున్న ఈ సినిమాని శుక్రవారం ప్రకటించారు. ''వినోదాత్మక కుటుంబ కథా చిత్రమిది. నడి వయసులో ఉన్న ఒక మధ్య తరగతి నిరుద్యోగి జీవితంలో క్షణ క్షణం జరిగే ట్విస్టులతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.. మార్చిలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు లక్ష్మణ్ కార్య.

అందుకే... ఆస్కార్ క్రైసిస్ టీమ్

గత ఏడాది జరిగిన 94వ ఆస్కార్ అవార్డుల వేడుకలో హోస్ట్ క్రిస్ రాక్, నటుడు విల్ స్మిత్‌ల మధ్య జరిగిన ఘటన గుర్తుండే ఉంటుంది. ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం వేదికపై తన భార్య, నటి జడా పింకెట్ స్మిత్‌పై క్రిస్ రాక్ జోక్స్ వేయడాన్ని సంహించలేకపోయిన విల్ స్మిత్ అందరూ చూస్తుండగానే క్రిస్‌రాక్ చెంప చెళ్లుమనిపించారు. ఈ ఘటన ఆస్కార్ చరిత్రలో ఓ బ్లాక్ మార్క్‌గా నిలిచిపోయిందని కమిటీ పేర్కొంది. 94వ ఆస్కార్ అవార్డుల వేడుకలో విల్ స్మిత్ బెస్ట్ యాక్టర్‌గా నిలిచారు. అయితే ఈ విషయం కన్నా ఎక్కువగా క్రిస్ రాక్‌పై చేయి చేసుకున్న విషయంలోనే వార్తల్లో నిలిచారు విల్ స్మిత్. ఈ నేపథ్యంలో పదేళ్ల పాటు ఆస్కార్ అవార్డు వేడుకలకు విల్ స్మిత్ హాజరు కాకుండా నిషేధం విధించింది కమిటీ. ఇక ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేలా, ఒకవేళ జరిగితే వెంటనే చర్యలు తీసుకునేలా ఈసారి ఆస్కార్ నిర్వాహకులు 'క్రైసిస్ టీమ్'ను ఏర్పాటు చేయనున్నారు. 94ఏళ్ల ఆస్కార్ అవార్డు చరిత్రలో ఇలా ఒక టీమ్‌ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ''గత ఏడాది జరిగిన ఆస్కార్ వేడుకలో జరిగిన ఓ ఘటన (విల్ స్మిత్ – క్రిస్ రాక్‌లను ఉద్దేశిస్తూ..) మమ్మల్ని కొత్తగా ఆలోచించేలా, సరికొత్త నిర్ణయాలు తీసుకునేలా చేసింది. ఇందులో భాగంగానే క్రైసిస్ కమ్యూనికేషన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఈ బృంద సభ్యులు అందుకు తగ్గట్లుగా త్వరితగతిన స్పందిస్తారు. ఈ క్రైసిస్ మెంబర్స్ సేవలు వినియోగంలోకి రాకూడదనే (ఆస్కార్ వేడుక సవ్యంగా జరగాలని ఆశిస్తూ...) కోరుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు ఆస్కార్ కొత్త సీఈఓ బిల్ క్రామెర్. ఇక 95వ ఆస్కార్ అవార్డుల వేడుక లాస్ ఏంజిల్స్ వేదికగా భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13న జరగనుంది. అలాగే బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు..' పాటకు ఆస్కార్ నామినేషన్ దక్కిన విషయం తెలిసిందే.


● గత ఏడాది వేడుకలో క్రిస్‌పై చేయి చేసుకున్న విల్ స్మిత్

మార్టిన్ వస్తున్నాడు

''దేశవ్యాప్తంగా కన్నడ సినిమాకు మంచి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉంది. సుదీప్, యశ్‌గార్లు నా సీనియర్ యాక్టర్స్. వారు ఆల్రెడీ పాన్ ఇండియా సినిమాలు చేశారు. వారితో నేను పోటీపడటం లేదు. ఓ యాక్టర్‌గా ఇంకా మెరుగయ్యేందుకు నాతోనే నేను పోటీ పడుతుంటాను'' అని అన్నారు హీరో ధ్రువ సర్జా. 'అద్దూరి' (2012) చిత్రం తర్వాత హీరో ధ్రువ సర్జా, దర్శకుడు ఏపీ అర్జున్ కాంబోలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'మార్టిన్'. ఈ చిత్రంలో వైభవి శాండల్య, అన్వేషి జైన్ హీరోయిన్స్‌గా నటించారు. యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కథ అందించిన ఈ సినిమాను ఉదయ్ కె. మెహతా నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ ఏడాది ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన 'మార్టిన్' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ధ్రువ సర్జా మాట్లాడుతూ– ''మార్టిన్' చిత్రం దేశ భక్తి నేపథ్యంలో ఉంటుంది. ఈ క్యారెక్టర్ కోసం నేను ఎంతగానో కష్టపడ్డాను. ఇంటర్‌నేషనల్ ఫైటర్స్‌తో కూడిన యాక్షన్ సన్నివేశాల కోసం బాగా బరువు పెరిగాను'' అన్నారు. ''రాజమౌళి, ప్రశాంత్ నీల్, మణిరత్నం వంటి దర్శకులు భాషా పరమైన హద్దులను చెరిపేశారు. ఇప్పుడు అంతా ఇండియన్ సినిమాయే'' అన్నారు అర్జున్. ''ధ్రువతో నేను గతంలో ప్రేమకథ చేశాను. ఇప్పుడు యాక్షన్ మూవీగా 'మార్టిన్' చేశాను'' అన్నారు అర్జున్ ఏపీ.


● ధ్రువ సర్జా

పల్లెటూరులో అంతిమ తీర్పు


● ధన్సిక

సాయి ధన్సిక, అమిత్ తివారి ప్రధాన పాత్రల్లో ఎ. అభిరాం దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అంతిమ తీర్పు'. శ్రీ సిద్ధి వినాయక మూవీ మేకర్స్‌పై డి.రాజేశ్వర రావు నిర్మిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ని శుక్రవారం విడుదల చేశారు. ఎ.అభిరాం మాట్లాడుతూ– ''డైరెక్టర్ ముత్యాల సుబ్బయ్యగారి వద్ద దర్శకత్వ శాఖలో పని చేశాను. 'అంతిమ తీర్పు' చిత్రం పల్లెటూరి నేపథ్యంలో ఉంటుంది'' అన్నారు. ''ఒక మంచి సినిమా తీయాలనే తపన, ప్యాషన్ రాజేశ్వర రావుగారిలో చూశాను'' అన్నారు అమిత్ తివారి. ''మంచి కథతో మీ ముందుకు వస్తున్నాం. ప్రేక్షకులు సపోర్ట్ ఇవ్వాలి'' అన్నారు సాయి ధన్సిక.

నా లక్ష్యం నెరవేరుతోంది


● వరంగల్ శ్రీనివాస్

''నా ప్రతిభను గుర్తించి దాసరి నారాయణరావుగారు 'అడివి చుక్క'లో పాట రాసే అవకాశం ఇచ్చారు. ఇప్పుడు ఆయన శిష్యుడు వి.సముద్రగారు నన్ను 'తారకాసురుడు' ద్వారా సంగీత దర్శకునిగా పరిచయం చేస్తుండటంతో నా లక్ష్యం నెరవేరుతోంది'' అన్నారు పాటల రచయిత, గాయకుడు, నటుడు వరంగల్ శ్రీనివాస్. వి. సముద్ర దర్శకత్వంలో 'తారకాసురుడు' చిత్రం తెరకెక్కుతోంది. వరంగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''మా అమ్మ, మా మేనత్తలు జానపదాలు ఆలపించేవారు. నన్ను సంగీత దర్శకుణ్ణి చేసింది కూడా అమ్మ పాటే. తెలుగుతో పాటు బెంగాలీ, అస్సామీ, ఒరియా... ఇలా పలు భాషల్లో పాటలు రాయడమే కాకుండా పాడాను. సంగీత దర్శకునిగా 'తారకాసురుడు' నా కెరీర్‌లో మైలురాయి అవుతుంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
142	45
59,464	17,466

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,383	▽ 209
డోజోన్స్	32,791	▽ 47
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,879	▽ 29
డాక్స్	15,210	▽ 226
షాంఘై	3,267	▽ 20
నికాయ్	27,402	△ 349

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	55,957 ▽ 123
బంగారం (22 క్యారెట్)	55,733 ▽ 122
వెండి (కిలో)	64,331 ▽ 851

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.93	83.60
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	97.89	101.22
€	యూరో	ఒకటి	86.22	89.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.48	62.43
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.34	57.70
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.68	62.64
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.07	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.63	23.43
¥	చైనా యువాన్	పదింటికి	10.80	12.87

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



హైదరాబాద్: ఆభరణాల తయారీ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకుంది. రిటైల్ జ్యువెలర్స్ వారి ఎండీ–సీఈఓ అవార్డుల్లో 'లీడింగ్ రిటైల్ చెయిన్ ఆఫ్ ది ఇయర్' అవార్డును దక్కించుకుంది. ''జీఆర్‌టీ స్వర్ణ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. ఆరు దశాబ్దాలుగా సాటిలేని మేటి డిజైన్ల కోసం అన్వేషిస్తూ, మేలిరకం ఆభరణాలను కస్టమర్లకు అందిస్తుంది. ఖాతాదారులకు మరిన్ని శాశ్వతమైన అనుభూతుల్ని అందించడానికి ఇలాంటి అవార్డులు మాకు మరింత ప్రేరణనిస్తాయి. బ్రాండ్‌పై విశ్వాసాన్ని కొనసాగిస్తున్న వినియోగదారులకు, నిరంతరంగా శ్రమిస్తున్న సిబ్బందికి ఈ అవార్డు అంకితం'' అని జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంతపద్మనాభన్ అన్నారు.

ఇగ్నిస్ ధర పెరిగింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రీమియం కాంపాక్ట్ కారు ఇగ్నిస్ ధరను రూ.27,000 వరకు పెంచింది. సవరించిన ధర వెంటనే అమలులోకి వస్తుందని కంపెనీ తెలిపింది. కొత్తగా ఫీచర్లను చేర్చడమే ధర పెంచడానికి కారణం. ఇగ్నిస్ అన్ని వేరియంట్లకూ ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, హిల్ హోల్డ్ అసిస్ట్ ఫీచర్లను ప్రామాణికంగా జోడించినట్టు కంపెనీ శుక్రవారం ప్రకటించింది. త్వరలో అమలులోకి రానున్న ఈ20, రియల్ డ్రైవింగ్ ఎమిషన్ (ఆర్‌డీఈ) ప్రమాణాలకు అనుగుణంగా కారును రూపొందించినట్టు వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

25-2-2023	
విశాఖ	400–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400–00
విజయవాడ	400–00
రిటైల్ ధర (డజను)	66.00
24-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	385–00
వరంగల్	387–00
రిటైల్ ధర	4.55

ఎకానమీ సవాళ్లను పరిష్కరించాలి!

- జీ20 దేశాలకు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్ సూచన
- ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల సమావేశంలో ప్రసంగం



యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌తో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్

బెంగళూరు: అంతర్జాతీయ ఆర్థిక అవుట్‌లుక్ ఇటీవలి నెలల్లో మెరుగుపడినప్పటికీ, అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. గ్లోబల్ ఎకానమీ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంపై జీ20 దేశాలు దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ఎదుర్కొంటున్న రుణ సమస్యలు, ఆర్థిక స్థిరత్వానికి ఎదురవుతున్న సవాళ్లను దృఢ సంకల్పంతో పరిష్కరించాలని కూడా జీ20 దేశాలకు పిలుపునిచ్చారు. జీ20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ల (ఎఫ్‌ఎంసీబీసీ) ప్రారంభ సమావేశంలో దాస్ చేసిన ప్రసంగ ముఖ్యాంశాలు..

- ప్రపంచం తీవ్ర మాంద్యం నుండి తప్పించుకోవచ్చని, వృద్ధి మందగమనం లేదా అంతగా తీవ్రత లేని మాంద్యం పరిస్థితులే సంభవించవచ్చని ఇప్పుడు గొప్ప ఆశావాదం ఉంది. అయితే, ఇంకా అనిశ్చిత పరిస్థితులు మన ముందు ఉన్నాయి.
- మధ్యస్థంగా, దీర్ఘకాలికంగా మనం ఎదుర్కొంటున్న సవాళ్లను మనం కలిసికట్టుగా దృఢంగా పరిష్కరించాలి. ఆర్థిక స్థిరత్వానికి సవాళ్లు, రుణ ఇబ్బందులు, క్లైమాట్ ఫైనాన్స్, వాణిజ్య రంగంలో పరస్పర సహకారం లోపించడం, గ్లోబల్ సరఫరాల సమస్యలు ఇక్కడ మనం ప్రస్తావించుకోవాలి. పటిష్ట ప్రపంచ ఆర్థిక సహకారంతో ప్రపంచ వృద్ధి విస్తృత స్థాయిలో మెరుగుపరచడం సాధ్యమవుతుంది.
- జీ20 గ్రూప్ ప్రస్తుతం పరివర్తన దిశలో ప్రయాణించడానికి సిద్ధంగా ఉంది. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి జీ20 ఒక బహుపాక్షిక ఫోరమ్‌గా అచంచలమైన విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం జరుగుతోంది.

ఆరో రోజూ ఆగని అమ్మకాలు..

- సెన్సెక్స్ నష్టం 142 పాయింట్లు
- 17, 500 దిగువకు నిఫ్టీ

ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లో నష్టాల పరంపర కొనసాగింది. ఆరంభ లాభాలను కోల్పోయిన స్టాక్ సూచీలు ఆరోరోజూ పతనాన్ని చవిచూశాయి. ఆసియా మార్కెట్లలోని బలహీనతలు, ఫెడ్ వడ్డీరేట్ల పెంపు భయాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్ల పతనం సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఉదయం సెన్సెక్స్ 59,859 వద్ద లాభంతో మొదలైంది. తొలి సెషన్‌లో 303 పాయింట్లు పెరిగి 59,909 వద్ద గరిష్టాన్ని తాకింది. మిడ్‌సెషన్ నుంచి అమ్మకాలు జరగడంతో ఆఖరికి 142 పాయింట్ల నష్టపోయి 59,464 వద్ద ముగిసింది. నిఫ్టీ 17,592 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడే 17,422–17,600 శ్రేణిలో కదలాడింది. చివరికి 45 పాయింట్ల పతనంతో 17,466 వద్ద నిలిచింది. ఇంధన, ఫార్మా, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. మెటల్, కమోడిటీ, ఆటో, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, పవర్, కన్జూమర్ షేర్లు లాభపడ్డాయి.



మార్కెట్లో మరిన్ని సంగతులు

- గత 6 రోజుల్లో సెన్సెక్స్ 1,856 పాయింట్లు, నిఫ్టీ 550 పాయింట్ల చొప్పున క్షీణించాయి. సూచీలు 3% పైగా కుదేలవడంతో స్టాక్ మార్కెట్లో రూ.8.30 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. బీఎస్‌ఈ నమోదిత కంపెనీల విలువ రూ.260 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- డిసెంబర్ క్వార్టర్‌లో స్పైస్ జెట్ కంపెనీ నికర లాభం 160 శాతం పెరగడంతో కంపెనీ షేరు దూసుకెళ్లింది. బీఎస్‌ఈలో 12 శాతం బలపడి రూ.39.70 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 15శాతం లాభపడి రూ.40.75 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై దివాలా ప్రక్రియకు స్టే



న్యూఢిల్లీ: మీడియా దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్)కు నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)లో ఊరట లభించింది. కంపెనీపై దివాలా ప్రక్రియకు సంబంధించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన ఉత్తర్వులపై ఎన్‌సీఎల్‌ఏటీ స్టే విధించింది. అలాగే, రెండు వారాల్లోగా సమాధానాలను సమర్పించాలంటూ ఇండస్‌ఇండ్ బ్యాంక్, తాత్కాలిక పరిష్కార నిపుణులకు సూచించింది. ఇరు పక్షాలు వేసిన పిటిషన్లపై వివరంగా విచారణ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఎన్‌సీఎల్‌ఏటీ నిర్ణయాన్ని గౌరవిస్తామని జీల్ ఎండీ పునీత్ గోయెంకా తెలిపారు. కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ (గతంలో సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా)తో విలీన ప్రక్రియ పూర్తి చేయడంపై దృష్టి పెడతామని పేర్కొన్నారు.

జీ గ్రూప్‌లో భాగమైన సిటీ నెట్‌వర్క్స్ .. ఇండస్‌ఇండ్ బ్యాంక్‌కు రూ. 89 కోట్లు డిఫాల్ట్ అయ్యింది. ఈ రుణానికి జీల్ హామీదారుగా ఉండటంతో రెండు సంస్థలపైనా దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ ఎన్‌సీఎల్‌టీలో ఇండస్‌ఇండ్ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఎన్‌సీఎల్‌టీ.. ఇద్దరు పరిష్కార నిపుణులను కూడా నియమించింది. దీనిపై జీల్.. ఎన్‌సీఎల్‌ఏటీని ఆశ్రయించింది.

ఎయిర్ ఇండియా భారీ నియామకాలు



న్యూఢిల్లీ: విమానయాన రంగ సంస్థ ఎయిర్ ఇండియా కొత్తగా 5,100 మందిని నియమించుకోనున్నట్టు ప్రకటించింది. వీరిలో 900 మంది పైలట్లతోసహా 4,200 మంది విమాన సిబ్బందిని (క్యాబిన్ క్రూ) చేర్చుకోనున్నట్టు వెల్లడించింది. బోయింగ్, ఎయిర్‌బస్ నుంచి 470 విమానాలను ఎయిర్ ఇండియా సమకూర్చుకుంటున్న సంగతి తెలిసిందే. దేశీయంగా, అంతర్జాతీయంగా వేగంగా విస్తరిస్తున్నందున కొత్త నియామకాలు చేపట్టినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి మధ్య 1,900 మందికిపైగా విమాన సిబ్బందిని కంపెనీ చేర్చుకుంది. అభ్యర్థులకు ముంబైలోని ఎయిర్ ఇండియా ట్రెయినింగ్ సెంటర్‌లో 15 వారాల పాటు తరగతి గది, ఇన్‌ఫ్లైట్ శిక్షణ ఇస్తారు.

ఓఎన్‌డీసీలోకి అమెజాన్



న్యూఢిల్లీ: ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)లో ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ కూడా చేరనుంది. తమ లాజిస్టిక్స్ నెట్‌వర్క్ (పికప్ నుంచి డెలివరీ వరకూ), స్మార్ట్‌కామర్స్ సర్వీసులను ఓఎన్‌డీసీతో అనుసంధానించనున్నట్లు తెలిపింది. దీంతో విక్రేతలకు మరింతగా టెక్నాలజీపరమైన తోడ్పాటు, చిన్న వ్యాపారాలకు సాధికారత లభించగలదని అమెజాన్ వివరించింది. చెల్లింపులకు సంబంధించి వినియోగంలో ఉన్న ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) తరహాలో ఈ–కామర్స్‌కు ఓఎన్‌డీసీ ఉపయోగపడుతుంది. ప్లాట్‌ఫామ్స్‌తో సంబంధం లేకుండా విక్రేతలు, కొనుగోలుదారులు లావాదేవీలు నిర్వహించేందుకు తోడ్పడుతుంది.

స్పైస్‌జెట్‌కు లాభాలు

డిసెంబర్ క్వార్టర్‌కు రూ.107 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ బడ్జెట్ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ డిసెంబర్ త్రైమాసికానికి రూ.107 కోట్లను ప్రకటించింది. ప్రయాణికులు, సరుకు రవాణా పరంగా పనితీరు మెరుగ్గా ఉండడం లాభాలకు కారణమని కంపెనీ తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలానికి స్పైస్‌జెట్ లాభం రూ.23.28 కోట్లుగా ఉంది. విదేశీ మారకం సర్దుబాటుకు ముందు చూస్తే డిసెంబర్ క్వార్టర్‌లో లాభం రూ.221 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.2,679 కోట్ల నుంచి రూ.2,794 కోట్లకు పెరిగింది. ''మా ప్యాసింజర్, కార్గో వ్యాపారం మంచి పనితీరు చూపించడం లాభాలకు తోడ్పడింది. రికవరీ సంకేతాలు కనిపిస్తున్నాయి. రుణ భారం తగ్గించుకునేందుకు సానుకూల పరిస్థితులు ఉన్నాయి'' అని స్పైస్‌జెట్ చైర్మన్, ఎండీ అజయ్ సింగ్ తెలిపారు.

అంచనాలను మించి యూకో బ్యాంక్ లాభాలు

బ్యాంక్ ఎండీ సోమ శంకర ప్రసాద్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంచనాలను మించి రూ.1,700 కోట్ల లాభం ఆర్జించే అవకాశం ఉందని యూకో బ్యాంక్ ఎండీ, సీఈవో సోమ శంకర ప్రసాద్ శుక్రవారమిక్కడ మీడియాకు వెల్లడించారు. వాస్తవానికి బ్యాంక్ 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.1,500 కోట్ల లాభం లక్ష్యంగా చేసుకుంది. డిసెంబర్ త్రైమాసికానికి రూ.653 కోట్లు, ఏప్రిల్–డిసెంబర్ కాలానికి రూ.1,281 కోట్ల లాభం సాధించింది. 80 ఏళ్ల బ్యాంక్ చరిత్రలో ఈ లాభాలు అత్యధికమని ఎండీ తెలిపారు. నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పీఏ) మారుతున్న ఖాతాల కంటే రాని బాకీల రికవరీ అధికంగా ఉండడం వల్లే ఈ స్థాయి లాభాలు సాధ్యమయ్యాయని చెప్పారు. 2021–22లో ఎన్‌పీఏలు రూ.6,000 కోట్లు ఉంటే, డిసెంబర్‌తో ముగిసిన 9 నెలల కాలానికి రూ.1,450 కోట్లు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. 2022 డిసెంబర్ నాటికి యూకో బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.3.94 లక్షల కోట్లు. మార్చి నాటికి రూ.4 లక్షల కోట్లను దాటుతుందని సోమ శంకర ప్రసాద్ వెల్లడించారు. టైర్–1 బాండ్ల జారీ ద్వారా రూ.500 కోట్లు సమీకరిస్తామన్నారు.



బోపన్న–ఎబ్డెన్ జోడీకి టైటిల్

భారత సీనియర్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తన కెరీర్‌లో 23వ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. దోహాలో శుక్రవారం జరిగిన ఖతర్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ విజేతగా నిలిచింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–7 (5/7), 6–4, 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో కాన్‌స్టంట్ లెస్టిన్ (ఫ్రాన్స్)–బోటిక్ జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్) జోడీపై గెలిచింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయిన బోపన్న జోడీ ఆ తర్వాత రెండో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. అనంతరం నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో తొలుత పది పాయింట్లు స్కోరు చేసి టైటిల్‌ను సొంతం చేసుకుంది.బోపన్న–ఎబ్డెన్‌లకు 72,780 డాలర్ల (రూ. 60 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

దక్షిణాఫ్రికా తొలిసారి...

- ప్రపంచకప్ ఫైనల్లో సఫారీ మహిళల జట్టు
- సెమీస్‌లో ఇంగ్లండ్‌పై విజయం



కేప్‌టౌన్: ఐసీసీ టోర్నీల్లో ఆరంభ దశలో రాణించడం, అసలు మ్యాచ్‌లకు వచ్చేసరికి బోర్లా పడటం దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు అలవాటే. పురుషులతో పాటు మహిళల టీమ్‌లోనూ ఇది చాలా సార్లు కనిపించింది. ఇప్పుడు వీటికి ముగింపు పలుకుతూ దక్షిణాఫ్రికా మహిళల టీమ్ టి20 ప్రపంచకప్‌లో ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల, మహిళల జట్లను కలిపి చూస్తే ఏ ఫార్మాట్‌లోనైనా సఫారీ టీమ్ ఐసీసీ టోర్నీలో ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి కావడం విశేషం. సొంతగడ్డపై లీగ్ దశలో తొలి మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో అనూహ్యంగా ఓడిన తర్వాత కోలుకున్న టీమ్ ఇప్పుడు తుది సమరానికి సిద్ధమైంది. శుక్రవారం జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికా 6 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తజ్మీన్ బ్రిట్స్ (55 బంతుల్లో 68; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), లౌరా వాల్‌వర్ట్ (44 బంతుల్లో 53; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 82 బంతుల్లో 96 పరుగులు జోడించారు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 158 పరుగులే చేయగలిగింది. నాట్ సీవర్ (34 బంతుల్లో 40; 5 ఫోర్లు) టాప్ స్కోరర్. షబ్నిమ్ ఇస్మాయిల్ (3/27), అయబొంగ ఖాక (4/29) ఇంగ్లండ్‌ను దెబ్బ తీశారు. షబ్నిమ్ వేసిన చివరి ఓవర్లో విజయానికి 13 పరుగులు అవసరం కాగా, ఇంగ్లండ్ 6 పరుగులే చేయగలిగింది. రేపు జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా తలపడుతుంది.

ఫైనల్లో ఎన్‌ఆర్‌ఐ, సాయి గణపతి కాలేజీలు





చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ స్థాయి పురుషుల క్రికెట్ టోర్నమెంట్ తుది దశకు చేరుకుంది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ టోర్నీ జరుగుతోంది. జూనియర్ విభాగంలో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజి (విశాఖపట్నం), ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కాలేజి (విజయవాడ) జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఏపీ ఐఐఐటీ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజి తొమ్మిది వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట ఏపీ ఐఐఐటీ నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 66 పరుగులు చేసింది. ఎ.రాంబాబు (37; 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. సాయి గణపతి బౌలర్లలో బి.కుమార్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం సాయి గణపతి కాలేజి 8.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 69 పరుగులు చేసి గెలిచింది. జి.బౌరి (44 నాటౌట్; 4 ఫోర్లు), మధు (18 నాటౌట్; 2 ఫోర్లు) ఆకట్టుకున్నారు. ఏపీ ఐఐఐటీ (ఇడుపులపాయ)తో జరిగిన మరో మ్యాచ్‌లో ఎన్‌ఆర్‌ఐ కాలేజి 30 పరుగుల తేడాతో నెగ్గింది. ముందుగా ఎన్‌ఆర్‌ఐ కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఎస్‌కే జాఫర్ (46 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), ఇక్తాన్ సింగ్ (30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. 99 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఏపీ ఐఐఐటీ 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. ఎన్‌ఆర్‌ఐ కాలేజి బౌలర్ బి.తరుణ్ నాలుగు వికెట్లు తీశాడు. ఏపీ ఐఐఐటీ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది.

సీనియర్ విభాగంలో ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)పై సర్ సీఆర్ రెడ్డి కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ (ఏలూరు) పరుగు తేడాతో గెలిచింది. తొలుత సర్ సీఆర్ రెడ్డి కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. వి.గగన్ కుమార్ (37; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఎంవీజీఆర్ కాలేజి బౌలర్లు కల్యాణ్ మూడు వికెట్లు, సురేష్ రెండు వికెట్లు తీశారు. అనంతరం ఎంవీజీఆర్ కాలేజి నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసి ఒక పరుగు తేడాతో విజయాన్ని చేజార్చుకుంది. నేడు సీనియర్ విభాగం ఫైనల్లో సీకామ్ డిగ్రీ కాలేజీతో సర్ సీఆర్ రెడ్డి కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ జట్టు; జూనియర్ విభాగం ఫైనల్లో ఎన్‌ఆర్‌ఐ కాలేజితో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజి తలపడతాయి.

కోచ్ పార్క్‌తో సింధు కటీఫ్!

- ఇటీవలి విఫల ప్రదర్శనే కారణం
- హఫీజ్ హషీమ్ వద్ద సాధనకు సిద్ధం



> సింధుతో నా భాగస్వామ్యం గురించి చాలా మంది అడుగుతున్నారు. ఇటీవల ఆమె ప్రదర్శన బాగాలేదు. ఒక కోచ్‌గా నేను కూడా అందుకు బాధ్యుడనే. అందుకే ఆమె మార్పు కోరుతుంది. కొత్త కోచ్ కావాలని ఆశిస్తోంది. ఆమె నిర్ణయాన్ని నేను గౌరవిస్తున్నా. వచ్చే ఒలింపిక్స్ వరకు సింధుతో లేకపోవడం కొంత బాధగా ఉన్నా మరో రూపంలో సింధుకు సహకరిస్తా. ఆమెతో కోచింగ్‌లో పాల్గొన్న ప్రతీ క్షణాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటా.
>
> –పార్క్ టే సంగ్

సాక్షి, హైదరాబాద్: ఒలింపిక్స్‌లో తాను రెండో పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన కోచ్‌తో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తెగదెంపులు చేసుకుంది. దక్షిణ కొరియాకు చెందిన పార్క్ టే సంగ్ వద్ద ఇకపై సింధు ప్రాక్టీస్ చేయబోవడం లేదు. ఇటీవల తాను ఆశించిన విజయాలను సింధు అందుకోలేకపోవడమే అందుకు కారణం. తమ భాగస్వామ్యం ముగిసిందనే విషయాన్ని పార్క్ స్వయంగా ధ్రువీకరించాడు. సింధు పరాజయాల్లో తన పాత్ర కూడా ఉందని అతను పేర్కొనడం విశేషం. గాయంతో ఐదు నెలలు ఆటకు దూరమైన సింధు జనవరిలో జరిగిన మలేసియా ఓపెన్‌తో మళ్లీ బరిలోకి దిగింది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లోనే కరోలినా మారిన్ (స్పెయిన్) చేతిలో ఓడిన ఆమె, సొంతగడ్డపై జరిగిన ఇండియా ఓపెన్‌లోనూ అనూహ్యంగా మొదటి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. టీమ్ ఈవెంట్ అయిన ఆసియా మిక్స్‌డ్ చాంపియన్‌షిప్‌లో ఒక మ్యాచ్ గెలవగలిగినా... ర్యాంకింగ్స్‌లో తనకంటే ఎంతో దిగువన ఉన్న గావో ఫాంగ్ జి చేతిలో పరాజయం ఊహించనిది. 2019 నుంచి సింధుకు పార్క్ వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించాడు. ఈ నాలుగేళ్లలో మూడు బీడబ్ల్యూఎఫ్ టైటిల్స్‌తో పాటు కామన్వెల్త్ క్రీడల్లో కూడా సింధు స్వర్ణం సాధించింది. అన్నింటికి మించి టోక్యో ఒలింపిక్స్‌లో సింధు కాంస్యం సాధించడం పార్క్‌కు పేరు తీసుకొచ్చింది. ఈ విజయం తర్వాత అన్ని వేదికల్లోనూ తన పతక సాధనకు పార్క్‌నే కారణంగా చూపిస్తూ సింధు ప్రశంసలు కురిపించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం పార్క్ ఇప్పటికే గచ్చిబౌలిలో భారత జూనియర్ జట్టుతో చేరి వర్ధమాన ఆటగాళ్ల కోచింగ్‌లో నిమగ్నమయ్యాడు.

సుచిత్ర అకాడమీలో...

భారత చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ నుంచి విడిపోయిన తర్వాత సింధు 'సుచిత్ర అకాడమీ'లోనే సాధన చేస్తోంది. భారత ప్రభుత్వం వారి టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్) పథకం ప్రకారం తన వ్యక్తిగత కోచ్‌ను ఎంచుకునే అవకాశం సింధుకు ఉంది. భారత జట్టు కోచ్‌గా వచ్చిన పార్క్‌ను ఈ సౌలభ్యం కారణంగానే తన వ్యక్తిగత కోచ్‌గా మార్చుకొని 'సుచిత్ర'లో సింధు ప్రాక్టీస్ కొనసాగించింది. ఇటీవల తమ అకాడమీలోని దాదాపు 35 మంది షట్లర్ల శిక్షణ కోసం 'సుచిత్ర అకాడమీ' మలేసియా మాజీ ఆటగాడు హఫీజ్ హషీమ్‌తో మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంది. దాంతో సింధు కూడా హఫీజ్ వద్ద శిక్షణ తీసుకోవడం ఖాయమైంది. ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ టోర్నీ (మార్చి 14–19)కి ముందు కనీసం రెండు వారాలు హఫీజ్ వద్ద సింధు ప్రాక్టీస్ చేయనుంది. అయితే హఫీజ్‌ను పూర్తి స్థాయిలో అధికారికంగా 'వ్యక్తిగత కోచ్'గా సింధు నియమించుకుంటుందా అనే విషయంపై స్పష్టత లేదు. హఫీజ్ 2003లో ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో విజేతగా నిలిచాడు.

మూడో టెస్టుకు కమిన్స్ దూరం

- ఇంకా ఆస్ట్రేలియాలోనే కెప్టెన్
- ఇండోర్ టెస్టులో సారథిగా స్మిత్



న్యూఢిల్లీ: వరుస ఓటములు, ఆటగాళ్ల గాయాలు, స్వదేశానికి తిరుగుముఖాలతో ప్రపంచ నంబర్‌వన్ టెస్టు టీమ్ ఆస్ట్రేలియా అంతకంతకూ కుదేలవుతోంది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అత్యవసర కారణాలతో భారత్‌ను వీడాడు. దీంతో మాజీ కెప్టెన్ స్టీవెన్ స్మిత్ తదుపరి టెస్టుల్లో కంగారూ సేనను నడిపించనున్నాడు. కమిన్స్ తల్లి తీవ్ర అస్వస్థతకు గురవడంతో రెండో టెస్టు ముగియగానే అతను తిరుగుముఖం పట్టాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) పేర్కొంది. నిజానికి మూడో టెస్టుకల్లా అతను తిరిగొస్తాడని సీఏ భావించినప్పటికీ ఇప్పుడా పరిస్థితి లేదని తెలిసింది. దీంతో స్టీవ్ స్మిత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులోకి రావడంగొప్ప ఊరట. గాయంతో రెండు టెస్టులు ఆడలేకపోయిన అతను మూడో టెస్టు బరిలోకి దిగుతాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు సభ్యులంతా ఢిల్లీలోనే ఉన్నారు. ఆదివారం ఇండోర్‌కు బయల్దేరుతారు. భారత్ 2–0తో ఆధిక్యంలో ఉన్న ఈ సిరీస్‌లో మూడో టెస్టు వచ్చే నెల 1 నుంచి ఇండోర్‌లో జరుగుతుంది.

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా వార్నర్



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీలో పాల్గొనే ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆస్ట్రేలియా ఓపెనర్ వార్నర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. భారత జట్టు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్ గా నియమించారు. ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా ఉన్న రిషభ్ పంత్ కారు ప్రమాదంలో గాయపడి ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యాడు. దాంతో పంత్ స్థానంలో వార్నర్‌ను సారథిగా ఎంపిక చేయాల్సి వచ్చింది. గతంలో వార్నర్ నాలుగున్నర సీజన్లు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వార్నర్ సారథ్యంలో 2016లో సన్‌రైజర్స్ జట్టు ఐపీఎల్ విజేతగా నిలిచింది.

బ్రూక్, రూట్ సెంచరీలు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ జట్టుతో రెండో టెస్టులో తొలిరోజు ఇంగ్లండ్ 65 ఓవర్ల లో 3 వికెట్లు కోల్పోయి 315 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (169 బంతుల్లో 184 బ్యాటింగ్; 24 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి సెంచరీ సాధించగా... జో రూట్ (182 బంతుల్లో 100 బ్యాటింగ్; 7 ఫోర్లు) కెరీర్‌లో 29వ సెంచరీ చేశాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 294 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. వర్షం కారణంగా తొలి రోజు ఆటను 65 ఓవర్ల వద్ద ముగించారు. అంతకుముందు ఇంగ్లండ్ 21 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

రెజ్లర్ అంకిత్‌కు కాంస్యం

అలెగ్జాండ్రియా (ఈజిప్ట్): యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇబ్రహీమ్ ముస్తఫా స్మారక ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో భారత రెజ్లర్ అంకిత్ గులియా కాంస్య పతకం సాధించాడు. శుక్రవారం జరిగిన పురుషుల గ్రీకో రోమన్ 72 కేజీల విభాగంలో అంకిత్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. కాంస్య పతక బౌట్‌లో అంకిత్‌తో తలపడాల్సిన ఇరాన్ రెజ్లర్ మొహమ్మద్ రజా గాయం కారణంగా బరిలోకి దిగలేదు.

క్లుప్తంగా...

4 వర్సిటీల వీసీల నియామకానికి సెర్చ్ కమిటీల ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నాలుగు వర్సిటీలకు ఉపకులపతుల నియామకానికి సంబంధించి అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం గురువారం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా వర్సిటీ, ఆదికవి నన్నయ వర్సిటీ, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, యోగి వేమన వర్సిటీలకు వీసీల నియామకానికి వీలుగా ఈ కమిటీలను ఏర్పాటు చేస్తూ, కమిటీలు మూడేసి పేర్లతో నివేదికలను సమర్పించాలని సూచించింది.

బూత్‌స్థాయిలో పటిష్టంతోనే బీజేపీ బలోపేతం

పార్టీ నేతల సమావేశంలో కేంద్రమంత్రి భారతీప్రవీణ్ పవార్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్రమంత్రి భారతీ ప్రవీణ్ పవార్

సాక్షి, అమరావతి: పోలింగ్‌బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయడం ద్వారానే రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అవుతుందని కేంద్ర మంత్రి భారతీప్రవీణ్ పవార్ చెప్పారు. బీజేపీ ప్రవాస యోజన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా పోలింగ్‌బూత్ స్వశక్తి కరణ్ అభియాన్‌లో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించే మన్ కీ బాత్ పోలింగ్‌బూత్ స్థాయిలో నిర్వహిస్తే కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులు గ్రామాల్లో ప్రచారం కల్పించడానికి వీలు కలుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలంలో పోలింగ్‌బూత్ కమిటీల నియామకంపై పర్యవేక్షణకు మండలానికి నలుగురు సభ్యుల చొప్పున కమిటీలను ఆమె నియమించారు. ఆయా సభ్యులతో నేరుగా మాట్లాడారు. అనంతరం ఆమె రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన టీటీడీ చైర్మన్



సాక్షి, అమరావతి: టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తిరుమల శ్రీవారి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు.

మార్చి 3 నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు



తిరుమల పుష్కరిణిలో తెప్పోత్సవాలకు సిద్ధమైన తెప్ప

తిరుమల: తిరుమలలో మార్చి 3 నుంచి 7వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరుగనున్నాయి. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో పుష్కరిణిలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలి రోజు సీతా లక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి అవతారంలో స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. 4న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి అవతారంలో విహరిస్తారు. 5న శ్రీదేవి భూదేవి సమేతంగా మలయప్ప స్వామిగా దర్శనమిస్తారు. ఇదేవిధంగా శ్రీమలయప్ప స్వామి వారు 6న ఐదు సార్లు, 7న ఏడు సార్లు తెప్పపై విహరించి భక్తులను కటాక్షిస్తారు. తెప్పోత్సవాల కారణంగా మార్చి 3, 4వ తేదీల్లో తోమాలసేవ, అర్చన, సహస్రదీపాలంకార సేవ, 5, 6వ తేదీల్లో తోమాలసేవ, అర్చన, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, మార్చి 7న ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో గురువారం అర్ధరాత్రి వరకు 57,737 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

‘రీల్స్’ చుట్టేస్తున్నారు

సోషల్ మీడియాలో కంటెంట్ సృష్టికర్తలు



- వ్యక్తిగత విశేషాలు, విజ్ఞాన, సృజనాత్మక వీడియోలతో యువత సందడి
- షార్ట్ ఫామ్ వీడియోల ద్వారా పెరుగుతున్న సమాచార వ్యాప్తి
- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వినియోగంలో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానం

కాస్త సృజనాత్మకత.. ఇంకాస్త సరదా.. కలగలిపిన వీడియో ‘రీల్స్’ కొత్త ఒరవడి సృష్టిస్తోంది. సోషల్ మీడియాలో సందడి చేస్తున్న కొన్ని షార్ట్ వీడియోలు వినోదం పంచుతుంటే.. ఇంకొన్ని ప్రజల చెంతకు విజ్ఞానాన్ని చేరుస్తున్నాయి. సరదాగా చేసిన షార్ట్ వీడియో.. షార్ట్ టైమ్‌లో స్టార్‌లను చేస్తోంది.

సాక్షి, అమరావతి: సోషల్ మీడియా సామాన్యులను సైతం కంటెంట్ సృష్టికర్తలుగా మార్చేస్తోంది. చిన్న చిన్న రీల్స్‌లో ‘రియల్ లైఫ్’ డైరెక్షన్ చేయిస్తోంది. టిక్‌టాక్‌పై నిషేధం తర్వాత ఇన్‌స్టాగ్రామ్ తీసుకొచ్చిన ‘రీల్స్ ఫీచర్’ వినియోగంలో ప్రపంచంతో పోలిస్తే భారతదేశం అగ్రస్థానంలో స్ట్రీమ్ అవుతోంది. ప్రస్తుతం దేశంలో 230.25 మిలియన్ల ఇన్‌స్టాగ్రామ్ వినియోగదారులు ఉంటే.. ఇందులో ఏకంగా 200 మిలియన్ల ప్రజలు రోజుకు 45 నిమిషాల పాటు షార్ట్ ఫామ్ వీడియోల్లో గడుపుతున్నారు. ఈ సంఖ్య త్వరలో 600 మిలియన్లకు చేరుతుందని ఇన్‌స్టాగ్రామ్ తన సర్వేలో వెల్లడించింది.

కాదేదీ రీల్స్‌కు అనర్హం

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఇతర వీడియో రీల్స్ ప్లాట్‌ఫామ్‌లతో పోలిస్తే యువతకు ఎక్కువ శ్రమ, నైపుణ్యం అవసరం లేకుండా చిన్న వీడియోలను రూపొందించడానికి చక్కని వేదికగా మారింది. డబ్బింగ్, రీమిక్స్, సోషల్ ఛాలెంజెస్, షాపింగ్ ప్రమోషన్లు, ప్రతిభా ప్రదర్శనలు, రచులు, అభిరుచులు, డబ్‌స్మాష్‌లు, ఫ్యాషన్, మేకప్, ఆరోగ్య చిట్కాలు, వైద్యం, విద్య, ట్రావెలింగ్ ఇలా.. ఒకటేమిటి కాదేదీ రీల్స్‌కు అనర్హం అన్నట్టు మారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా విశేషాలను పంచుకునే సమాచార, విజ్ఞాన వేదికగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ గుర్తింపు పొందింది. ప్రతినెలా 200 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు రీల్స్‌లో మునిగితేలుతున్నారు. ఇది 2023 నాటికి 2.5 బిలియన్ యూజర్లకు చేరుకుంటుందని అంచనా. ఇన్‌స్టాగ్రామ్ ప్రేక్షకుల్లో ఎక్కువ మంది (31.5 శాతం) 25–34 ఏళ్ల మధ్య వయస్కులే ఉంటున్నారు.

అత్యధిక డౌన్‌లోడ్‌లలో రెండోది

2022లో ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా డౌన్‌లోడ్ చేసిన యాప్‌లలో ఇన్‌స్టాగ్రామ్ రెండో స్థానంలో నిలిచిందంటే రీల్స్ ఎఫెక్ట్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రారంభంలో 15 సెకన్ల నిడివి నుంచి ఇప్పుడు 90 సెకన్లు వరకు వీడియో రీల్స్ సమయం పెరిగింది. ఇటీవల 15 నిమిషాల్లోపు వీడియోలను కూడా రీల్స్‌గా ఇన్‌స్టాగ్రామ్ పరిగణిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో సాధారణ వీడియో పోస్టింగ్‌ల కంటే రీల్స్ 22 శాతం ఎక్కువగా ఉంటున్నాయి. రీల్స్ ప్రారంభం అయిన తర్వాత బ్రెజిల్‌లో ఇన్‌స్టాగ్రామ్ వినియోగం 4.3 శాతం పెరిగింది.



2020లో ప్రారంభమైన ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ రెండేళ్లలో బిలియన్ల ప్రజలను ఆకట్టుకోవడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా సగటున ఒక వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో 30–50 నిమిషాలు గడుపుతున్నారు. కేవలం రీల్స్ ద్వారా ప్రకటనలు 675.3 మిలియన్ల మందికి వేగంగా చేరుకోగలుగుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ సగటు వీడియో వీక్షణ రేటు 2.54 శాతం. ఇది సాధారణ వీడియో వీక్షణలతో పోలిస్తే 0.8 శాతం ఎక్కువగా ఉంది.

దేశాల వారీగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వినియోగదారుల సంఖ్య

దేశం	వినియోగదారులు (మిలియన్లు)
భారత్	230.25
యూఎస్	159.75
బ్రెజిల్	119.45
ఇండోనేషియా	99.15
రష్యా	63.0
టర్కీ	52.15
జపాన్	46.1
మెక్సికో	37.85
యూకే	31.75
జర్మనీ	29.85
ఇటలీ	27.5
ఫ్రాన్స్	26.55
అర్జెంటీనా	24.7
స్పెయిన్	22.85
దక్షిణ కొరియా	20.65
ఫిలిప్పీన్స్	18.65
థాయిలాండ్	18.5
కొలంబియా	18.3
కెనడా	17.4

వయసుల వారీగా వినియోగదారుల శాతం

వయసు	శాతం
13–17	8.5
18–24	30.1
25–34	31.5
35–44	16.1
45–54	8.0
55–64	3.6
65 పైబడిన	2.1

సామాజిక విప్లవంతో టీడీపీ ఉనికి ప్రశ్నార్థకం

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం జగన్ తీసుకొచ్చిన సామాజిక విప్లవం తమ ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తుందన్న భయంతోనే టీడీపీ అరాచకాలకు పాల్పడుతోందని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు విమర్శించారు. శుక్రవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. కుట్రపూరిత వ్యూహంతోనే గన్నవరంలో టీడీపీ అల్లర్లకు పాల్పడిందని మండిపడ్డారు. సామాజిక సంస్కరణలే కాకుండా సంక్షేమ పాలన అందిస్తూ అంబేడ్కర్ భావజాలాన్ని సీఎం జగన్ ప్రదర్శిస్తున్నారని కొనియాడారు. తాజాగా 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక కోణంలో చూసిన గొప్ప సంస్కర్తగా సీఎం జగన్‌ను ఆయన అభివర్ణించారు.

రచనలను 7లోగా పంపాలి

విద్యా వ్యవస్థతో పాటు విజ్ఞాన భాండాగారాల్లో డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సదుద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి అన్నారు. డిజిటల్ లైబ్రరీలు, సీఎం జగన్ పాలనపై రచయితలు, కవులు, మేధావులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు తమ కవితలు, పాటలు, పద్యాలు, వ్యాసాల ద్వారా సమాజంలో చైతన్యం కలిగించాలని మందపాటి ఓ ప్రకటనలో కోరారు. గ్రంథాలయోద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి 7వ తేదీలోగా తమ రచనలను మంగళగిరిలోని ఏపీ గ్రంథాలయ పరిషత్ కార్యాలయానికి పంపించాలని కోరారు. కాగా, పాత్రికేయుల రచనలను గ్రంథాలయ సంస్థ కొనుగోలు చేసి అందరికీ అందుబాటులో పౌర గ్రంథాలయాల్లో ఉంచాలని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మందపాటికి లేఖ అందించారు. విజయవాడ ప్రెస్ అకాడమీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మందపాటితో ఆయన చర్చించారు.

నా కుమారుడు తప్పు చేయలేదు

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



ఒంగోలు సబర్బన్: ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి తన కుమారుడు రాఘవరెడ్డి ఎలాంటి తప్పు చేయలేదని, సీబీఐ అక్రమంగా అరెస్ట్ చేసిందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎలాంటి పాత్ర లేకపోయినా తన కుమారుడిపై అక్రమంగా కేసు బనాయించి అరెస్ట్ చేశారని వాపోయారు. తన బిడ్డ ఎలాంటి తప్పు చేయలేదని గతంలో కూడా పలుమార్లు చెప్పానన్నారు. తాను కోర్టులో కలిసినప్పుడు మాగుంట కుటుంబాన్నిగానీ, పెదనాన్న సుబ్బరామిరెడ్డినిగానీ అప్రతిష్ట పాలుచేయలేదని, మీకు తలవంపులు తెచ్చే ఎలాంటి తప్పు చేయలేదని తనకు చెప్పారని తెలిపారు. ‘మా నాన్న మాగుంట రాఘవరెడ్డి 70 సంవత్సరాల కిందట మద్యం వ్యాపారం ప్రారంభించారు. దాదాపు 10 రాష్ట్రాల్లో ఈ వ్యాపారం చేస్తున్నాం. ఏ రాష్ట్రంలో కూడా ఎలాంటి తప్పులు చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండానే వ్యాపారాలు చేస్తూ వస్తున్నాం. మా అన్న సుబ్బరామిరెడ్డి కూడా సక్రమ మార్గంలోనే వ్యాపారాలు చేస్తూ ప్రకాశం జిల్లా రాజకీయాల్లోకి ప్రవేశించారు. నాకు కూడా వ్యాపారాల్లో 50 సంవత్సరాల అనుభవం ఉంది. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందుకోసం తాను ధైర్యంగా ఉన్నానని నా కుమారుడు చెప్పాడు. నన్ను కూడా ధైర్యంగా ఉండమన్నాడు. ఇలాంటి కొడుకును నాకు ఇచ్చినందుకు ఆ భగవంతుడికి రుణపడి ఉంటాను. నేను, నా కుటుంబం ఒకటే కోరుకుంటున్నాం. మేము ధైర్యంగా ఉన్నాం. జిల్లా ప్రజలు, శ్రేయోభిలాషులు కూడా అందరూ నా బిడ్డను ఆశీర్వదించండి. జిల్లాలో మాగుంట సుబ్బరామిరెడ్డి ఎంతో కష్టపడ్డారు. జిల్లాకు సేవ చేయటానికే వచ్చాం. అంతా మేలు జరగాలని కోరుకుంటున్నా..’ అని చెప్పారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకుమించి ఎక్కువ మాట్లాడకూడదన్నారు. తరువాత నిజానిజాలు మీముందు ఉంచుతానని జిల్లా ప్రజలకు, వైఎస్సార్‌సీపీ కేడర్‌కు ఆయన వివరించారు.

స్టాంపుల చట్టంపై అధ్యయనానికి కమిటీ

సాక్షి, అమరావతి: భారత స్టాంపుల చట్టానికి అనుగుణంగా ఇక్కడి అవసరాలు, పరిస్థితులను బట్టి ఏపీ స్టాంపుల చట్టం ముసాయిదా తయారు చేసే విషయంపై అధ్యయనం కోసం ప్రభుత్వం అధికారుల కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అదనపు ఐజీ, గుంటూరు డీఐజీ, మరో ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేశం మొత్తానికి ఒకటే స్టాంపుల చట్టం అమల్లో ఉంది. అయితే, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాలు సొంతగా స్టాంపుల చట్టాన్ని రూపొందించుకున్నాయి. మన రాష్ట్రంలోనూ అలాగే ఏపీ స్టాంపుల చట్టాన్ని తీసుకురావడానికి కొద్దిరోజులుగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనివల్ల భవిష్యత్‌లో స్టాంపు డ్యూటీ, ఇతర అంశాలు ఏమైనా మార్చుకోవాలంటే రాష్ట్ర స్థాయిలోనే సవరించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ చట్టంలో ఏమైనా మార్పులు కావాలంటే కేంద్ర ప్రభుత్వం చేయాలి. సొంతగా స్టాంపుల చట్టం ఉంటే కేంద్ర స్టాంపుల చట్టానికి రాష్ట్రమే సవరణలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆ దిశగా ఏపీ స్టాంపుల చట్టం రూపకల్పన కోసం ఇటీవల రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు 9 రాష్ట్రాల్లో పర్యటించారు. అక్కడ అమల్లో ఉన్న స్టాంపుల చట్టాలను పరిశీలించి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అధ్యయనం చేశారు. వాటిలో ఏపీకి ఉపయోగపడే వాటిని తీసుకోవడం, ఇక్కడి పరిస్థితులను బట్టి కొత్త స్టాంపుల చట్టంలో పొందుపరిచే విషయంపైనా ఒక అవగాహనకు వచ్చారు. స్టాంపు డ్యూటీకి సంబంధించిన షెడ్యూల్–1ని ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా మార్చనున్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన ఐదుగురు సభ్యుల ఐఏఎస్ అధికారుల కమిటీ కూడా ఏపీ స్టాంపుల చట్టాన్ని తీసుకురావాలని సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో 15 రోజుల్లో ఏపీ స్టాంపుల చట్టం ముసాయిదాను తయారు చేసేందుకు ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది.

26న విజయవాడలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సదస్సు

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలో జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాతీయ సదస్సుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏపీజేఏసీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఏపీఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబ, సెక్రటరీ జనరల్ ఎ.శ్రీకుమార్ హరియాణా, కేరళ రాష్ట్రాల నుంచి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య ప్రతినిధులు రెండువేల మంది హాజరవుతారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.

కల్తీ ఆహారం.. క్యాన్సర్ కారకం!

బయటి ఆహారం ఎక్కువగా తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు

- వెలుగుచూస్తున్న జీర్ణాశయ, అన్నవాహిక క్యాన్సర్లు
- పెరుగుతున్న జీవనశైలి జబ్బులు
- శారీరక శ్రమ లేకపోవడమే కారణమంటున్న వైద్యులు

విజయవాడ భవానీపురానికి చెందిన 42 ఏళ్ల వ్యాపారి శ్రీనివాస్(పేరు మార్చాం) అర్ధరాత్రి వరకూ బిజినెస్ వ్యవహారాలు చూస్తుంటారు. అనంతరం తరచూ స్నేహితులతో కలిసి బయట ఎక్కువగా నాన్‌వెజ్ వంటకాలు తింటుంటారు. ఇటీవల తరచూ కడుపునొప్పి రావడం, అరుగుదల తగ్గడంతో వైద్యుడి వద్దకు వెళ్లారు. వైద్యులు పరీక్షించి జీర్ణాశయ క్యాన్సర్‌గా నిర్ధారించారు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ఓ ఉద్యోగి వారంలో నాలుగు రోజులు బయట హోటళ్లలో భోజనం చేస్తుంటాడు. నాన్‌వెజ్, బిర్యానీలు ఎక్కువగా తీసుకుంటుంటాడు. ఇటీవల ఆయనకు కడుపు నొప్పితో పాటు విరేచనంలో రక్తం పడటంతో వైద్యుడిని సంప్రదించాడు. పెద్ద పేగు క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. ఇలా వీరిద్దరే కాదు.. కల్తీ ఆహారం కారణంగా ఇటీవల పెద్దపేగు, జీర్ణాశయ, లివర్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అత్యవసరమైతేనే బయట తినాలి



ఇటీవల జీర్ణాశయ, పెద్ద పేగు క్యాన్సర్లు పెరిగాయి. కల్తీ ఆహారం, నాన్‌వెజ్ ఎక్కువగా తీసుకోవడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. ఆహార పదార్థాలు కల్తీ అవుతున్న నేపథ్యంలో అత్యవసరమైతేనే బయట తినాలి. మాంసాహారంలో కలిపే రసాయనిక రంగులు క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయి.
– డాక్టర్ ఏవై రావు, క్యాన్సర్ వైద్య నిపుణులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆహారంలో కల్తీ, జీవనశైలి మార్పులు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ఇటీవల నమోదవుతున్న క్యాన్సర్ కేసులు వైద్యులను సైతం ఆందోళనకు గురిచేస్తున్నాయి. మధ్య వయస్సులోనే అన్నవాహిక క్యాన్సర్, జీర్ణాశయ, పెద్దపేగు, గర్భాశయ క్యాన్సర్ల బారిన పడుతున్నారు. అర్ధరాత్రి దాటాక కూడా రెస్టారెంట్లు, ఫుడ్ కోర్టుల్లో బిర్యానీల వంటివి ఎక్కువగా తీసుకోవడంతో పలువురికి జీర్ణాశయ వ్యాధులు మొదలై.. అనంతరం క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయి. సమయపాలన లేని ఆహారపు అలవాట్లు కొంపముంచుతున్నాయి. ఇటీవల నగరంలో నమోదవుతున్న క్యాన్సర్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. నాలుగు పదుల వయస్సులోనే జీర్ణాశయ, పెద్దపేగు, లివర్ క్యాన్సర్ సోకుతున్నట్టు చెబుతున్నారు. అప్రమత్తం కాకుంటే రానున్న కాలంలో పెను ముప్పు పొంచి ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కొంపముంచుతున్న కల్తీలు

నాన్‌వెజ్ వంటకాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలు కలిసిన కారంపొడులను ఎక్కువగా వాడుతుంటారు. అంతేకాకుండా కొన్నిచోట్ల మృత జంతువుల కొవ్వు నుంచి తయారు చేసిన కల్తీ నూనెలను వినియోగించి వంటలు చేస్తుండటంతో జీర్ణకోశ వ్యాధులు పెరుగుతున్నాయని చెపుతున్నారు. కల్తీ ఆహారం జీర్ణకోశ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్లకు కారణమవుతోందని, బయట ఆహారం తినడం సాధ్యమైనంత తగ్గించడం ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. మహిళల్లో ఒకప్పుడు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదయ్యేవి. ప్రస్తుతం సర్వైకల్ క్యాన్సర్ కేసులు తగ్గగా.. జీవనశైలి కారణంగా బ్రెస్ట్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అలాగే గర్భాశయ క్యాన్సర్ కేసులూ పెరుగుతున్నాయని చెబుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, ఒబెసిటీ కారణంగా పట్టణవాసులు ఎక్కువగా గర్భాశయ క్యాన్సర్ల బారినపడుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

108 సిబ్బంది సాయంతో సుఖ ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం

వై.రామవరం: పురిటి నొప్పులతో పరిస్థితి విషమంగా ఉన్న నిండుగర్భిణికి తక్షణ సేవలందించి ప్రాణాపాయ పరిస్థితులనుంచి 108 సిబ్బంది కాపాడారు. కొయ్యూరు మండలం నక్కలమెట్ట గ్రామానికి చెందిన కిలో లక్ష్మి (21)కి శుక్రవారం పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఆశా వర్కరు 108కు సమాచారం అందించారు. నక్కమెట్ట గ్రామం పక్కనున్న మరో మండల కేంద్రం వై.రామవరానికి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. రహదారి సౌకర్యం లేక గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో 108 వాహనం నిలిచిపోయింది. సిబ్బంది కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తుల సాయంతో గర్భిణిని డోలీలో 108 వద్దకు తీసుకొస్తుండగా పురిటి నొప్పులు మరింత ఎక్కువై పరిస్థితి విషమంగా మారింది. వెంటనే ఆమెను మార్గంమధ్యలో చెట్టుచాటుకు తీసుకువెళ్లి ఈఎంటీ పి.శ్రీనివాసరావు, పైలెట్ రాఘవులు ప్రసవం చేశారు. ఆమె ఆడశిశువుకు జన్మనిచ్చింది. అక్కడి నుంచి తల్లీబిడ్డలను వేర్వేరు డోలీల్లో 108 వాహనం వద్దకు తీసుకెళ్లి, స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

కుమార్తెను చంపి.. రెండు ముక్కలుచేసి..

- నల్లమల అడవిలో పడేసిన తండ్రి
- నంద్యాల జిల్లాలో ఘాతుకం

పాణ్యం: పెంచి పెద్దచేసి పెళ్లి చేసిన తండ్రే ఆ యువతికి యముడయ్యాడు. కర్కశంగా కుమార్తె గొంతునులిమి హత్యచేయడమేగాక తల, మొండెం వేరుచేసి నల్లమల అడవిలో పడేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గాలించి ఆ యువతి మొండెం, తల స్వాధీనం చేసుకున్నారు. ఈ దారుణ సంఘటన నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఆలమూరులో జరిగింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆలమూరుకు చెందిన దేవేంద్రారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ప్రసన్న (21)కు రెండేళ్ల కిందట జిల్లెల గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం అయింది. ప్రసన్న భర్త హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వివాహమైన కొద్ది నెలలకే ప్రసన్న భర్తపై అలిగి పుట్టింటికి వచ్చింది. పెద్దమనుషులు, పోలీసులు, బంధువులు పంచాయితీ చేశారు. అత్తవారింటికి వెళ్లాలని సూచించినా ఆమె పట్టించుకోలేదు. ఈ నెల 10వ తేదీ రాత్రి దేవేంద్రారెడ్డి కుమార్తెను మరోసారి బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అయినప్పటికి తాను భర్త వద్దకు వెళ్లనని తెగేసి చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన దేవేంద్రారెడ్డి.. ప్రసన్న గొంతు నులిమి చంపేశాడు. మరికొందరి సహాయంతో ప్రసన్న మృతదేహాన్ని వాహనంలో నల్లమల అడవికి తీసుకెళ్లాడు.



ప్రసన్న (ఫైల్)

అక్కడ ప్రసన్న మృతదేహాన్ని తల, మొండెంగా వేరుచేసి బొగద వద్ద వేర్వేరుచోట్ల పడేశారు.

తాత ఫిర్యాదుతో వెలుగులోకి..

దేవేంద్రారెడ్డి మొదటి భార్య (ప్రసన్న తల్లి) ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మరణించింది. దేవేంద్రారెడ్డి కుమార్తె ప్రసన్నకు వివాహం అయిన తరువాత ఇటీవల రెండో వివాహం చేసుకున్నాడు. దేవేంద్రారెడ్డి మొదటి భార్య తండ్రి శివారెడ్డిది కడపజిల్లా పెద్దముడియం మండలం సుంకేసుల గ్రామం. ప్రసన్న గురించి అడిగితే దేవేంద్రారెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో అనుమానం వచ్చిన శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు నల్లమల అడవిలో రెండురోజులు గాలించారు. శుక్రవారం సాయంత్రానికి దాదాపుగా 300 అడుగుల లోయలో ఉన్న ప్రసన్న తల, మొండెం భాగాలను గుర్తించారు. వాటిని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివారెడ్డి ఫిర్యాదు ఆధారంగా దేవేంద్రారెడ్డిపై 302, 202 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి చెప్పారు. ప్రసన్న కాపురానికి వెళ్లకపోవడానికి ప్రేమ వ్యవహారం కారణమని పోలీసులు తేల్చారు.

నౌకాదళ అమ్ములపొదిలో ఎంసీఏ బార్జ్

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళ అమ్ముల పొదిలో మిస్సైల్స్, మందుగుండు సామగ్రిని భద్రపరిచే మిస్సైల్ కమ్ ఎమ్యునేషన్ (ఎంసీఏ) బార్జ్ యార్డ్ 75 చేరింది. భారత నౌకాదళం 8 బార్జ్‌లను తయారు చేయాలని విశాఖపట్నానికి చెందిన సీకాన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సిద్ధం చేసిన బార్జ్‌ని సీకాన్ ప్రయోగ కేంద్రమైన గుత్తెనదీవి వద్ద శుక్రవారం ప్రారంభించారు. మేకిన్ ఇండియాలో భాగంగా దాదాపు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీనిని తయారు చేశారు. నౌకాదళంలో 30ఏళ్ల పాటు ఇవి సేవలందించనున్నాయి. ఈ బార్జ్‌ల ద్వారా యుద్ధ నౌకలకు అవసరమైన మిస్సైల్స్, మందుగుండు సామగ్రిని బార్జ్‌ల ద్వారా సరఫరా చేయనున్నారు.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943